ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు, fb.com/vaartha
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
25-2-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 24 పేజీలు: 12 వెల: 6.50

2వేలమంది యుఎస్ ఎయిడ్ ఉద్యోగులపై ట్రంప్ వేటు
భారతీయ వంటకాల్లో 'మఖానా' సూపర్‌ఫుడ్: ప్రధాని
9వ

# ప్రజల మేలుకే 'సూపర్ సిక్స్'


సోమవారం ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ నజీర్


గవర్నర్ ప్రసంగాన్ని పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

## జీవన ప్రమాణాలు పెంచే పలు సంక్షేమ పథకాలు
### గత ప్రభుత్వం నిలిపిన 93 కేంద్ర పథకాల్లో 74 పునరుద్ధరించాం
### రూ.2.68 లక్షలకు పెరిగిన తలసరి ఆదాయం
### ఉభయసభల ప్రసంగంలో గవర్నర్ నజీర్
### అసెంబ్లీలో 11వ బ్లాక్‌కు పరిమితమైన వైఎస్సార్సీసభ్యులు

**విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి:**ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టామని, అర్హులైన అందరికీ సొంతిల్లు ఉండాలనేది మా ఆకాంక్ష అని గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అన్నారు. ప్రజలకోరిక మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పాటైందని సోమవారం ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. గత ఐదేళ్లలో రాష్ట్రం అనేక ఇబ్బందులకు గురైందని, గత ప్రభుత్వ పాలనతో రాష్ట్రం ఎంతో నష్టపోయిందని గవర్నర్ వ్యాఖ్యానించారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు >>2

## వైఎస్సార్సీకి ప్రతిపక్ష హోదా రాదు..
### ఆ పార్టీ సభ్యులు హుందాగా వ్యవహరించాలి: డి.సిఎం పవన్

**విజయవాడ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త ప్రతినిధి:**ప్రతిపక్ష హోదా అడిగితే ఇచ్చేది కాదని ప్రజలు ఇస్తేనే వస్తుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అత్యధిక మెజార్టీలో రెండో స్థానంలో ఉన్న పార్టీకి ప్రతిపక్ష హోదా ఇస్తారన్నారు. ఈ విషయంలో వైకాంగ్రెస్‌పార్టీ సభ్యులు హుందాగా ప్రవర్తించాలని హితవు పలికారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మీడియా పాయింట్ వద్ద పవన్ మాట్లాడారు. వైకాపా సభ్యులు ప్రతిపక్ష హోదా కోరుతున్నారు. సభలో రెండో అతిపెద్ద పార్టీ జనసేన మాకంటే ఒక్క సీట ఎక్కువ వచ్చినా వాళ్లకి ఆ హోదా దక్కేది. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభను


సోమవారం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

అడ్డుకుంటామని చెప్పడం సరికాదు. ప్రజలు ఇచ్చిన 11 సీట్లను గౌరవించి అసెంబ్లీకి రండి. సమస్యలు , ప్రభుత్వ లోటుపాట్లు తెలియజేయండి. సంఖ్యకు అనుగుణంగా స్పీకర్ సమయం కేటాయిస్తారు. వైకాపా సభ్యులు హుందాగా ప్రవర్తించాలి. సభకు రాగానే ఆందోళన చేయడం ఆ పార్టీ దిగజారుడు తనానికి నిదర్శనం. ఫిక్స్ అయిపోండి 11 సీట్లతో ఈ ఐదేళ్లు వైకాంగ్రెస్‌కు ప్రతిపక్ష >>2

## 5 ఎమ్మెల్సీ సీట్లకు మార్చి 20న పోలింగ్
### అదే రోజు సాయంత్రం కౌంటింగ్
### షెడ్యూలు విడుదల చేసిన సిఇసి

**విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా ఉన్న ఐదుగురు సభ్యుల పదవీ కాలం మార్చి 29లోగా ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 3వ తేదీన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. మార్చి 20వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం కౌంటింగ్ ఉంటుంది.
గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన జంగా కృష్ణ మూర్తి, రామారావు, అశోక్ బాబు, యనమల రామకృష్ణుడు, తిరుమలనాయుడు పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సంఖ్యాబలం దృష్ట్యా ఎన్నికలు జరగనున్న ఐదు ఎమ్మెల్సీ స్థానాలు కూడా ఎన్డీఏ కూటమి ఖాతాలో చేరే అవకాశం ఉంది. అయితే ఎన్డీఏ కూటమిలోని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఈ ఐదు సీట్లు ఎలా పంచుకుంటాయనేదీ ఆసక్తికరంగా మారింది. బీజేపీ కూడా ఎమ్మెల్సీ స్థానం కోరుతుందా, లేక టీడీపీ, జనసేన పార్టీలకు వదిలేస్తుందా అనేది చూడాల్సి ఉంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవుల కోసం కూటమిలో ఆశావహుల సంఖ్య అధికంగా ఉంది. పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం స్థానాన్ని జనసేన అధినేత >>2

## మరింతగా వాట్సాప్ గవర్నెన్స్
### ప్రజలకు అవగాహన పెంచండి
### త్వరలో 500 సేవలకు విస్తరణ
### బెల్టు షాపులను ఉపేక్షించొద్దు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి 24,ప్రభాతవార్తప్రతినిధి:** మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సెల్ ఏర్పాటు చేసి, వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజలు విస్తృతంగా ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ల కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఈ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు 500 సేవలు కల్పించనుందని తెలిపారు. సోమవారం సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాట్సాప్ గవర్నెన్స్ అమలు ప్రగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాట్సాప్ గవర్నెన్స్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి వారు ఈ సేవలను విస్తృతంగా ఉపయోగించుకునేలా చేయడంపై అధికారులందరూ ప్రత్యేక దృష్టి కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్లందరూ ఈ విషయంలో కీలకంగా పనిచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వాట్సాప్ గవర్నెన్స్ కోసం ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి, ఆయా జిల్లాల్లో వాట్సాప్ గవర్నెన్స్ అమలును పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు చాలా సులభతరంగా అందించాలన్నదే ప్రభుత్వ ఆశయమని, ఇందులో వాట్సాప్ గవర్నెన్స్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖల్లో ప్రభుత్వ సేవలు వాట్సాప్ ద్వారా సులభంగా పొందేలా ప్రజల్లో అవగాహన కల్పించేలా క్యూఆర్ కోడ్ ప్రదర్శించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా


సోమవారం సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజల నుంచి వినతులు, వాటి పరిష్కారాలు కూడా మెరుగవ్వాలన్నారు. అలాగే ప్రభుత్వానికి ప్రజలు చెల్లించాల్సిన బిల్లులు కూడా వాట్సాప్ ద్వారా విరివిగా జరిగేలా చూడాలని ఆ దిశగా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. చాలా మంది ప్రజల్లో వాట్సాప్ గవర్నెన్స్ ఎలా ఉపయోగించాలో సరైన అవగాహన లేదని, వారిలో అవగాహన పెంచేలా ప్రసార మాధ్యమాలను ఉపయోగించుకోవాలని తెలిపారు. గ్రామ, వార్డ్ సచివాలయాల్లో కూడా ఆ ప్రాంత ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ పట్ల అవగాహన కల్పించే ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి ఇంట్లోనూ ఒక ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు నిపుణులు ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు.

**డ్రోన్ పెట్రోలింగ్‌తో శాంతిభద్రతల పర్యవేక్షణ**

డ్రోన్ పెట్రోలింగ్ శాంతిభద్రతల పర్యవేక్షణలో టెక్నాలజీని విరివిగా వాడుకుని సత్ఫలితాలు సాధించాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. పోలీసు గస్తీకి సమాంతరంగా డ్రోన్లను విరివిగా ఉపయోగించుకుని డ్రోన్ పెట్రోలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దానివల్ల పోలీసులకు గస్తీ ప్రక్రియ మరింత సులభతరమవ్వడమే కాకుండా సత్ఫలితాలు కూడా వస్తాయన్నారు. ఆర్టీజీఎస్‌లో డేటా లేక్ ఏర్పాటు ప్రక్రియలో భాగంగా జరుగుతున్న డేటా అనుసంధాన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని సీఎం సూచించారు. మనకు నూతన సాంకేతికత ఆశ్చర్యంగా ఉన్నా, తద్వారా ఎంత మంచి జరుగుతుందో గుర్తించాలన్నారు. డ్రోన్ పెట్రోలింగ్‌ను అవసరమన్నారు. ఈవిషయంలో ఆయా విభాగాలు శ్రద్ధ పెట్టాలన్నారు.

**ఆర్టీసీ బస్సులన్నిటికీ జీపీఎస్ ఉండాలి**

రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులన్నిటికీ జీపీఎస్ వ్యవస్థ ఉండాలని సీఎం సూచించారు. తద్వారా ప్రయాణీకులకు తాము >>2



## ఎపి ఫైబర్‌నెట్ ఛైర్మన్ జివి రెడ్డి రాజీనామా
### ఎండి దినేష్ కుమార్ బదలీ

**విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవికి జీవీ రెడ్డి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవితో పాటు టీడీపీ ప్రాథమిక సభ్యత్వం, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పదవి నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు >>2



## వల్లభనేని అక్రమాలపై విచారణకు 'సిట్'

**విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి:** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అక్రమాలపై సిట్ ఏర్పాటు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అక్రమ మైనింగ్, భూకబ్జాలు తదితర వ్యవహారాలపై నలుగురితో సిట్ ఏర్పాటు చేసింది. ఏలూరు రేంజి ఐజీ జీవీజీ అశోక్ కుమార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం, ఏలూరు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్, తూర్పు గోదావరి ఎస్పీ నరసింహ కిషోర్‌లకు సిట్‌లో చోటు కల్పించింది. అక్రమ మైనింగ్ >>2

## అసెంబ్లీకి వెళ్లినా.. మానినా..
# ప్రజా సమస్యలపై పోరాడుతాం



### ప్రతిపక్షహోదా ఇవ్వకపోవడం చాలా అన్యాయం
### ఇక ప్రజల్లోనే ఉంటాం: మాజీ సిఎం జగన్

**విజయవాడ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త ప్రతినిధి:** అసెంబ్లీకి వెళ్లినా,వెళ్ళకున్నా ప్రజా సమస్యలపై పోరాడతామని ఏపీ మాజీ సీఎం,వైకాంగ్రెస్‌పార్టీ నేత వైఎస్ జగన్ స్పష్టం చేసారు.అసెంబ్లీలో కూటమికి అధికార పక్షానికి వ్యతిరేకంగా ఉన్న తమ పార్టీకి ప్రతిపక్షహోదా ఇవ్వమంటున్నామన్నారు. ఇది ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు, దాని కోసం చట్టసభలో పోరాడుతున్నాం.సభను బాయ్‌కాట్ చేస్తే పారిపోవడం అనుకోవడం కూటమి పక్షాల అజ్ఞానమన్నారు.ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తొలి రోజే సమావేశాలను వైకాంగ్రెస్ బాయ్ కాట్ చేసింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గవర్నర్ ప్రసంగం సమయంలో తమకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ నినాదాలు చేసి ఆ తర్వాత పోడియం వద్ద నిరసనం వ్యక్తం చేసిన వైసీపీ ఎమ్మెల్యేలు, అనంతరం గవర్నర్ ప్రసంగం కొనసాగుతుండగానే బాయ్‌కాట్ చేసి వెళ్లిపోయారు. ఇక తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమైన వైఎస్‌జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. వైకాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం లేనందున అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకూడదని వైసీపీ నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీకి వెళ్లినా, వెళ్లకున్నా ప్రజా సమస్యలపై పోరాటం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. నేనింకా ముప్పై ఏళ్ల పాటు రాజకీయాల్లో వుంటాను అని మరోసారి వ్యాఖ్యానించారు వైఎస్ జగన్ నాతో పాటు వుండేవాళ్ళు నా వాళ్లు, 2028 ఫిబ్రవరిలో జమిలి ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఆ ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలి పేదలకు వైసీపీ ఇచ్చిన ఇళ్ల స్థలాలు వెనక్కి తీసుకోవడం కుదరదు. ఎక్కడైనా అలాంటి సంఘటనలను జరిగితే వారికి అండగా ఉండాలని సూచించారు. గతంలో అసెంబ్లీకి చంద్రబాబు రాని సమయం లో కూడా ఆయన సభలో ఉంటే బాగుండేదని చెప్పా. వాళ్లేమో సభలో వైసీపీ లేకుండా నడపాలని చూస్తున్నారు. ఏది ఏమైనా ప్రజా సమస్యలపై ప్రజాక్షేత్రంలో పోరాడిలి అంటూ వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పిలుపునిచ్చారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం మీద వ్యతిరేకత తీవ్రంగా ఉంది. మనం యుద్ధ రంగంలో ఉన్నాం. విజయం దిశగా అడుగులు వేయాలి. ప్రజా సమస్యల విషయంలో రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు జగన్ నిజాయితీగా చిత్తశుద్ధితో ప్రజల తరపున పోరాటం చేయాలి. ప్రజలకు తోడుగా ప్రజల్లో ఉంటే గెలుపు సాధించినట్టే. అందుకనే ప్రజాసమస్యలపై పోరాటంలో వెనుకడుగు వేయొద్దు అన్నారు. ఈ ప్రభుత్వాన్ని చూసి భయపడాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరికి నేను భరోసా ఇస్తున్నాను. అండగా ఉంటాను. ప్రతిపక్షంలో మన సమర్థతను నిరూపించుకోవడానికి ఇదొక అవకాశం >>2

## ఆ ఊరికి అంబులెన్సొచ్చింది..
### హర్షం వ్యక్తం చేసిన ప్రజలు

**హిరమండలం(శ్రీకాకుళం జిల్లా), ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా గిరిజన గ్రామాల్లో డోలీ బాధల నుంచి ఉపశమనం లభించింది. మారుమూల గ్రామాలలో ప్రజలకు రోగం వస్తే డోలీయే వారికి దిక్కు. అటువంటి డోలీ కష్టాలు తీరనున్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో వెండర్ వ్యవస్థ ద్వారా రహదారి నిర్మాణాలు చేపట్టారు. ఇదే తరహాలో ఐటీడీఏ పరిధిలో సీసీరహదారులు, బీటీరోడ్ల నిర్మాణాలు చేపట్టారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, >>2





సోమవారం అసెంబ్లీ హాల్లో స్పీకర్ అయ్యన్న పాత్రుడు అధ్యక్షతన జరిగిన బిఎసి సమావేశ దృశ్యం

## మార్చి 19వరకు అసెంబ్లీ
### బిఎసిలో నిర్ణయం

**సచివాలయం,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త :** వచ్చే నెల 19వరకు అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. సోమవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు సమావేశం కాగా గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉభయ సభల నుద్దేశించి బడ్జెట్‌పై ప్రసంగించారు.అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన అసెంబ్లీ మీటింగ్ హాల్లో జరిగిన బిఏసి సమావేశంలో పైవిధంగా నిర్ణయించారు.కనీసం 15రోజులకే తగ్గకుండా చర్చలు జరగాలని,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.అవసరమైన పక్షంలో మరో రెండు రోజుల పొడిగింపు >>2

## వాకౌట్ చేసిన వైఎస్సార్సీ
### గవర్నర్ ప్రసంగం ఆరంభంలోనే నినాదాలు చేస్తూ అసెంబ్లీ నుంచి బయటకు..

**విజయవాడ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త ప్రతినిధి:** అసెంబ్లీ నుంచి వైసీపీ వాకౌట్ చేసింది.ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తున్నారు.ఈ క్రమంలో అసెంబ్లీలో వైఎస్సార్సీపీ సభ్యులు ఆందోళనకు దిగారు అసెంబ్లీలో ప్రతిపక్షాన్ని గుర్తించండంటూ నినాదాలు చేసారు. ప్రజల గొంతుక వినిపించాలంటే ప్రతిపక్ష హదా ఇవ్వాల్సిందే అంటూ నిరసనకు దిగారు. అనంతరం గవర్నర్ ప్రసంగాన్ని వ్యతిరేకిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రతిపక్షంగా గుర్తించాలని గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ప్రసంగం సమయంలో వైకాంగ్రెస్ పార్టీ సభ్యుల నినాదాలు చేసారు.11 నిమిషాల పాటు అసెంబ్లీలో నినాదాలు చేసి వెళ్లిపోయిన జగన్మోహన్ రెడ్డి, వైకాంగ్రెస్ పార్టీ సభ్యులు. గవర్నర్ ప్రసంగాన్ని బాయ్ కాట్ చేసి వెళ్లిపోతున్నట్లు పార్టీ నేతలు జగన్, బొత్స సత్యనారాయణలు వ్యాఖ్యానించారు.వారిని అనుసరించి ఇతర వైకాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బయటకు వచ్చేసారు.

25-02Pg3exHMNWJQEKCR.qxd:25-02Pg3exHMNWJQEKCR.qxd 01/01/01 8:34 AM Page 1



## సిఎంపై అనుచిత వ్యాఖ్యలు: శ్రీధర్‌రెడ్డిపై కేసు

**విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి:** సీఎం చంద్రబాబు పై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి కార్యకర్త అవుతు శ్రీధర్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసారు.శ్రీధర్ రెడ్డి మీద నీఌ నమోదు చేసిన విజయవాడ సూర్యారావుపేట పోలీసులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన శ్రీఌదిశ సోషల్ మీడియా కార్యకర్త అవుతు శ్రీధర్ రెడ్డి.ౡ యాక్ట్ 2008 ప్రకారం కేసు నమోదు చేసిన పోలీసులు.సోషల్ మీడియా వేదికగా కించపరిచే విధంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు. సోషల్ మీడియా వేదికగా వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారి మీద ఐటీ యాక్ట్ క్రింద కేసు నమోదు, రౌడీ షీట్లు పీడీ యాక్ట్ ప్రయోగం.

## సభ్యత్వాలు పోతాయనే ఇలా వచ్చి అలా వెళ్లారు: జగన్‌పై హోం మంత్రి అనిత విమర్శలు..

**విజయవాడ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త ప్రతినిధి:** అసెంబ్లీ సమావేశాలకు ఇలా వచ్చి అలా వెళ్లిన వైకాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ జగన్‌పై హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర విమర్శలు గుప్పించారు. హాజరు కోసమే సభకు వచ్చారని తేటతెల్లమైందని వ్యాఖ్యానించారు. సభ్యత్వాలు పోతాయనే భయంతోనే వచ్చారని భావిస్తున్నట్లు తెలిపారు. వైకాంగ్రెస్‌పార్టీ నేతల తీరు అటెండెన్స్ వేయించుకుని వెళ్లినట్లుంది. సభ్యత్వాలు పోతాయనే భయంతోనే వచ్చారని భావిస్తున్నాం. హాజరు కోసమే సభకు వచ్చారని తేలిపోయింది. అవినీతి, అబద్ధాల పునాదులపై ఆ పార్టీ పుట్టింది. గతంలో చెప్పిన అవాస్త వాలనే మళ్లీ చెబుతున్నారు. సభకు వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడతారిని భావించాం. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తామనడం ఎక్కడా చూడలేదు. అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నారు. 11 స్థానాల్లో గెలిచి ప్రతిపక్ష హోదా అడగడం హాస్యాస్పదం. సీనియర్లు కూడా జగన్‌కు వత్తాసు పలకడం దురదృష్టకరం అని అనిత అన్నారు. బడ్జెట్ సమావేశాలను మార్చి 21 వరకు నిర్వ హించాలని శాసనసభా వ్యవహారాల కమిటీ నిర్ణయించిందని మంత్రి తెలిపారు.

## పరిశ్రమల్లో బాయిలర్ల నిర్వహణ పటిష్టంగా ఉండాలి

**- తనిఖీ అధికారి జె. శ్రీనివాసరావు**

**విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి:** పరిశ్రమల్లో ఏర్పాటయ్యే బాయిలర్ ల నిర్వహణా విధానాలు తీసుకోవాల్సిన భద్రతా చర్యల పై బాయిలర్ ఆపరేటర్లకు పునఃశ్చరణ తరగతులను భోదించడం జరిగిందని విజయవాడ బాయిలర్ల ఉప ముఖ్య తనిఖీ అధికారి విజయవాడ బాయిలర్ల తనిఖీ అధికారి జె. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా బాయిలర్ల శాఖ ఆధ్వర్యంలో కృష్ణా మరియు యన్.టి.ఆర్. జిల్లా పరిసర ప్రాంతాల్లో పనిచేయుచున్న బాయిలర్ అటెండెన్స్ (ఆపరేటర్లు) పునఃశ్చరణ తరగతులను గాంధీనగర్ లో గల కృష్ణా జిల్లా రైస్ అండ్ ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్ లో సోమవారం నిర్వహించామన్నారు. పరిశ్రమల్లో బాయిలర్ ల నిర్వహణా విధానాలు తీసుకోవాల్సిన భద్రతా చర్యల పై, బాయిలర్ల లో వాడే నీటి వినియోగం, శుద్ధి మొదలైన అంశాలపై సుదీర్ఘ అనుభవం గల పరిశ్రమ నిష్ణాతులచే బాయిలర్ లను ఆపరేట్ చేసే బాయిలర్ ఆపరేటర్లకు శిక్షణను అందించా మన్నారు. ప్రతి ఏటా జరిగే ఇటువంటి తరగ తులను గతంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్ గుడివాడ, హనుమాన్ జంక్షన్ మరియు కొండపల్లిలో కూడా నిర్వహిచామన్నారు. కార్యక్రమంలో విజయవాడ బాయిలర్ల ఉప ముఖ్య తనిఖీ అధికారి యం. సత్యనారాయణ తో పాటు జోసిల్ ఫ్యాక్టరీకు చెందిన షేక్ రిషావత్ ఆలీ, రాజమండ్రి ఎ.పి. పేపరు మిల్లు టెక్నికల్ ఆఫీసర్ వి.వి.వి. సత్యనారాయణ, నవభారత్ లిమిటెడ్ కు చెందిన యస్. నందకేశవరావు, రామదాసు పేపర్ బోర్డ్స్ కు చెందిన కె.యస్. పవన్ నారాయణ, స్వతంత్ర కన్సల్టంట్ యమ్. ప్రసాద్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అమూల్యమైన సలహాలను, సూచనలను అందించారు.



# గవర్నర్‌తో అసత్యాలు చెప్పించిన ప్రభుత్వం

### మాజీ మంత్రి ఆర్‌కె రోజా విమర్శ!

విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి: బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ప్రసంగంలో కూటమి ప్రభుత్వం పచ్చి అబద్ధాలను చెప్పించిందని మాజీ మంత్రి ఆర్కె రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి వైయస్ఆర్ సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఈ అయిదేళ్ళలో హామీల అమలు ఎలా చేస్తారో చెప్పకుండా విజన్ 2047 గురించి గవర్నర్ ప్రసంగంలో మాట్లాడించడం అర్థరహితమని అన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడ అసెంబ్లీ సాక్షిగా ఎండగడతారోననే భయంతోనే వైయస్ఆర్సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా నిరాకరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇంకా ఆమె ఏమన్నారంటే... గవర్నర్ ప్రసంగంలో వైయస్ జగన్ గారిని తిట్టిస్తూ, చంద్రబాబును పొగిడించుకునే కార్యక్రమం చేశారు. ఎన్నికలు ముందు సూపర్ సిక్స్ తో పాటు 143 హామీలు ఇచ్చారు. నేడు గవర్నర్ ప్రసంగంలో ఏ హామీ గురించి ఎలాంటి స్పష్టత లేకపోవడం దురదృష్టకరం. బడ్జెట్ ప్రసంగం అనగానే విద్య, వైద్య, వ్యవసాయ, ఇరిగేషన్ రంగాలపై ఎలాంటి లక్ష్యాలతో, ఏ విధంగా ప్రాధాన్యత ఇస్తారోనని అందరూ ఆసక్తిగా చూస్తారు. కానీ విజన్2047 పేరుతో కాకమ్మ కబుర్లతో ప్రసంగాన్ని ముగించారు. ప్రజలు చంద్రబాబుకు ఇచ్చిందే అయిదేళ్ళ పాలనాకాలం. ప్రజలకు ఇచ్చిన హామీలను ఈ అయిదేళ్ళలో ఎలా అమలు చేస్తారో చెప్పకుండా 2047 నాటికి ఏం చేస్తారో చెప్పడం అంటే, ఇప్పుడు ఏమీ చేయను అని చెప్పినట్లే. నమ్మినవారిని మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగవర్నర్ ప్రసంగంలో మద్యం రేట్లు పెంచం అని చెప్పించారు. ఇటీవలే మద్యం రేట్లను ఎలా పెంచారో పత్రికల్లో వచ్చిన కథనాలు చూస్తే తెలుస్తుంది. ప్రతి బాటిల్ పై రూ.10 లకు పైగా పెంచారు. మేం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచం అని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. నేడు తొమ్మిదినెలల కాలంలోనే ఏకంగా రూ.15వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపారు. గవర్నర్ ప్రసంగంలో మాత్రం విద్యుత్ చార్జీల భారం లేదని చెప్పించడం చంద్రబాబు అబద్దాలకు పరాకాష్ట. ఇళ్ళలోని మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు, అన్నదాత సుఖీభవం, మహిళలకు ఉచిత బస్సు, తల్లికివందనం వంటి హామీలపై గవర్నర్ ప్రసంగంలో ఎటువంటి క్లారిటీ ఇవ్వలేదు. నిరుద్యోగులుకు భృతి ఇస్తామని, కొత్త ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వీటిని అమలు చేయకుండా ఇప్పటికే పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, వాలంటీర్లను తొలగించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఏదో చేస్తారని ఆశించిన ఉద్యోగస్తులకు ఐఆర్, డీఏ, పీఆర్సీల అమలు ప్రసక్తే లేదు. అన్ని వర్గాలను మోసం చేయడం అలవాటైన చంద్రబాబును నమ్మిన వారిని చూస్తే జాలి కలుగుతోంది. వైయస్ జగన్ మనస్సున్న నాయకుడు. ఇచ్చిన మాటను తూచా తప్ప కుండా అమలు చేసే నేత అన్నారు.ప్రతిపక్ష హోదాపై వపన్ వ్యాఖ్యలు అర్థరహిత మన్నారు.ప్రతిపక్ష హోదా ఇవ్వడం వల్ల సభలో ఎక్కువ సమయం కేటాయిస్తారు, ప్రజా సమస్యలపై ఎక్కువ సేపు మాట్లాడే అవకాశం ఉంటుందని వైయస్ జగన్ గారు ఈ హోదా అడుగుతున్నారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అర్థంలేకుండా మాట్లాడారు. ఎక్కడో జర్మనీ గురించి మాట్లాడుతున్నారు. ఎక్కువ సీట్లు వచ్చిన జనసేనకు ప్రతిపక్ష హోదా వస్తుందని అంటున్నారు.

పవన్ కళ్యాణ్ వెంటనే తన డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేసి ప్రతిపక్ష నాయకుడుగా ఈ ప్రభుత్వాన్ని, సీఎం చంద్రబాబు చేసే తప్పులను నిలదీయాలని కోరుతున్నాం. ఆ పనిమాత్రం చేయలేరు. చంద్రబాబుకు కష్టం వస్తే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తారు, రోడ్డు మీద పడుకుంటారు.

ఈ రాష్ట్రంలో ఆడపిల్లలకు రక్షణ లేకపోయినా, విద్యార్థులు తమకు న్యాయం చేయాలని రోడ్ల మీదికి వచ్చినా తనకేమీ పట్టనట్లు ఆసుపత్రిలో పడుకుంటారు.



హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్

## శ్రీశైలంలో గవర్నర్

**నంద్యాల,ఫిబ్రవరి24,ప్రభాతవార్త ప్రతినిధి** ఏపి గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు శ్రీశైల మల్లన్నను దర్శించుకునేందుకు సోమవారంనాడు సుండిపెంట హెలిప్యాడ్ గ్రౌండుకు సాయంకాలం చేరుకునా న్నరు.ఏపి గవర్నర్‌కు హెలిప్యాడ్ వద్ద దేవదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి, రాష్ట్ర న్యాయ,మైనార్టి సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్,రోడ్డు భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాలశాఖ మ ంత్రి బి.సి జనార్ధన్‌రెడ్డి,శ్రీశైలం ఏమ్మేల్యే బుడ్డారాజ శేఖర్‌రెడ్డి, నంద్యాల జిల్లా సర్వోన్నతాధికారి రాజకుమారి గణియా, కర్నూలు జల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్, జాయింటు కలేక్టర్ సి.విష్ణుచరణ్‌లు సంయుక్తంగా ఘనస్వాగతం పలికారు.అనంతరం సుండిపెంట హెలిప్యాడ్ నుండి రోడ్డు మార్గంనా శ్రీశైలంలోని భ్రమరాంబా అతిదిగృహంకు చేరుకున్నారు. అక్కడ పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.

## సమస్యలపై చర్చించాలంటే నాయకుడికి హోదా అవసరం లేదు

**- మంత్రి అచ్చెన్నాయుడు**

**సచివాలయం,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త :** ప్రతిపక్షం అసెంబ్లీకి వస్తుందనే వార్తలు విని సంతోషించినా,కేవలం హాజరు కోసం మాత్రమే వచ్చారని తెలిసి ఆవేదన చెందినట్లు మంత్రి అచ్చన్నాయుడు తెలిపారు.గవర్నర్ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను స్పష్టంగా వివరించారని, ప్రతి ఒక్కరూ బాబా సాహెబ్ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు.ప్రజల కోసం కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం రావడం,ప్రతిపక్ష హోదా కోసం నినాదాలు ఇవ్వడం విచిత్రమన్నారు.జగన్ పార్టీ అవినీతి,అబద్ధాల నుండి పుట్టిందని,వారి మీడియా కేవలం అవాస్తవాలను ప్రచారం చేస్తుందని విమర్శించారు.ప్రతిపక్ష హోదా పాత్రుడు గారో,చంద్రబాబు గారో కాదు,ప్రజలే ఇచ్చారని గుర్తుంచుకోవాలన్నారు. అసెంబ్లీకి రాను,ప్రజల సమస్యలపై పోరాడను అనిచెప్పిన నాయకుడు చరిత్రలో లేదని తెలిపారు.జగన్ తప్పుడు ప్రచారంతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని,రాజ్యాంగ బద్ధంగా లేని అవకాశాలు ఎవరూ ఇవ్వలేరని స్పష్టంచేశారు. సీనియర్లు కూడా వారికి మద్దతుగా మాట్లాడటం విచిత్రమని త్వరలో ముఖ్యమంత్రి పదవి కోసం డిమాండ్ చేస్తారేమోనని వ్యా ఖ్యానించారు. జగన్ వ్యక్తులకు కాదు,ప్రజలు సమా ధానం చెప్పాలని పేర్కొన్నారు. జగన్ ఇంకా రాజారెడ్డి రాజ్యమే ఉందని భ్రమ పడుతున్నారని, రాష్ట్రానికి చేసిన నష్టానికి ప్రజలు వారి స్థానాన్ని గుర్తుచేశారన్నారు. కనీసం పులివెందుల ప్రజల కోసమైనా "పులివెందుల ఎమ్మెల్యే" గారు అసెంబ్లీకి రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ సమ యంలో మిర్చి రైతులను కలవకూడదని తెలియక పోవడం విచిత్రమని వ్యాఖ్యానించారు. ప్రజల కోసం సభకు రావాలని,సమయం,మైకు ఇస్తామని,జోన్ లేదా సబ్జెక్టు పరంగా చర్చలకు సిద్ధమని తెలిపారు.జగన్‌కు లండన్ మెడిసిన్ సరిగ్గా పనిచేయడం లేదని వ్యంగ్యంగా పేర్కొన్నారు. "సేవ్ డెమోక్రసీ" అని కేకలు వేసేముందు వారు దాని అర్థం తెలుసుకోవాలన్నారు.

## మున్సిపాలిటీల్లో పన్ను బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి

### పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్

**విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి:** మున్సిపాలిటీల్లో పన్నుల బకాయిలు వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని రెండో బ్లాక్ లోని తన ఛాంబర్ లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష చేశారు.రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు,నగర పంచాయతీల్లో పన్నుల వసూలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆస్తి పన్నుతో పాటు ఖాళీ స్థలాల పన్ను వసూళ్లు తక్కువగా ఉండటంతో పట్టణ స్థానిక సంస్థలకు ఆదాయంలో భారీగా లోటు ఏర్పడిందని గుర్తించారు..ఈ సమస్యను అధిగమించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మార్చి నెలాఖరులోపు 100 శాతం పన్ను వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు..పన్నుల వసూలుకు సంబంధించి పలు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్లు ఖాళీ భూముల యాజమానుల వివరాలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల నుంచి సేకరించి బకాయిదారులకు నోటీసులు అందించాలి. ప్రతి మున్సిపాలిటీ లో పెండింగ్ పన్నుల జాబితా ప్రచురించి ప్రజలకు అవగాహన కల్పించాలి.వాట్సాప్ ద్వారా డిజిటల్ నోటీసులు పంపించి బకాయిల వివరాలు తెలియజేయాలి.ఆన్లైన్ పేమెంట్ లింక్ తో పన్నులు చెల్లించేలా ఏర్పాట్లు చేయాలి. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మున్సిపాలిటీల్లో మోళిక వసతుల కల్పనలో పన్నుల ప్రాముఖ్యత ను తెలియజేయాలి. అత్యధిక పన్ను వసూలు చేసిన మున్సిపల్ కమిషనర్ల ను నగదు పురస్కారాలు,ఇతర ప్రోత్సాహకాలు ఇచ్చి గౌరవించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

## శివదీక్షకు పెరుగుతున్న ఆదరణ వేలాది మంది మాల ధారణ

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి ప్రాంతంలోని రాజకీయ ద్వితీయశ్రేణి నాయకుల్లో భక్తి భావం అలవాటు చేయటానికి పాలకులు విన్నూత్న ప్రయోగం చేస్తున్నారు.శైవ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వేలాది మందిచే 'శివమాల'ను ధరింపజేసారు.భక్తి భావాన్ని ఉట్టిపడేటట్లు చేసారు. శ్రీకాళహస్తీశ్వ రాలయంలో గత రెండు సంవత్సరాలుగా 'శివమాల దీక్షకు' ఆదరణ పెరుగుతుంది.ఈ నేపథ్యంలో యువకులు మాల ధరించాలని పిలుపు నిచ్చారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను దర్శించుకొని మాలను ధరించారు. ఐదు రోజుల పాటు భక్తిభావంతో స్వామి అమ్మవార్ల తీరునాళ్ళుకు వచ్చే భక్తులను ఆదరించాలని సేవలందించాలని యువకులు భావిస్తున్నారు. ధార్మికత మనిషిలో శాంతిని నింపుతుందని సహనాన్ని ప్రసాదిస్తుందని ,మానసిక ప్రశాంతను కల్గిస్తుందని భావి స్తున్నారు. ప్రతి రోజూ ఉదయాన్నే చన్నీటి స్నానమాచరించి మన ఇష్టదైవమైన శివయ్యను దర్శించి ప్రార్థిస్తే మన కొర్కెలను తీర్చుతారని యువత నమ్మి మాల ధరిస్తున్నారు.

దీక్షలో స్వామి అమ్మవార్లను దర్శించుకుంటూ నియమ నిబంధనలను క్రమశిక్షణతో ఆచరిస్తున్నారు.దీక్ష విరమణకు కొందరు శ్రీశైలం, మరి కొందరు తమిళనాడులోని అరుణాచలంకు వెళ్ళటానికి సిద్ద మౌతున్నారు. దక్షిణ కైలాసంగా, పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహ స్తీశ్వరాలయం ఈ దివ్యక్షేత్రంలో రెండేళ్ళుగా శివమాల ధరిస్తున్న భక్తుల సంఖ్య పెరుగు తుంది.

## బడ్జెట్ సమావేశాల్లో కార్యదర్శులు అసెంబ్లీలో అందుబాటులో ఉండాలి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్



**విజయవాడ, ఫిబ్రవరి 24,ప్రభాతవార్తప్రతినిధి:** బడ్జెట్ సమావేశాలు జరుగుచున్న సమయంలో అసెంబ్లీలో సంబందిత శాఖల కార్యదర్శులు తప్పని సరిగా అందుబాటులో ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ప్రస్తుతం బడ్జెట్ సమావేశాలు జరుగుచున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పలు ఆదేశాలు జారీ చేశారని వాటిని కార్యదర్శులు అందురూ తప్పని సరిగా పాటించాలన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం సి.ఎస్. సమావేశ మందిరం నుండి అన్ని శాఖల కార్యదర్శులు, ప్రిన్సిపల్ కార్యదర్శులు, స్పెషల్ సి.ఎల్.లతో ఆయన వర్చ్యువల్ సమావేశం నిర్వహించి బడ్జెట్ సమావేశాల నిర్వహణకు సంబందించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల నిర్వహణకు సంబందించి సమగ్ర సమాచారాన్ని ముందుగానే మంత్రులకు అందజేయాలన్నారు. అంశాల వారీగా గత ప్రభుత్వంలో తీసుకున్న చర్యలు మరియు ప్రస్తుత ప్రభుత్వ హయాంలో తీసుకుంటున్న చర్యలను స్పష్టంగా తెలిపే సమగ్ర సమాచారాన్ని మంత్రులకు ముందుగానే అందజేయాలని సూచించారు. ఇందుకు సంబందించి శాఖల వారీగా ఉన్న నోడల్ అధికారులను ముందుగానే అప్రమత్త పర్చాలన్నారు. సమావేశాలు నిర్వహించే సమయంలోనే స్టార్డు మరియు అన్ స్టార్డు ప్రశ్నలకు అన్నింటికీ సవివరమైన సమాదానాలు మంత్రులు ఇచ్చే విధంగా వారి తగిని సమాచారాన్ని ఆయా శాఖల కార్యదర్శులు ముందు రోజే అందజేయాలన్నారు. సమావేశాల సమయంలో ఆర్జిత శెలవులు, విదేశీ పర్యటన శెలవులు ఎవ్వరికీ మంజూరు చేయవద్దని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.అన్ని శాఖల కార్యదర్శులు, ప్రిన్సిఫల్ కార్యదర్శులు, స్పెషల్ సి.ఎస్.లు ఈ సమావేశంలో వర్చ్యువల్ గా పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## గజవాహనంపై సోమస్కంధుడు



**తిరుమల,ఫిబ్రవరి 24ప్రభాత వార్తప్రతి నిధి:** తిరుమల తిరుపతిదేవస్థానానికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వర స్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి గజవాహనంపై భక్తులకు అభయ మిచ్చాడు. ఆద్యంత రహితుడైన శివదేవుడు ఐశ్వర్యసూచికమైన గజ వాహనాన్ని అధిష్టించినపుడు దర్శ నం చేసుకోవడం భక్తులకు పుణ్యం. ఆలయ మాఢ పురవీధుల్లో భక్తుల భజనలు, కోలాటలు ముందు వాహనసేవ జరిగింది. కాగా సోమవారం ఉదయం బ్రహ్మోత్సవాల్లో సోమస్కంధమూర్తిగా కామాక్షి అమ్మవారితో కలిసి వ్యాఘ్రవాహనంపై ఊరేగారు. ఉదయం నిత్యకైంకార్యలు పూర్తిచేసుకున్న తరూవాత స్వామివారు ఆలయ పురవీధుల్లో ఊరేగడంతో భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వాహనసేవలో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఎఇఒ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,ఫిబ్రవరి 24ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న ట్రస్ట్‌లకు దాతలు విరాళాలందిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌కు చెందిన దాత శ్రీనివాసులురెడ్డి ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్‌కు 10లక్షల రూపాయలు విరాలం అందించాడు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిని కలసి ఈ విరాళాల డిడిని అందేశారు. ఇప్పటికే దాత శ్రీనివాసులురెడ్డి 30లక్షల రూపాయలను విరాళంగా అందజేసినట్లు టిటిడి తెలిపింది.

## తిరుమలలో క్షేత్రపాలకుడికి రేపు అభిషేకం



**తిరుమల,ఫిబ్రవరి 24ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమలలో క్షేత్రపాలకుడు రుద్రునికి బుధ వారం ఉదయం మహాశివరాత్రిపర్వదినం సందర్భంగా విశేష అభిషేకాలు జరుగుతాయి. 26వతేదీ బుధవారం మహాశివరాత్రికి ప్రతి ఏటా వేడుకగా గోగర్భం సమీపంలో వెలసిన రుద్రునికి అభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తొలుత శ్రీవారి ఆలయం నుండి ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు క్షేత్రపాలక శిల వద్దకు చేరుకుంటారు.అక్కడ మధ్యా హ్నం 3గంటలకు సుగంధద్రవ్యాలతో క్షేత్రపాలకునికి అభిషేకం చేసి ప్రసాదం సమర్పిస్తారు. భక్తులకు వితరణ చేస్తారు.

## కాలినడకన తిరుమలకు కొణిదెల నిహారిక



**తిరుమల,ఫిబ్రవరి 24ప్రభాతవార్తప్రతినిధి:** సినీనటుడు,నిర్మాత కొణిదెల నాగబాబు కుమార్తె కొణిదలనిహారిక సోమవారం సాయంత్రం కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. సామాన్యభక్తులతో కలసి ఆమె అలిపిరి కాలినడక మార్గంలో భక్తితో నడచివచ్చారు.

ఆమెతో పలువురు భక్తులు ఆసక్తిగా ఫోటోలు తీసుకోవడం విశేషం. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో స్వామివారిని దర్శించుకోనున్నారు. జొన్నలగడ్డ చైతన్యతతో విడాకులు తీసుకున్న తరువాత తిరుమలకు ఆమె రావడం తొలిసారి.

## శ్రీవారి అనుగ్రహంతో శుభాలు కలగాలి: ప్రముఖులు



**తిరుమల,ఫిబ్రవరి 24ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంక టేశ్వక స్వామి అనుగ్రహంతో అందరికీ శుభాలు కలగాలని, ప్రజలు సంతోషంగా ఉండా లని పలువురు ప్రముఖులు ఆకాంక్షిం చారు. కర్నాటక హైకోర్టు జడ్జి జస్టిస్ లలిత కన్నెగంటి , తెలంగాణా శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు నేతి విద్యాసాగర్, ఎంఎల్‌సి భూమిరెడ్డి రాంగోపాల్ విఐపి బ్రేక్‌లో సోమవారం ఉదయం శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## మార్చి 9నుండి తిరుమలేశుని తెప్పోత్సవాలు



**తిరుమల,ఫిబ్రవరి 24ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక సాలకట్ల తెప్పోత్సవాలు మార్చి 9నుండి 13వతేదీ వరకు ఐదురోజులపాటు జరగనున్నాయి. ఈ తెప్పోత్సవాలు ప్రతిరోజూ రాత్రి 7గంటల నుండి 8గంటల వరకు ఆలయ పుష్కరిణిలో వేడుకగా నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో తొలిరోజు మార్చి 9వతేదీ ఆదివారం సాయంత్రం సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తిగా తెప్పలపై పుష్కరిణిలో మూడుచుట్లు తిరిగి భక్తులకు అభయమిస్తారు. రెండవరోజు మార్చి 10వతేదీ సోమవారం సాయంత్రం రుక్మిణీసమేత శ్రీకృష్ణస్వామి తెప్పపై మూడు ప్రదక్షణలు విహరిస్తారు. మూడవరోజు 11వతేదీ నుండి 13వరకు స్వామివారు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి పుష్కరిణిలో భక్తులకు అనుగ్రహిస్తారు. చివరిరోజు 13వతేదీ ఏడుసార్లు తెప్పపై పుష్కరిణిలో విహరిస్తారు. ఈ సందర్భంగా మార్చి 9,10తేదీల్లో రెండురోజులు సహస్ర దీపాలంకారసేవ, 11,12,13తేదీల్లో ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దయ్యాయి.

## నెల్లూరులో గంజాయి స్మగ్లర్ అరెస్టు



**నెల్లూరు క్రైమ్ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తిని ప్రభుత్వ రైల్వే పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సోమవారం నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా చింతపల్లి గ్రామానికి చెందిన పూజారి సన్యాసిరావు అనే యువకుడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు, అతని వద్ద నుండి 10 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడిని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా ఆయన రిమాండ్‌కు ఆదేశించారు.

వార్త

మన భవిష్యత్తు మనం పుట్టిన ఘడియలు బట్టిగానీ, మరింక దేనిమీదనో గానీ ఆధారపడి లేదు. అది కేవలం మన స్వశక్తిపై ఆధారపడి ఉంది.

-రాచెల్

# పౌష్టికాహారలేమిలో భారతావని

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, మరెన్ని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించినా, వెచ్చిస్తున్నా ప్రజలను పౌష్టికాహార లోపం నుండి గట్టెక్కించలేకపోతున్నారు. ఇప్పటికే దేశంలో కోట్లాది మంది పౌష్టికాహార లోపంతో, రకరకాల సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రపంచ జనాభాలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న బాలల్లో ఇరవైశాతంపైగా భారతావనిలోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదికలో ఏనాటి నుంచో ఘోషిస్తున్నాయి. ఐదు సంవత్సరాల లోపు పిల్లల్లో దాదాపు నలభైశాతం మంది పిల్లలు తక్కువ బరువుతో పుడుతున్నారని, వారిలో ఆరేడు శాతం మంది పిల్లలు పుట్టిన ఐదేళ్లలోపే మరణిస్తున్నారని మరెన్నో నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ భూమ్మీద పుట్టినవారు ఎవరికైనా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటిది కన్నులైనా సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన ఆహారం అందక చనిపోతే బాధ్యత వహించాల్సిన పాలక పెద్దలు తల్లీబిడ్డకు పౌష్టికాహారం అందివ్వలేకపోవడం కూడా పాలకుల బాధ్యతారాహిత్యం కిందకే వస్తున్నది. దేశంలో కొత్త పథకాలు ప్రవేశపెట్టకపోతేపోయారు. ఉన్న పథకాలను ఏమేరకు అమలు చేస్తున్నారు? అర్హులైనవారిలో ఎంత మందికి అందిస్తున్నారు? అధ్యయనం చేయడమే కాదు పటిష్టమైన పర్యవేక్షణ కూడా అవసరం. పర్యవేక్షణా లోపం కారణంగా పేదలకు అందాల్సిన పౌష్టికాహారం పక్కదారిపడుతున్న విషయం ఎన్నోసార్లు వెలుగు చూసినా నిర్దిష్ట చర్యలు లేకపోవడంతో నిరాటంకంగా కొనసాగుతున్నది. దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా పౌష్టికాహార లోపం పెరిగిపోతుందనే చెప్పొచ్చు. ఇటీవల ప్రపంచ ఆహార నివేదిక వెల్లడించిన వివరాల ప్రకారం పౌష్టికాహార లోపంతో బాధపడేవారి సంఖ్య దాదాపు ఎనభైకోట్లకుపైగా చేరుకున్నట్లు చెప్తున్నారు. 2014తో పోలిస్తే 30 శాతం అధికం. భారత్‌లో పౌష్టికాహారం ప్రధానంగా సూక్ష్మపోషకార సమస్య అధికంగా ఉంది. 2019-20 మధ్యకాలంలో భారత్‌లో పదహారు శాతం, పాకిస్థాన్‌లో పదిహేడు శాతం ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఇక ప్రపంచ వ్యాప్తంగా పోషకాహార లోపంతో బాధపడుతున్నవారిలో మూడోవంతు భారత్‌లోనే ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే వెల్లడిస్తున్నది. దేశంలో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. లక్షలాది మంది ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారు. 1975లోనే ఆరేళ్లలోపు పిల్లలు, తల్లులకు పౌష్టికాహారం అందించేందుకు ఆనాటి కేంద్రప్రభుత్వం సమీకృత శిశుఅభివృద్ధి పథకాన్ని (ఐసిడిఎ) ప్రవేశపెట్టింది. ప్రధాని మాతృవందన యోజన, పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం, తదితర కార్యక్రమాలు ఎన్నో జరుగుతున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు పిల్లలకు కోడిగుడ్లు కూడా అందిస్తున్నారు. అయినా భారత్‌లో ఈలోపం ఎందరినో పట్టిపీడిస్తున్నది. 2022 ప్రపంచ ఆకలి సూచీలో భారత్ 121 దేశాల్లో 107వ స్థానంలో ఉంది. పౌష్టికాహార లోపం కారణంగా ఆరోగ్య పరంగా ప్రధానంగా మహిళల్లోనూ, చిన్నారుల్లోనూ అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. జార్ఖండ్, మహారాష్ట్ర, అసోం, గుజరాత్, తదితర రాష్ట్రాల్లో పౌష్టికాహార లోపాలు అధికంగా ఉన్నాయి. పదిహేనేళ్ల బాలికల నుండి యాభైయేళ్లలోపు మహిళల్లో దాదాపు యాభైఏడు శాతం వరకు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఎనభైశాతానికి పైగా సూక్ష్మపోషకాల కొరతను ఎదుర్కొంటున్నట్లు అంతర్జాతీయ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పోషకాలు కలిగిన బియ్యాన్ని అందించే కార్యక్రమం కొనసాగుతున్నది. దేశవ్యాప్తంగా ఎనిమిది కోట్ల ముప్ఫైఐదు లక్షల మందికి అన్నార్తులకు ఉచితంగా తిండి గింజలు అందించే పంపిణీ కార్యక్రమం మరో ఐదేళ్లపాటు కేంద్రప్రభుత్వం పొడిగించింది. దీనికితోడు ఆయా రాష్ట్రాలు కొన్ని ప్రత్యేక పథకాలు కూడా చేపడుతున్నాయి. 2030 నాటికి తీవ్రమైన పౌష్టికాహార లోపాన్ని నియంత్రించేందుకు మూడువేలమూడువందల కోట్ల రూపాయల వ్యయంతో ప్రత్యేక పథకాన్ని తెచ్చి ఒడిశా ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఇంకా కొలిక్కిరాలేదు. పథకాలు, ఉద్దేశ్యాలన్నీ సక్రమంగానే ఉన్నా సంతృప్తి కలిగించే విధంగా కన్పిస్తున్నా ఆచరణకు వచ్చేసరికి చాలావరకు కాగితాలకే పరిమితమవుతున్నాయి. దళారుల ప్రమేయం పెరిగిపోతున్నది. వాస్తవంగా చూసినా గత రెండు దశాబ్దాలుగా ఆహార ధాన్యాల ఉత్పత్తిలో కొరత లేదు. రికార్డుస్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. ఆహారోత్పత్తులు భారీగా పెరుగుతున్నా అందరికి రెండు పూటల ఆకలి తీర్చేందుకు తిండిగింజలు అందించలేకపోతున్నారు. మరొకపక్క పాఠశాలల్లో పారిశుధ్య సౌకర్యాలులేకపోవడం వల్ల అంటువ్యాధుల కేంద్రాలుగా మారుతున్నాయి. మరుగుదొడ్లు లేకపోవడం, కనీస పరిశుభ్రత పాటించకపోవడంతో సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఇక సమగ్ర శిశు అభివృద్ధి పథకం కింద మాతాశిశు సంరక్షణ కోసం పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీలు లక్ష్యానికి దూరంగా ఉన్నాయని 'కాగ్' ఏనాటి నుంచో హెచ్చరిస్తున్నది. ఆ నివేదికను పట్టించుకునేవారే లేరు. ఇది పాలకులకు తెలియందికాదు. కొత్త పథకాల గురించి ఆలోచించకపోయినా కనీసం ఉన్న పథకాలను పటిష్టంగా అర్హులైన అందరికి అందించేలా పర్యవేక్షణ పెంచితే కొంతమేరకైనా లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం.

మీకు వీలైనంత వరకూ ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ ఉండండి. అది కారు చౌక అయిన ఔషధం.



బైరన్

మనుషులందరూ వృద్ధులుగా మారతారు. కానీ మంచివారుగా మారటం అరుదు.



స్వీడన్ బర్గ్

# ప్రజావాక్కు



### అమలు కాని హామీలెందుకు?

ఎలక్షన్లలో అలవికాని డబ్బుతో కూడిన హామీ లివ్వడం, ఓట్లు సంపాదించుకుని పదవిలోకి రావడం, ఆ తరువాత డబ్బులేదనే వంకతో ఇచ్చినహామీలను తుంగలోకి తొక్కడం రెండు తెలుగు రాష్ట్రాలలో జరుగుతున్న వాస్తవ పరిస్థితి. ఉదహరణకు తెలంగాణాను పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ మానిఫెస్టోలో చేయూత పథకం కింద ఫించన్‌ను నాలుగు వేలు, ఆరు వేలు పదవిలోకి వచ్చిన వందరోజులలో పెంచుతామని హామీ ఇచ్చారు. సంవత్సరం దాటింది. ఈవిషయం గురించి కొంత కాలం గొంతెత్తి అరచిన బి.ఆర్.ఎస్. కూడా ఈ ప్రస్తావన తేవడం లేదు. అలాగే స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణన్ని కల్పించడం కష్టమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేతులెత్తేసింది. ఈ హామీలను అమలు పరచలేమని పత్రికాముఖంగా చెప్పండి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఆరోపణల నిగ్గు తేల్చాలి!

ఎపి ఫైబర్‌నెట్ ఛైర్మన్ కొద్ది రోజులక్రితం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్‌కుమార్ ఐఎఎస్ రాజద్రోహానికి పాల్పడినట్లు, ఆయన వలన సంస్థకు వందల కోట్ల రూపాయలు నష్టం జరుగుతున్నదని మీడియా ముందుకు వచ్చి బహిరంగ ఆరోపణలు చేశారు. ఇదే విషయం ఆయన ముఖ్యమంత్రి గారికి నివేదిస్తే తనకు ఇంటెలిజెన్స్ ద్వారా పూర్తి సమాచారం ఉందని చెప్పినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి. అలాగే గతప్రభుత్వం హయాంలో ఈ సంస్థలో పలురకాలుగా దోపిడీ జరిగినట్లుపత్రికల్లో పుంఖాను పుంఖాలుగాకథనాలువచ్చాయి. ఈవిషయంలో ముఖ్యమంత్రి ఆలస్యం చేయకుండా వెంటనే విచారణ జరిపించాలి.

- గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన గొర్రెలపంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఇది ప్రాథమిక రంగం వృద్ధిరేటును మరింత ఇనుమడిస్తూ అదనపు ఆదాయం పొందే వేసులుబాటును కలిగిస్తుంది. అంత మాత్రమేకాదు ఉపాధి హామీ ద్వారా గొర్రెలు మేకల షెడ్ల నిర్మాణం చేపట్టడం ద్వారావాటికి శాశ్వత గూడు చేకూర్చినట్టు అవుతుంది. గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతంచేసే పనికి ఎందుకునిధులు విధిలించరో అర్థం కావడం లేదు.

-భారత అవినాష్, జనగామ

### పేదలకు అందని వైద్యం

మధ్యతరగతి ప్రజలు కార్పొరేట్ వైద్యంలో తొలి తనిఖీ, పరీక్షలు, బెడ్‌చార్జీలు కుటుంబ భారంతో తట్టుకోలేకున్నారు. దీనికి తోడు ఈమధ్య మందుల ధరలు విపరీతంగా పెరిగినవి. జనరిక్‌లో అన్ని ఉండవు. ఈ పరిస్థితుల్లో కొందరు ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తున్నారు. కొన్ని వ్యాధులకు ఆయుర్వేదం కుదరదు. ఆరోగ్యశ్రీ కి దాని విధానాలు సరిపడాలి. గ్రామం నుండి వైద్యశాలలు దూరంగా ఉంటాయి. ఈ లోగా అవగాహన లేక కొన్ని వ్యాధులు ముదిరి ఒక్కసారి సీరియస్ అవుతోంది. ప్రభుత్వ వైద్య శాఖల సేవలు, మందుల సరఫరా, సిబ్బంది అందుబాటు బాగా పెరగాలి. వార్డులో గదులు, నీటి సరఫరా, వాతావరణం చక్కగా ఉంటే రోగులకు తక్కువ కాలంలో స్వస్థత , నమ్మకం పెరుగుతుంది. ఈ దిశలో ప్రభుత్వం ప్రజా వైద్యానికి వనరులు పెంచితే సమాజంలో వారు బయటి ప్రైవేటు పనులు చేయుటకు సిద్ధం కాగలరు. ఆరోగ్యమే మహాభాగ్యం

-బొల్లోజు మెఘానాథం, విశాఖపట్నం

### శబ్దకాలుష్యాన్ని నియంత్రించాలి

గ్రామాల్లో మైకులు, డిజెలు అధిక శబ్దంతో వినియోగించడం వలన శబ్దకాలుష్యం పెరిగిపోతోంది. శబ్దకాలుష్యానికి వ్యతిరేకంగా ఎన్నికల్లో 9సార్లు నోటావేయడం జరిగింది.పోలీసు శాఖ స్పందించి శబ్దకాలుష్యచట్టం 2000,లౌడ్‌స్పీకర్ లైసెన్స్ యాక్ట్ 2005నికఠినంగా అమలు చేయాలి. రాత్రి 10 గంటల నుండి ఉదయం 6గంటల వరకు లౌడ్‌స్పీకర్లు వినియోగించడాన్ని నిషేధించాలి. మైకుసౌండు 75డెసిబెల్స్ దాటకుండా చూడాలి. పోలీసు శాఖ అనుమతి తర్వాతే లౌడ్‌స్పీకర్లు వినియోగించాలి.

-పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

### పిల్లలను ఒత్తిడికి గురి చేయవద్దు

ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్న వేళ పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ర్యాంకుల పేరిట ఒత్తిడికి గురిచెయ్యరాదు. పిల్లలు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా చూడాలి. అక్కడక్కడ పిల్లలు ఒత్తిడికిలోను అవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పరీక్షల సమయంలో పిల్లలను గమనించవలసిన బాధ్యత ఉపాధ్యాయుల, తల్లితండ్రులపైనే ఉంది. ప్రైవేటు స్కూల్, కాలేజీ యాజమాన్యాలపై పెండింగ్ ఫీజులవిషయంలో వేధించకుండా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఢిల్లీ అభివృద్ధి పరుగులు పెడుతుందా!

**రాజకీయాలలో గెలుపు ఓటములు సహజం. కేజ్రీవాల్‌కి ఢిల్లీలో ఎదురైన మొదటి ఓటమి గుణపాఠంగా తీసుకొని వ్యూహాత్మకంగా రాజకీయ ఎత్తుగడలు వేయకపోతే బిజెపి లాంటి బలమైనపార్టీని ఎదుర్కోవటం కష్టమ వుతుంది. ఢిల్లీలో ఎదురైన ఓటమి నుండి కాంగ్రెస్, ఆప్‌లు తమ రాజకీయ వ్యవహారాలను మార్చుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని ఎదురుదెబ్బలు తగలక మానవు. ఢిల్లీలో ఆప్ ఓటమి తర్వాత కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఢిల్లీ ఎన్నికలలో సాధించిన విజయ స్ఫూర్తితో బిజెపి బీహార్, బెంగాల్, తెలంగాణ, తమిళనాడు, కేరళ వైపు అడుగులు వేస్తుంది. అక్కడ కూడా బిజెపి విజయం సాధిస్తే మరొక దశాబ్దం పాటు భారతదేశ రాజకీయాలలో బిజెపికి ఎదురు ఉండకపోవచ్చు అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.**



డాక్టర్ తిరుణహరి శేషు

ఇరవైఏడు సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో మరొకమారు బిజెపి విజయం సాధించి అధికారాన్ని చేపట్టింది. ఢిల్లీకి రాష్ట్ర హోదా ప్రకటన తరువాత 1993లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికలలో మాత్రమే విజయం సాధించిన బిజెపికి ఢిల్లీ శాసన సభ ఎన్నికలలో గెలుపుఅందని ద్రాక్షగానే మారింది. వరుసగా మూడు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ మరొక మూడు పర్యాయాలు ఆమ్ ఆద్మీ పార్టీలు ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో విజయం సాధిస్తే, 8వసారి జరిగిన శాసనసభ ఎన్నికలలో మాత్రం అధికార ఆప్‌ని ఓడించి 48 శాసనసభ స్థానాలలో విజయం సాధించి ఢిల్లీలో బిజెపి అధికారాన్ని హస్తగతం చేసుకుంది. సుదీర్ఘ విరామం తర్వాత ఢిల్లీలో అధికారాన్ని కైవసం చేసుకున్న బిజెపి ఢిల్లీకి ముఖ్యమంత్రిగా రేఖా గుప్తాని వ్యూహాత్మకంగా ఎంపిక చేసిందనే చెప్పాలి. న్యూఢిల్లీ శాసనసభ నియోజకవర్గంలో ఆప్ జాతీయ కన్వీనర్ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ని ఓడించి జైంట్ కిల్లర్‌గా పేరు తెచ్చుకున్న ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి సాహెబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేష్ వర్మని ముఖ్యమంత్రిగా ఎంపిక చేస్తారనే ఊహాగానాల నడుమ కేజ్రివాల్ బనియా సామాజిక వర్గానికే చెందిన రేఖా గుప్తాని బిజెపి అధిష్టానం ముఖ్యమంత్రిగా ఎంపికచేసింది. సుష్మాస్వరాజ్, షీలా దీక్షిత్, అతిశీల తరువాత ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహిస్తున్న నాలుగవ మహిళ రేఖ గుప్తా తనతో పాటు ముఖ్యమంత్రి పదవి కోసం పోటీపడిన పర్వేష్ వర్మని ఉపముఖ్యమంత్రిగా మరొక పోటీదారు విజేందర్ గుప్తాను స్పీకర్‌గా బిజెపి అధిష్టానం ఎంపిక చేసింది. గత కొంతకాలంగా ముఖ్యమంత్రుల ఎంపికలో బిజెపి అధిష్టానం వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తుంది. మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన రాజస్థాన్ ముఖ్యమంత్రి భజనలాల్ శర్మ ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఎంపికను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, చత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, ఒరిస్సా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్, మాజీ ఎంపికలను భవిష్యత్తు రాజకీయ అవసరాల మేరకే వారిని ముఖ్యమంత్రిలుగా భారతీయ జనతాపార్టీ ఎంపిక చేసిందనే చెప్పాలి. ముఖ్యమంత్రుల ఎంపికలో బిజెపికి కాంగ్రెస్‌కి చాలా తేడానే కనిపిస్తుంది. గుజరాత్ ఎన్నికలకు ముందు విజయ్ రూపానిని మార్చి భూపేంద్ర భాయ్‌పటేల్‌ని ఎంపిక చేసి బిజెపి గుజరాత్‌లో విజయం సాధిస్తే రాజస్థాన్ శాసన సభ ఎన్నికలకు ముందు అశోక్ గెహ్లాట్‌ని మార్చకుండా కాంగ్రెస్ ఆ రాష్ట్రఎన్నికలలో ఓడిపోయింది. ముఖ్యమంత్రిల ఎంపికలో బిజెపి అసాధారణ స్థాయిలో నిర్ణయాలు తీసుకుంటుంది. గోవా ముఖ్యమంత్రి ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి ఆ రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో ఓడిపోయినా మళ్లీ వారినే ముఖ్యమంత్రులుగా బిజెపి అధిష్టానం ఎంపిక చేసిందనే విషయాన్ని గమనించాలి. ఢిల్లీ శాసనసభ ఎన్నికల సందర్భంగా బిజెపి, కాంగ్రెస్, ఆప్‌లు పోటీపడి హామీలు ఇచ్చాయి. బిజెపి ఒక అడుగుముందుకేసి ఉచితాలకు వ్యతిరేకమని చెప్పే పార్టీ కూడా ఓటర్లను ఆకర్షించడానికి గెలుపు కోసం ఆమ్ ఆద్మీపార్టీతో పోటీపడుతూ అనేక హామీలను ఇవ్వడం జరిగింది. బిజెపి ఇచ్చిన హామీలతో ఆప్‌కి ప్రధాన ఓటు బ్యాంకు అయిన మురికివాడలలోని ప్రజలు మధ్య



తరగతి ప్రజలు మహిళలు బిజెపి వైపుకి మొగ్గటం వలనే గత రెండు ఎన్నికలలో సింగిల్ డిజిట్‌కి పరిమితమైన బిజెపి ఏకంగా ఈ పర్యాయం అధికారాన్ని కైవసం చేసుకుంది. బిజెపి ఇచ్చిన ప్రధాన హామీలలో మార్చి 8మహిళా దినోత్సవం నుండి మహిళలకి నెలకి 2500ఇచ్చే పథకాన్ని ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రకటించారు. అలాగే ఆయుష్మాన్ భవ కూడా ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రేఖాగుప్తా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినరోజే యమునా హారతి ఇచ్చి యమునా ప్రక్షాళన చేపడుతున్నామని ప్రకటించారు. సంకల్పపత్రలో ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కొత్తగా కొలువు తీరిన ప్రభుత్వంపై ఉంది. డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఢిల్లీ రూపురేఖలను మారుస్తామని ఢిల్లీ ప్రజలకు కల్పించిన ఆశలను భారతీయ జనతా పార్టీ నెరవేర్చాలి. ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ నిర్ణయాలకి లెఫ్ట్‌నెంట్ గవర్నర్‌తో అడ్డుకునే ప్రయత్నం బిజెపి చేసిందని అనేక సందర్భాలలో ఆరోపణలు వచ్చాయి. ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వానికి అంతిమ నిర్ణయ అధికారం ఉంటుందని సుప్రీంకోర్టు చెప్పినా కేంద్రం లెఫ్టినెంట్ గవర్నర్ నిర్ణయాలే చెల్లుబాటు అయ్యేవిధంగా కేంద్రం ఆర్డినెన్స్ కూడా తీసుకొచ్చి నాటి ఢిల్లీ ప్రభుత్వాన్ని బిజెపి అడ్డుకునే ప్రయత్నం చేసిందనే ఆరోపణలు కూడా వచ్చాయి. కానీ ఇప్పుడు కేంద్రంలో రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉండటం వలన ఢిల్లీ అభివృద్ధి పరుగులు పెడుతుందనే ఆశలు కల్పించారు. కాబట్టి ఆ ఆశలను నెరవేర్చాల్సిన బాధ్యత బిజెపిపైనేఉంది. తమకు నచ్చని ప్రభుత్వాలు తమ కూటమితో లేని ప్రభుత్వాలు ఆయా రాష్ట్రాలలో ఉంటే ఆరాష్ట్రాల అభివృద్ధి సంక్షేమంలో సహకరించకపోవటం సమైక్య స్ఫూర్తికి విరుద్ధమనే విమర్శలు వస్తున్నాయి.విపక్షాలు అధికారంలో ఉన్నబెంగాల్ కేరళ, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు ప్రభుత్వాలు కేంద్రంపై ఇవే ఆరోపణలు చేస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలు రావటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఆమ్ ఆద్మీ పార్టీ 2013లో అధికారంలోకి వచ్చి ఒక దశాబ్దానికి పైగా ఢిల్లీలో అధికారంలోఉంది. ఢిల్లీ కేంద్రంగానే ఆప్ అనతి కాలంలోనే ఇతర రాష్ట్రాలకు విస్తరించి పంజాబ్‌లో అధికారంలోకి రావటమే కాదు జాతీయ పార్టీ స్థాయికి కూడా ఆమ్ ఆద్మీ పార్టీ ఎదిగింది. ఢిల్లీలో ఆప్‌గెలిచినప్పుడు మిగతా పార్టీలు దారుణ ఓటమి చెందాయి. కానీ ప్రస్తుతం జరిగిన ఢిల్లీ శాసన సభ ఎన్నికలలో ఆమ్‌ఆద్మీపార్టీ 22 శాసనసభ స్థానాలలో విజయం సాధించి బలమైన ప్రతిపక్షంగా ప్రజల తరఫున పోరాడే బాధ్యతను ప్రజలు ఆప్‌కి కట్టబెట్టారు. కాబట్టి ఆప్ ఢిల్లీలో ఒక నిర్మాణాత్మక ప్రతిపక్షపాత్రను పోషించాలి. ఢిల్లీ శాసనసభ ఎన్నికల సందర్భంగా గత ప్రభుత్వ సంక్షేమపథకాలను కొనసాగిస్తామని హామీని భారతీయ జనతా పార్టీ ఇచ్చింది. కాబట్టి పాత పథకాలను కొనసాగించే విధంగా కొత్త పథకాలను అమలు చేసేవిధంగా ఆప్ ప్రధాన ప్రతిపక్షంగా ఢిల్లీ ప్రభుత్వంపై ఒత్తిడితేవాలి. ఆమ్ ఆద్మీ పార్టీకి ఇది ఒక మంచి అవకాశం. పార్టీ పెట్టగానే అధికారంలోకి వచ్చి అధికారం అనుభవించిన పార్టీ ఇప్పుడు ప్రతిపక్ష పార్టీగా అధికారం లేకుండా ప్రజలపక్షాన పోరాడి మరింత రాజకీయ పరిణితిని పరిపక్వతను పొంది భవిష్యత్తులో బలమైన పార్టీగా ఎదగాలి. రాజకీయాలలో గెలుపు ఓటములు సహజం. కేజ్రీవాల్‌కి ఢిల్లీలో ఎదురైన మొదటి ఓటమి గుణపాఠంగా తీసుకొని వ్యూహాత్మకంగా రాజకీయఎత్తుగడలు వేయకపోతే బిజెపి లాంటి బలమైనపార్టీని ఎదుర్కోవటం కష్టమవుతుంది. ఢిల్లీలో ఎదురైన ఓటమి నుండి కాంగ్రెస్ ఆప్‌లు తమ రాజకీయ వ్యవహారాలను మార్చుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా మరిన్నిఎదురుదెబ్బలు తగలకమానవు. ఢిల్లీలో ఆప్ ఓటమి తర్వాత కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఢిల్లీ ఎన్నికలలో సాధించిన విజయ స్ఫూర్తితో బిజెపి బీహార్, బెంగాల్, తెలంగాణ, తమిళనాడు, కేరళ వైపు అడుగులు వేస్తుంది. అక్కడ కూడా బిజెపి విజయం సాధిస్తే మరొక దశాబ్దం పాటు భారతదేశ రాజకీయాలలో బిజెపికి ఎదురు ఉండకపోవచ్చు అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ●

# విద్యుత్ చార్జీలు పెంచకపోవటమే కాదు, తగ్గించాలి

తిరుమలశెట్టి సాంబశివరావు

మొన్న ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం మన రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను పెంచబోవటం లేదని ప్రకటించారు. కానీ ఆ ప్రతిపాదన ఒక్కటే సరిపోదు. గతంలో వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు పేరున అడ్డగోలుగా బస్సు,విద్యుత్ ఛార్జీల వంటివి భారీగా పెంచి సామాన్యుల నడ్డి విరిచిందని అన్ని విపక్షాలతోపాటు అప్పటి ప్రధాన ప్రతిపక్షమైన తెలుగు దేశం కూడా తీవ్రంగా ఆందోళన చేసింది. అంతకు ముందు నెలకు 200 యూనిట్లలోపు సాధారణ గృహ వినియోగదారులకు యూనిట్ ఒక్కటికి రెండు మూడు రూపాయల చొప్పున నెలకు నాలుగైదు వందల రూపాయల బిల్లులు వస్తే వైసీపీ ప్రభుత్వ హయాంలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకానికి ట్రూఅప్ చార్జీలు, రకరకాల సెస్సుల పేర్లతో విద్యుత్ సంస్థలు నెలనెలా వేయి రూపాయల పైగా బిల్లుల రూపంలో సామాన్య గృహ వినియోగదారుల నుండి వసూలు చేశాయి.ఇప్పటికీ ఆ అధిక చార్జీలు వసూలు చేస్తున్నాయి. మరోవైపు నెలకు కనీస విద్యుత్ వాడకం 200 యూనిట్లుగా వుంటుందని ప్రభుత్వం వారు నిర్ణయించి యస్సీలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. కానీ ఇతర వర్గాల సామాన్యులు వాడుకునే అదే 200 యూనిట్ల లోపు కనీస వాడకపు బిల్లులు మాత్రం వేయి రూపాయలకు తగ్గకుండా సామాన్యులకు తడిసి మోపెడు అవుతున్నాయి. నేడు విద్యుత్ కూడా అందరికీ నిత్యావసరమైంది.



అదేమి విలాస వస్తువు కాదు. కనుక వారికి కూడా సహేతుకమైన ధరలకే అందజేయాలి.ప్రభుత్వం అంటే లాభనష్టాలు బేరీజు వేసుకునే ప్రైవేటు సంస్థకాదు. ఒకప్పుడు మన నేతలు సౌర, పవన విద్యుత్ ఉత్పత్తితో విద్యుత్ చార్జీలు తగ్గుతాయని భరోసా ఇచ్చారు. కానీ తగ్గకపోగా భారీగా పెంచటం దురదృష్టకరం. కొన్ని ప్రైవేట్ సంస్థలతో జరిగిన ఒప్పందాల్లో జరిగిన అవకతవకల కారణంగా విద్యుత్ చార్జీలు పెరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. కనుక ఈ ప్రభుత్వం కూడా తమిళనాడు ప్రభుత్వం వలెప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని గత ప్రభుత్వ హయాంలో అదానీ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవటమే గాక ఏనుగులు పోయేకంతను వదిలి చీమలు దూరేకంతను మూసినట్లు ఎంతో ఖర్చుతో కూడిన అదానీ కంపెనీ ఇచ్చే స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలి. చార్జీల భారం తగ్గిస్తుందనీ, పరిపాలన గాడిలో పెట్టగలదని ఆశించి ఓటర్లు తెలుగు దేశాన్ని గెలిపించారు. కనుక గత ప్రభుత్వం పెంచిన ఆ చార్జీల భారం తగ్గించవలసిన నైతిక బాధ్యత ఈ ప్రభుత్వం పైనే వుంది. నానాటికి ద్రవ్యోల్బణం, ధరలు, చార్జీల భారం పెరుగుతుంటే కొద్దిమంది సంపన్న, ఉద్యోగ అధిక ఆదాయ వర్గాల వంటి వారు తట్టుకోగలిగారు గాని అత్యధిక శాతం ప్రజల ఆదాయం మాత్రం పెరగక ఇక్కట్లు పడుతున్నారు కనుక ఈ ప్రభుత్వమైనా గత ప్రభుత్వం పెంచిన పన్నుల భారం తగ్గిస్తే సామాన్య ప్రజానీకానికి మేలు జరుగుతుంది. ఇది అవకతవకలకు ఆస్కారం లేనీ, అందరికీ సమన్యాయం చేసే సంక్షేమ పథకంగానే భావించాలి. ●

# ప్ర'యాగం'లో ఏదీ జల'సంస్కారం'!

వరిగొండ కాశీ విశ్వేశ్వర రావు

ఇది భారతీయ సనాతన సంస్కృతిలో ఒక భాగం. పుణ్యనదుల్లో స్నానానికి, ఆచమనీయానికి స్వచ్ఛమైన నీరే ఉంటుందనే భావనతో భక్తులు నదీ స్నానాలాచరిస్తుంటారు. ఆ వెంటనే ఆచమనీయమూ. కానీ ప్రయాగరాజ్‌లోని మహాకుంభమేళా 'అమృత' స్నానాలకు వినియోగిస్తున్న నీరు స్వచ్ఛజలమేనా? అనే విషయంలో భక్తులను గందరగోళంలో పడవేసే రెండు రకాల విరుద్ధ భావనలు జనంలో వ్యాప్తి చెందుతున్నాయి. గంగా, యమున, సరస్వతీ, త్రివేణి సంగమం ఎంతో పవిత్రంగా భాసిల్లుతోంది. అది భక్తుల ఆధ్యాత్మిక భావాల నుంచి చెరిపేయలేనిది. సరస్వతీ నది ప్రవాహమార్గం గురించి ఎంతో చరిత్ర ఉన్నా ఆ నది త్రివేణి సంగమం వద్ద అంతర్వాహినిగా ఉంటుంది. సరిగ్గా మహాకుంభమేళా సమయంలోనే నదుల్లో కోలీఫామ్ బ్యాక్టీరియా అత్యధిక స్థాయిలో ఉన్నందున స్నానానికికానీ, ఆచమనానికి కానీ పనికిరాదంటూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు సమర్పించిన నివేదిక విశేషాలు బయటపడ్డాయి. అలా అని ఈ నివేదిక సాకుతో ఉన్నట్టుండి మహాకుంభమేళాను అర్థాంతరంగా ముగించలేని పరిస్థితి తలెత్తింది. మహాశివరాత్రి వరకు సాగుతుంది. మరికొంతకాలం పొడిగించాలన్న విజ్ఞాపనలున్నాయి. అదృష్టవశాత్తూ కాలుష్య నియంత్రణ మండలి గంగాజల నాణ్యతపై నివేదికలో ప్రతి ఒక వంద మి.లీ లీటర్ల నీటిలో 2500 వరకు కోలీఫామ్ బ్యాక్టీరియాలుంటాయని అయినా ఆ నీరు స్నానానికి యోగ్యమేనని, ఇంత కన్నా బ్యాక్టీరియా రీడింగ్ దాటితే వ్యాధులు శరీరాన్ని సోకుతాయని విశ్లేషించింది. ఇది శాస్త్రీయ పరిశోధన ఎవరూ కాదనలేం.అయినా ఎన్నో కోట్లమంది భక్తులు అక్కడ ఎంతో పవిత్ర భావంతో స్నానాలచరిస్తారు. పుణ్యం లభించిందని, పాపప్రక్షాళన పొందగలిగామన్న సంతోషంతో ఇళ్లకు తిరిగి వెళ్తారు. వారిని సందేహాలతో బాధించే కన్నా సద్భావనతో స్వాగనంపడం మంచిది. కాగా కాలుష్య మండలి నివేదికను తోసిపుచ్చినా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మరికొన్ని మీమాంసలను వారి ముందుంచినట్లయింది. ఏకంగా గంగానది జిల్లాల్లో కొన్ని ప్రాంతాలలో ప్రతి 100 మి.లీ లీటర్ల నీటిలో 7900 నుండి 11వేలవరకు కోలీఫామ్ బ్యాక్టీరియాలున్నట్లు పరిశోధన మండలి తేల్చేసింది. అయితే కాలుష్యనియంత్రణ మండలి లెక్కలు కాకి లెక్కలు అనుకున్నారో, గంగాజలాల్లో ప్రవాహంలో అనిశ్చితి ఉండటాన్ని బట్టి కాలుష్య పరిస్థితులను యు.పి కాలుష్య నియంత్రణ మండలి కూడా ఆ అంశాలను పరిశీలిస్తున్నందున లీటరు నీటిలో మూడు మి.గ్రాములకంటే తక్కువ బయోలాజికల్ ఆక్సిజన్‌డిమాండ్ (బి.ఒ.డి) ఉంటే ఆ నీళ్లు స్నానానికి యోగ్యమేనని ప్రభుత్వాధినేతలు విశ్లేషించారు. నిజమే భక్తుల్లో అనుమానా లు తలెత్తకుండా సర్దిచెప్పుకోడం ప్రభుత్వాలు చేయాల్సిన పనే. కాదనలేం. సంగమ స్థలంలో 3.94 నుంచి 5.29వరకు బిఒడి స్థాయిలున్నట్లు కేంద్రకాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. ఇంత గట్టి హెచ్చరిక చేస్తూనే ఆతర్వాత మంచినీటిని గంగా నదిలోకి వదలడం వల్ల దాని స్థాయి తగ్గిందని చెప్పడం



చూస్తే,సరిగ్గా మహాకుంభమేళా సందర్భంలో ఇంత'కాలుష్య' రచ్చ అవసరమా అనిపిస్తుంది. కర్ర విరగకుండా పాము చావకూడని రీతిలో ఈ అభిప్రాయం వెల్లడైంది. సాధారణంగా భక్తజనసందోహం పవిత్ర గంగా నది ఎంతోస్వచ్ఛమైన నీటితో శాంతంగా ఉంటుందని,అక్కడ స్నానం తమలోని కశ్మలాన్ని తొలగించి చర్మవ్యాధులనుంచి ఉపశమనం కలిగిస్తుందని భావిస్తారు. అదే భావనతో స్నానాలు చేస్తారు.కాగా ఈ విషయాలపై ఇప్పుడు ప్రజల్లోకి విడుదలచేసి, సందేహాలు కల్పించడమంచిది కాదని ఆ కేంద్ర సంస్థలేవీ ఆలోచించినట్లులేదు. అయితే ఈ అంశంపై కాలుష్యమండలి నివేదిక లోపభూయిష్టమని, పాత నమూనాలతో నివేదిక సమర్పించినట్లుందని, వాటిని నియంత్రించడంలో ఎలాంటి చర్యలు చేపట్టారో జాతీయ హరిత ట్రిబ్యునల్ మండిపడింది. ఫీకల్ కోలీఫామ్‌ల స్థాయిల గురించి ఎక్కడా చెప్పకుండా సమర్పించిన నివేదిక సరైన వివరాలు లేకుండానే నీటి నాణ్యత గురించి ఓ నిర్ణయానికి రావడంపట్ల ఆగ్రహం వెలిబుచ్చింది. ఇలాంటి నివేదికపైమళ్లీ ప్రత్యేకించి ఉత్తరప్రదేశ్‌ముఖ్యమంత్రి యోగికి సందేహనివృత్తి చేసే పని పెట్టినట్లున్నారు.శాస్త్రీయ పరిశోధనలు ఇలా వివరిస్తుంటే పాపం ఆయనేమి చెప్పగలరు అని సందేహం తలెత్తక మానదు. నిత్యం సనాతన ధర్మమే గొప్పదని భావించే యోగి పుంగవుడాయన. జలకాలుష్యం ఎన్నో ఆరోగ్య ప్రమాదాలు తెచ్చిపెడుతుందని ప్రపంచ ఆరోగ్యసంస్థ హెచ్చరించినా, యోగి తనధోరణిలో గంగాజలం స్నానానికి, ఆచ మనానికి, అనుపానానికి పనికి వస్తుందని నమ్మబలికారు. అతితక్కువ సమయంలో గర్భాశయానికి చేరి ప్రాణహాని కలిగించే న్యూఢిల్లీ మెటాలో బీటా లాక్టమేస్ ఎన్‌డిఎం-1 బ్యాక్టీరియా గంగానదిలో ప్రమాదకరమైనస్థాయిలో ఉన్నట్లు గతకాలం నాటి పరిశోధనలు చెబుతున్నాయి. అదొకమొండి బ్యాక్టీరియా.పిల్లల్లో తీవ్ర ఇన్‌ఫెక్షన్‌లు కలిగిస్తుంది. అది అంతమైనట్లుకానీ, ఇక రాదని కాని చెప్పే ఏ పరిశోధనా మనకు అందుబాటులోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో జల సామాన్యమైన రీతిలో బ్యాక్టీరియామీద యుద్ధం ప్రకటించలేం. అలాఅని ప్రజల నమ్మకాలనూతుడిచిపెట్టలేం. వారి ఆరోగ్యంపై జరిగే బ్యాక్టీరియా దాడులనూ నిరోధించలేం. ఈనేపథ్యంలో ప్రభుత్వాలు,కాలుష్యనివారణ పథకాల కన్నా ముందుగా సందేహాలు కల్పించే సంస్థలకు కనీస 'జల' సంస్కారం అబ్బేటట్లు చూడటం ముఖ్యం. అందుచే మహాకుంభమేళాను ఇక పొడిగించకుండాస్వస్తివాచకం పలకడమే మేలనే అభిప్రాయాలున్నాయి. ఎన్నితొక్కిసలాట ఉదంతాలు జరుగుతున్నా గత దుస్సంఘటనల నుంచి గుణపాఠాలు నేర్చుకోని ప్రభుత్వాల ధోరణి వలననే మళ్లీ మళ్లీ ప్రమాదాలు జరుగుతున్నాయి.ప్రభుత్వం వారేమిసెలవిచ్చినా ప్రయాగ్‌రాజ్ దుర్ఘటనకు దారి తీసిన సంఘటనలు వేరే ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చేరుకోవాల్సిన ఏరైలయినా, ఏ స్థాయి రైలయినా అయిదు ప్లాట్‌ఫారమ్ ఉన్న అజ్మీరీ గేట్ టెర్మినల్ వద్ద ఆగాల్సిందే. తొక్కిసలాట జరిగిన ఈ న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ ఆనుపానులు, రద్దీసమయాల గురించి తెలియని రైల్వే అధికారులెవరూ లేరు. సాధారణ ప్రయాణీకులంతా ఇక్కడ ప్రయాగ్‌రాజ్ ట్రెయిన్‌లు ఎక్కాల్సినవారే. రోజూ ఆస్టేషన్‌లో ఏడువేల టిక్కెట్లు విక్రయిస్తారు. కానీ ప్రమాదం జరిగిన శనివారం నాడు మొత్తం 9600జనరల్ టిక్కెట్లు విక్రయించారు. వీరుగాక రిజర్వేషన్‌లేని ప్రయాణికులు పదివేలమంది ఉంటే అసలు టిక్కెట్‌లేని ప్రయాణీకులూ సర్వసాధారణం. అన్నిఅంశాలూ కళ్లెదుటేఉన్నా అంచనా వేసుకోకుండా ఓముందస్తు ప్రణాళిక లేకుండా రైల్వేశాఖ, ప్రభుత్వ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు సాధారణ జనం కర్మకు వారిని వదిలేయడం క్షమార్హంకాదు. ఎవరి నిర్లక్ష్యం ఎంతపాలన్న విషయం ఇప్పట్లోతేలేదికాదు. ఈలోగాఇలాంటి దుర్ఘటనలు జరగకుండా ఆయాప్రభుత్వాలు చూడగలవోలేదో కూడా చెప్పలేం!అందుకే ప్రయాగ్‌రాజ్ పేరిట అధికారికంగా అక్కడా,ఇక్కడా వెరశి 24 మందికి నీళ్లొదిలేశాం. ●

# జనసేనలోకి కార్పొరేటర్లు

ఒంగోలు, ప్రభాతవార్త

మాజీ మంత్రి బాలినేనిశ్రీనివాసరెడ్డి ఇప్పటికే జనసేన పార్టీలో చేరారు. తాజాగా ఆయన దారిలో మరికొందరు ఒంగోలు నగర పాలక సంస్థలోని కార్పొరేటర్లు నడిచేందుకు సిద్ధమయ్యారు. ఒంగోలు నగర కార్పొరేటర్లు బాలినేని ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ సమక్షంలో చేరాలని అనుకున్నారు. పలు మార్లు వాయిదాలు పడ్డాయి. మంగళవారం నాడు సాయంత్రం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పలువురు కార్పొరేటర్లు జనసేన తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ మేరకు సోమవారం నాడు మంగళగిరి తరలివెళ్లారు బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి ఒంగోలుకు వచ్చి కార్పొరేటర్లతో సమావేశమై మంగళవారం ఉదయం మంగళగిరికి బయలుదేరనున్నారు. తొలుత బాలినేని ఒక్కరే పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అనంతరం ఒంగోలులో సభ ఏర్పాటు చేసి అనుయాయులను చేర్చాలనే ప్రయత్నం ఫలించలేదు. తాజాగా నగర పాలక సంస్థలో తన వెంట రావడానికి ఆసక్తి చూపుతున్న కొందరు కార్పొరేటర్లను మంగళగిరిలోని జనసేన కార్యాలయానికి రప్పించి అక్కడ చేర్పించేలా సన్నాహాలు చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించడంతో హైదరాబాద్‌లో ఉన్న బాలినేనిశ్రీనివాసరెడ్డి ఆయన తనయుడిని హడావుడిగా సోమవారం మధ్యాహ్నం కల్లా ఒంగోలు పంపించి కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్లతో చర్చించి మంగళవారం ఉదయం మంగళగిరికి తరలివెళ్లాలని కార్పొరేటర్లకు బాలినేని ప్రణీత్‌రెడ్డి చెప్పినట్లు సమాచారం. అసెంబ్లీ సమావేశం అయిన వెంటనే సాయంత్రం జనసేన పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లకు జనసేన జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించనున్నట్లు సమాచారం. మంగళవారం మధ్యాహ్నం కల్లా హైదరాబాద్ నుంచి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి బయలుదేరి విజయవాడకు రానున్నారు. బాలినేని నేతృత్వంలో కార్పొరేటర్లు పలువురు నాయకులు జనసేనలో చేరనున్నారు.

## చీటర్ సీఐ శ్రీనివాసరావు సర్వీస్ నుంచి డిస్మస్



నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

సీఐ బత్తుల శ్రీనివాసరావుని విధుల నుండి శాశ్వతంగా తొలగింపు. రూ.35 లక్షలు మోసం చేశాడని 2021లో గుంటూరు నగరం పాలెం, పోలీసులకు రొంపిచర్ల మండలం సంతగుడిపాడుకి చెందిన రామారావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. రామారావు ఫిర్యాదుతో అప్పట్లో జీవో ఎఫ్ఐఆర్ పై కేసు నమోదు చేసిన నగరంపాలెం పోలీసులు. 2021 నుంచి సస్పెన్షన్‌లోనే ఉన్న బత్తుల శ్రీనివాసరావు. విశాఖపట్నంలో రిటైర్డ్ ఆర్మీ అధికారికి రూ.35 లక్షలు మోసం చేసిన బత్తుల శ్రీనివాసరావు. ఈయనది నాగులుప్పలపాడు మండలం పోతవరం గ్రామానికి చెందిన వాడు.

## సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌ను కలిసిన బిజెపి నాయకులు



మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం నందు సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌ను బీజేపీ అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ పివి కృష్ణారావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులతో సోమవారం కలిసి వివిధ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. మార్కాపురంలో గోవుల రక్షణ కోసం శాశ్వత పరిష్కారం ఆలోచించాలని, మార్కాపురం సప్లైఛానల్‌లో వ్యర్థాలు పెరిగి ఆ ప్రాంతంలో నివశిస్తున్న ప్రజానీకాన్ని దోమల బెడద నుండి కాపాడాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలని, మార్కాపురంలో ఎస్సీ, బిసి విద్యార్థులకు శాశ్వత హాస్టల్ భవనాలు లేక ప్రైవేటు ఇరుకు గదులలో వసతులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి వెంటనే హాస్టల్ భవనాలు నిర్మించాలని కోరడమైనది. స్పందించిన సబ్ కలెక్టర్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళి భవనాలకు స్థలము చూపించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాదర్తి ఆంజనేయులు జి సతీష్, మర్రిపూడి రామకృష్ణ, శివప్రసాద్ కుమార్, వెంకటేశ్వరరెడ్డి, డి ఖాశిం, బోయ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాగి తీగల దొంగల ముఠా అరెస్టు

### - డీఎస్పీ లక్ష్మీ నారాయణ





దర్శి, ఫిబ్రవరి24, ప్రభాతవార్త

ట్రాన్స్‌ఫార్మర్‌లను పగలగొట్టి రాగి తీగలను దొంగిలిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా దర్శనాన్ని బీఎస్పీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం ఈ సందర్భంగా డీఎస్పీ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ఆరుగురు సభ్యులు ముఠాగా ఏర్పడి దర్శి, తాల్లూరు, ముండ్లమూరు మండలాలతో పాటు బాపట్ల జిల్లా బల్లికురవ, అద్దంకి, కొరిశపాడు మండలాలలో ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగతనాలకు ప్లాపడుతున్నారని, దొంగిలించిన రాగి తీగను అమ్ముతూ వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ముఠాపై ఇప్పటికే అనేక కేసులు ఉన్నాయని, 72 ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి 588 కేజీల రాగి తీగలను దొంగిలించారని నేడు వారిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ లక్ష్మీ నారాయణ తెలిపారు. దర్శి సీఐ రామారావు ఆధ్వర్యంలో ముండ్లమూరు, దర్శి, తాళ్లూరు ఎస్సైలు ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగతనాలపై ప్రత్యేక నిఘా చేపట్టి వారిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 88 కేజీల రాగి తీగను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీఉకుంటున్నట్లు మీడియా సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముండ్లమూరు ఎస్సై వై.నాగరాజు, తాళ్లూరు ఎస్సై మల్లిఖార్జునరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో మెరిసిన శ్రీ సరస్వతి విద్యార్థులు

### - ఆల్ ఇండియా జేఈఈ మెయిన్స్ పేపర్ 2 పరీక్షల్లో ఎస్సీ కేటగిరి విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన్ లోక్‌క్రితీ

### - 99.94 పర్సంటైల్ తో జయకేతనం...ప్రత్యేకంగా అభినందించిన చైర్మన్ రమణారెడ్డి




ఒంగోలు, ప్రభాతవార్త

2025 జేఈఈ మెయిన్స్ పేపర్ 2 పరీక్ష ఫలితాలలో ఒంగోలు కు చెందిన శ్రీ సరస్వతి విద్య సంస్థల విద్యార్థి కె.లోక్ క్రీటి ఎస్సీ విభాగంలో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు,99.94 పర్సంటైల్‌తో ఆల్ ఇండియా విభాగంలో తొలి స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఒంగోలు మంగమూరు రోడ్డులోని సరస్వతి కళాశాల ఆవరణంలో జరిగిన మీడియా సమావేశంలో ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థినీ విద్యార్థులు కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు పొందిన లోక్ క్రీటీ 99.94, ఇంద్రిసేనారెడ్డి 99.62,శ్రీనివాస చారి99.30, గుణశేఖర్ రెడ్డి 99.22 పర్సంటైల్ పొందిన విద్యార్థులను విద్య సంస్థల చైర్మన్ రమణ రెడ్డి పుష్ప గుచ్చాలతో ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ నేడు వెలువడిన జేఈఈ మెయిన్ పేపర్ 2 ఫలితాల్లో సరస్వతి విద్యార్థులు దేశ స్థాయిలో చరిత్ర సృష్టించారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సరస్వతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచారని ఆనంద వ్యక్తం చేశారు. సరస్వతి విద్య సంస్థల అకడమిక్ ప్రోగ్రాం పటిష్టత వలనే ఇంతటి విజయం సాధ్య పడిందని పేర్కొన్నారు. సాధారణ పాఠశాల,కళాశాలలో చదివిన ఈ విద్యార్థులే నేడు దేశం గర్వించే స్థాయికి ఎదిగారు అని కొనియాడారు. ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థులు మాట్లాడుతూ క్రమశిక్షణ,అంకిత భావం కలిగిన విద్యను తమకి అందించడం వల్లనే తాము ఇంతటి ఉన్నత విజయం సాధ్యపడిందని తెలియజేశారు. తమకి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన కళాశాల యాజమాన్యం, అధ్యాపక అధ్యపకేతర బృందానికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సరస్వతి విద్య సంస్థల డైరెక్టర్లు గణేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సీఈవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓణీల ఫంక్షన్‌కి హాజరైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



దర్శి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

దర్శి మండలంలోని నాగంబొట్ల పాలెం గ్రామంలో గంగిరెడ్డి యలమందారెడ్డి కుమార్తె ఫంక్షన్‌కు హాజరై చిన్నారులని ఆశీర్వదించిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కేవీ రెడ్డి, పోశం మధుసూదన్‌రెడ్డి, మారం ఇంద్రసేనారెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, సోము దుర్గారెడ్డి, పులి బ్రహ్మారెడ్డి, పులి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## గోడౌనును తనిఖీ చేసిన జెసి



చీమకుర్తి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

చీమకుర్తిలో నిత్యవసర వస్తువులు నిల్వ ఉంచే గోడౌన్‌ను జాయింట్ కలెక్టర్ రోనంకి గోపాలకృష్ణ సోమవారం తనిఖీ చేశారు. మార్చి అలాట్మెంట్ కు సంబంధించిన నిత్యావసర సరుకుల స్టాక్ వివరములను పరిశీలించారు .ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా చౌక ధరల దుకాణాలకు రవాణా అవుతున్న సోర్టెక్స్ ఫోర్టిఫైడి బియ్యం ,పంచదార స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. ఐసిడిఎస్ స్కీం ద్వారా బాలింతలకు గర్భిణీ స్త్రీలకు పంపిణీ చేయాల్సిన కందిపప్పు, పామోలిన్ నూనె యొక్క నాణ్యతను పరిశీలించారు. మార్చ్ అలాట్మెంట్ కు సంబంధించి స్టాక్ ఎగుమతి దిగుమతులకు కావలసిన హమాలీలను అందుబాటులో ఉంచవలసిందిగా జెసి సూచించారు. వారి వెంట వరలక్ష్మి, జిల్లా మేనేజర్ పౌరసరఫరాల సంస్థ, జయలక్ష్మి గోడౌన్ ఇంచార్జ్ ,కే .బ్రహ్మయ్య చీమకుర్తి మండల తాసిల్దార్ గారు పాల్గొన్నారు.

# పి-4 సర్వేను వేగవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు, ప్రభాతవార్త

పి- 4 సర్వేను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి ఒకటో తేదీన పెన్షన్‌ల పంపిణీ ఉంటుందని, రెండో తేదీ ఆదివారం అయినందున ఈ సర్వేను ఈ వారంలోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో సచివాలయ సిబ్బంది చురుకుగానే పని చేయాలని ఆమె దిశానిర్ధేశం చేశారు. అదే విధంగా పెన్షన్‌ల పంపిణీ సమయంలో నగదు విషయంలో జాగ్రత్తగా ఉండాలని సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. లబ్దిదారులతో నిర్లక్ష్యంగా ప్రవర్తించినా సహించబోనని స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈ సర్వే మార్చి 15 నాటికి పూర్తి చేయాలని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో ఫారం పాండ్స్ తవ్వకాలపై మరింత దృష్టి పెట్టాలని కలెక్టర్ అన్నారు. లేబర్ మొబిలైజేషన్ పైనా ,సగటు వేతనం పెంపు పైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని దిశానిర్ధేశం చేశారు. అదే విధంగా ఇంకుడు గుంతలను కూడా త్వరగా పూర్తి చేసేలా పర్యవేక్షించాలని చెప్పారు. గృహ నిర్మాణ పథకంలో లబ్దిదారులు వేగంగా ఇళ్ళు నిర్మించుకునేందుకు అవసరమైన పొజిషన్ సర్టిఫికేట్లను త్వరగా మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో స్పష్టమైన పురోగతి ఉండాలని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల వారికి ప్రభుత్వం అదనంగా ఇచ్చే ఆర్థిక సహాయంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో పారిశుధ్యాన్ని అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్వహణ, తాగునీటి ఫ్లోరినేషన్ విషయాలలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్వో బి.చిన్న ఓబులేషు, డీపీఓ వెంకట నాయుడు, జడ్పీ సీఈఓ చిరంజీవి, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, డబ్ల్యూఎంఎ పీడీ జోసఫ్ కుమార్,



జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకరరావు, సీపీఓ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఒంగోలు, ప్రభాతవార్త

భూమి రీ సర్వేతో గత ప్రభుత్వంలో ఎన్నో అవకతవకలు జరిగాయని కూటమి ప్రభుత్వం ఆరోపించింది. అసలు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మంచిది కాదని, దీనిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఆ మేరకు అసెంబ్లీలో బిల్లు పెట్టి ప్రభుత్వం ఆమోదించింది. అందరూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దైయిందని అనుకున్నారు. కానీ మళ్లీ రీ సర్వేను ప్రభుత్వం కొనసాగిస్తుంది. అయితే గతంలో మాదిరి సర్వే త్వరగా పూర్తి కావాలని మాత్రం ప్రభుత్వం ఒత్తిడి చేయడం లేదు. ఏ రోజు ప్రాంతం రీ సర్వే చేసేందుకు సర్వేయర్లు వస్తున్నారో ఆ ప్రాంత పొలాల్లో రైతులకు ముందు రోజు సమాచారం ఇస్తున్నారు. సర్వే చేసేటప్పుడు ఎవరి భూమి ఎంత వరకు ఉందో రైతే చూపించాలి. వాస్తవానికి ఎవరి పేరుతో ఏ సర్వే నెంబర్లులో ఎంత ఉందో రికార్డుల్లో ఉంటుంది. ఆ వివరాలు కూడా వారి వద్ద ఉంటాయి. ఇక రైతుల మధ్య గట్టు సమస్యలు కావచ్చు, ఒక రు పొలాన్ని మరొకరు ఆక్రమించుకుని ఉండొచ్చు ఆ విషయం వారికి చెప్తే అది పరిష్కరించే పని మాది కాదు, కొలత వరకు మాత్రమే చేస్తాం అంటున్నారు. సర్వేయర్లు ఎవరి పొలం ఎంత ఉంది, ఎక్కడ వరకు ఉందో చెప్తే దాని ప్రకారం బౌండరీలు ఫిక్ చేసి హద్దులు నిర్ణయిస్తున్నారు. అలా కాకుండా సమస్యలు ఉన్న చోట హద్దులు ఫిక్స్ చేయకుండా ఎవరి పేరుతో ఎంత పొలం ఉందో గతంలో ఉన్న వివరాల ప్రకారం వివాదంలో ఉన్న పొలాలన్నింటికి ఒకే నెంబరు కిందకు తీసుకువచ్చి ఆ భూమి యజమానుల పేర్లు కలిపి రాస్తున్నారు. దీంతో కొత్తగా ఇవ్వబోయే ఈ పాస్ పుస్తకాల్లో ఎంత మంది రైతులకు హద్దులు ఫిక్స్ చేయలేదో వారందరి పేర్లు ఉంటాయి. సమస్య పరిష్కారం అయిన తరువాత మాత్రమే ఆ రైతుకు హద్దులు నిర్ణయిస్తారు. అంత వరకు అందరి పేర్లు అందరి పాస్ పుస్తకాల్లో ఉంటాయి. ఇది చిత్రంగా లేదు. చాలా మంది రైతులు తమ పాస్ పుస్తకాలు బ్యాంకుల్లో పెట్టి అప్పులు తీసుకున్నారు. ఆ అప్పులు ప్రతి సంవత్సరం చెల్లించాల్సి ఉంటుంది. ఏడాది చివరి మార్చి లోపల చెల్లించకపోతే మొత్తం అసలు వడ్డీ ఎంతైందో చూసి అందులో ఎంతో కొంత రైతుల నుంచి బాకి కట్టించి రుణం తిరిగి రెన్యువల్ చేస్తారు. ఆ సందర్భంగా పాస్ పుస్తకాలు మరో సారి పరిశీలిస్తారు. ఎందుకంటే భూమిని వేరే వారికి అమ్మారా వారి పైనే ఉందా అని పరిశీలించేందుకు ఇలా చేస్తారు.

## రీ సర్వే చిత్రాలు

ఇప్పటికే సర్వే పూర్తియిన వారికి టైటిల్స్ వచ్చాయి. ఆ పాస్ పుస్తకంలో సర్వే నెంబర్లు బదులు వేరే నెంబర్లు నమోదు అయ్యాయి. ఇప్పటి వరకు ఉన్న ఫీల్డ్ మెజర్‌మెంట్ పుస్తకం(ఎఫ్ఎంబీ)లో ఇకపై ఆ పేరు ఉండదు. దీనికి బదులు ల్యాండ్ పార్సెల్ మ్యాప్ అనే పేరుతో నెంబరు క్రియేట్ అవుతుంది. అలా ఎఫ్ఎంబీ పేరు మారడంతో సమస్యగా మారిందని రైతులు చెప్తున్నారు. పైగా చాలా మంది రైతులకు గతంలో ఉన్న సర్వేయర్లు పొలాన్ని కొలిచి సబ్ డివిజన్ చేయకుండా ఒక సర్వే నెంబరు వేసి దాని ఎదురుగా టి అని పెట్టారు. అంటే ఆ సర్వే నెంబరులో పార్ట్ అని అర్థం. పార్టు అనేది పోయి ప్రత్యేకంగా నెంబరుకు రావాలంటే సబ్ డివిజన్ జరగాలి. కానీ అలా జరగని పొలాల్లో ప్రస్తుత సర్వే నెంబరు ఎదుట టి అనే దానికి బదులు ఏదో ఒక నెంబరు కేటాయిస్తున్నారు. గతంలో ఉన్న పాస్ పుస్తకానికి ఈ పాస్ పుస్తకానికి సర్వే నెంబర్లు మారడంతో బ్యాంకు వారు రుణాలను రెన్యువల్ చేయడానికి నిరాకరిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పాత రికార్డులు ఉన్నాయి. సర్వేకు సంబంధించి ఎప్పటికప్పుడు సర్వే జరిగిన రికార్డులు, రిజిస్టర్ కార్యాలయాలకు ప్రభుత్వం ఇవ్వడం లేదు. సర్వే పూర్తయిన తరువాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ రికార్డుల్లో అప్డేట్ జరుగుతుంది. అయితే ఈ లోపు భూముల కొనుగోలు, అమ్మకాలు జరుపుకునే వారికి సమస్యగా మారింది. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి సర్వే పూర్తయిన వ్యక్తి తన భూమిని వేరే వారికి అమ్మాలనుకుంటే సబ్ రిజిస్ట్రార్ ఆన్ రికార్డుల్లో ఉన్న సర్వే నెంబర్లకు రెవెన్యూ రికార్డుల్లో ఉన్న సర్వే నెంబర్లుకు సంబంధం లేకుండా ఉంది. కొత్త నెంబర్లు సర్వే పూర్తయిన పొలాలకు అలార్ట్ అవుతన్నారు. దీంతో ఆ పొలాల రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. దీంతో చాలా మంది రైతులు సచివాలయానికి వచ్చి జరుగుతున్న ఇబ్బందులను అక్కడి సిబ్బందికి చెప్తున్నారు. ఈ సమస్యలు తాము పరిష్కరించేవి కాదని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పరిష్కరించేందుకు వీలవుతుందని చెప్తున్నారు. రీ సర్వే వల్ల సమస్యలు తీరుతాయని ప్రతి ఒక్క రైతుకు హద్దులు నిర్ణయించి సమస్యలు లేకుండా ప్రభుత్వం చేస్తుందని అందరూ భావించారు. కాని అవేమి జరగడం లేదు. సమస్యలు సమస్యలు గానే ఉంటున్నాయి. వివాదం ఉన్న భూముల సర్వే నెంబర్లు అన్ని కలిపి సుమారు పది మంది రైతుల పేర్లు ఒకే పాస్ పుస్తకంలో నమోదు చేసి ప్రతి రైతుకు ఇస్తుండటంతో వారి మధ్య ఉన్న వివాదాలు అలాగే ఉంటున్నాయి. ముందుగా రెవెన్యూ కోర్టులు, ఆ తరువాత న్యాయ స్థానాల్లో పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. కాని ఒక మండలంలో వేలాది మంది సమస్యలు అలానే ఉంటున్నాయి. సమస్యలు పరిష్కారం ఎప్పటికి జరుగుతుందో విడివిడిగా పాస్ పుస్తకాలు ఎప్పటికి వస్తాయోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

## శ్రీశైల మల్లన్న తలపాగా గ్రామోత్సవం



చీరాల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

ఈనెల 26 వ తేదీ మహాశివరాత్రి పండుగ సందర్భంగా వేటపాలెం మండల పరిధిలోని రామన్నపేటలోని కొత్త నగర్‌కు చెందిన శ్రీ సాదు శ్రీనివాసరావు శివ స్వామి తలపాగా వస్త్రం తయారు చేయడం జరిగింది. 41 రోజులు శివ స్వామి మాల ధరించి నియమా నిష్టలతో 360 మీటర్లు తలపాగా వస్త్రతనం తయారు చేయడం జరిగింది. దానిలో భాగంగా ఈ రోజున గ్రామ సేనాధిపతులు బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం, గ్రామ ప్రజలు సహకారంతో తలపాగా గ్రామ కార్యక్రమం జరిగింది. ముందుగా వారి ఇంటలి వద్ద నుండి ఊరేగింపుగా శ్రీ రామలింగేశ్వర దేవస్థానంకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు అనంతరం గ్రామ ఉత్సవం జరిగింది. ఈ రోజు గ్రామ శివాలయంలో తలపాగా ఉంచి రేపు ఉదయం శ్రీశైలంకు తీసుకొని వెళ్లడం జరుగుతుంది. తదుపరి ఆలయ సంప్రదాయాల ప్రకారం దేవాంగపురికి చెందిన పృధ్వి వెంకటేశ్వర్లు వారి కుటుంబ సభ్యులు శ్రీశైల మల్లన్న ఆలయ శిఖరమునకు అలంకరణ చేయడం జరుగుతంది. ఉత్సవ్ కార్యక్రమం పూర్తయిన తరువాత దాతలు సహాయ సహకారంతో సుమారు 1000 మంది అన్నసంతర్పణ కార్యక్రమం కమిటీ వారు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఊటుకూరి సుబ్రహ్మణ్యస్వామి, చేనేత విభాగం అధ్యక్షులు పిచ్చుక శ్యామ్, బల్ల వెంకటేశ్వరరావు, లింగమూర్తి, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షులు బండ్ల తిరుమలదేవి, రాష్ట్ర అధికార ప్రతినిధి యారాసు అరుణ్,బాబు, బాపట్ల జిల్లా అద్యక్షులు కుర్మా రాహుల్, బండ్ల బాబు, పృధ్వి ఆదిశేసు, పిచ్చుక భార్గవ్, చల్లా విజయ్, భూసం శ్రీనివాసరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు పింజల శ్రీనివాసరావు, బండ్ల సురేంద్రబాబు, మోహన్‌రావు, దంతం శ్రీను, గ్రామ సేనాధిపతులు దేవన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞాన జ్యోతి 5వ రోజు ప్రభుత్వ పథకాలు అవగాహన



నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

మండల కేంద్రమైన నాగులుప్పలపాడు జ్ఞానజ్యోతి 5వ రోజు ట్రైనింగ్ ఫోగ్రామ్ అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించారు. ఈ కార్యక్రమానిక ఎంఈఓ టి.రవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు అమలు నిర్వహణ బాధ్యతలు తదితర కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గత ఐదురోజుల నుంచి చిన్నారులు విద్య విద్యములు వారి పోషణ తల్లిదండ్రులు విద్యార్థులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు బాలింతలు, గర్భిణీలకు క్యాంపులు ప్రోత్సహకాలు తదితర అంశాలపై అవగాహనతో పాటు వారిలో సృజనాత్మక వివరణ అందించారు. సూపర్‌వైజర్ ఉషారాణి ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బయ్య, రిసోర్స్ పర్సన్స్ మాలకొండయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఉప్పుగుండూరులో జరిగిన జ్ఞాన జ్యోతి 5 వరోజు కార్యక్రమానికి సూపర్‌వైజర్ ప్రమీల రిసోర్స్ పర్సన్స్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చీమకుర్తి మున్సిపాలిటీ మిగులు బడ్జెట్ 7.32 కోట్లు

### - ఆమోదించిన కౌన్సిల్



చీమకుర్తి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

చీమకుర్తి మున్సిపాలిటీ మిగులు బడ్జెట్ 7.32 కోట్ల రూపాయలుగా సభ్యులు ఆమోదం తెలిపారు. చీమకుర్తి మున్సిపల్ సమావేశపు హాలులో సోమవారం జరిగిన బడ్జెట్ సమావేశానికి చీమకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. చీమకుర్తి పురపాలక సంఘం 202526 సంవత్సరపు బడ్జెట్ అంచనా యందు రెవెన్యూ ఆదాయము 6,34,87,000 రూపాయలు గాను, మూలధన ఆదాయము 845,00,000 గాను, వెరసి మొత్తం 14,79,87,000గా ఉంది. రెవెన్యూ వ్యయము 5,98,22,000 గాను, మూలధన వ్యయం 8,75,00,000 వెరసి మొత్తం వ్యయం 14,73,22,000 గా ఉన్నది. నికర మిగులు బడ్జెట్ 6,65,000 గా ఉండగా, ప్రారంభ నిల్వలు 7,25,93,702 లతో మిగులు బడ్జెట్ మొత్తం 7,32,58,702 రూపాయలుగా కమిషనర్ వై రామకృష్ణయ్య ప్రతిపాదించగా, సభ్యులు దీనిని ఆమోదిస్తూ తీర్మానించారు. చీమకుర్తి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను సూచిస్తూ మొత్తం 27 అంశాలతో అజెండాను సభ్యుల ముందు ఉంచగా, అందులో 25 అంశాలను ఆమోదిస్తూ సభ్యులు తీర్మానించారు. కౌన్సిలర్లు, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశం సందర్భంగా అందరికీ అధికారులు విందు ఏర్పాటు చేశారు.

# మండలంలో త్రాగునీటి ఇక్కట్లు

### - ఏటా వేసవిలో ప్రజలకు తప్పని తిప్పలు - కలగా మిగిలిన ఇంటింటికి కుళాయి

### - నీటి కోసం ప్రజల ఎదురుచూపులు

పుల్లలచెరువు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

పుల్లలచెరువు మండల పంచాయితీ ప్రజలకు వేసవిలో ఏటా నీటి కష్టాలు తప్పడం లేదు. వేసవి వచ్చిందంటే భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీంతో మంచినీటి బోర్లు కూడా పనిచేయని పరిస్థితి. దీంతో పుల్లల చెరువు మండల పంచాయితీలలో ట్యాంకర్లు నీరే శరణ్యం అవుతుంది. ప్రతి ఇంటిముందు ఆ నీటిని పట్టుకునేందుకు ఒకొక్క ఇంటిముందు నాలుగు, ఐదు డ్రమ్ములు ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి మండలంలో నీటి సమస్యకు అద్దం పడుతుంది. పుల్లలచెరువు మండల కేంద్రములో నీటి ఎద్దడిపై తహశిల్దార్ కార్యాలయంలో ట్యాంకర్లతో నీరందించాలని కోరుతూ ప్రజలు డిప్యూటీ తహశిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని వారన్నారు. బోర్లు వర్షాభావంతో నీరు సక్రమంగా అందడం లేదని దీంతో మండల కేంద్రములో త్రాగునీటికి, వాడుక నీటికి ఇక్కట్లు మొదలయ్యాయని అన్నారు. పెరుగుతున్న వేసవి ఎండలకు నీటి సమస్య మరింత జఠిలంగా మారిందన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని నీరు అందించాలని ప్రజలు వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో బడిపాటి ఆంజనేయులు, కాయాకోకుల వీరాంజి, గోడుగు శ్రీను, కాసులనాటి సాయిశర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కాలనీ అభివృద్ధి గురించి వైసీపీ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదం

టంగుటూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

వైసీపీ నాయకులు ఎస్సీకాలనీల అభివృద్ధి గురించి మాట్లాడుతుంటే చాలా హాస్యాస్పదంగా ఉందని తెలుగుదేశం పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కొమ్ముభానుచందర్ స్పందించారు. టంగుటూరు అరుంధతి నగర్ అభివృద్ధి గురించి గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ పాలనలో లేవని వైసీపీ వారినోళ్లు ఇప్పుడు లేస్తుంటే హాస్యాస్పదం కాక ఏమిటని ఎద్దేవ చేశారు. మీ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఎస్సీ కాలనీలలో ఏమేమి అభివృద్ధి పనులు చేశారో తెలియపరచాలని ఎస్సీ కాలనీలను ఎంత వరకు పట్టించుకున్నారో మచ్చుకు కొన్ని తెలుసుకుందాము. కాలువలు పూడిక తీపించ్చారా, రోడ్లు చిమ్ముటకు మనిషిని పంపాఆ, మీరు అంటున్న తడి చెత్త, పొడి చెత్త తీపించ్చారా వచ్చిన బండ్లను తుప్పు పట్టించ్చారు. అరుంధతి నగర్ ఒక్కటే కాదు ఏ ఒక్క ఎసూఈ్స కాలనీలో అయినా గుంతలు పూడ్చారా, కనీసం ఒక కొత్త రోడ్డు వేశారా, మీరు ఇప్పుడు చూపిస్తున్నరోడ్డుని ఎమ్మన్నా మీ ఐదేళ్ల పాలనలో పట్టించుకున్నారా ఆ గుంతలు లేక కొత్త రోడ్డు మీ ప్రభుత్వంలో మీరు ఎందుకు వేయలేదు. అరుంధతి నగర్‌కి మిగిలిన ఎస్సీ కాలనీలకు పనులు చేయడం మీకు అవసరం లేదనుకున్నారా, ప్రజల ఆరోగ్యం గురించి దోమల నివారణ చర్యలు ఎమ్మన్నా చూశారా. తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అరుంధతి నగర్ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు అని ప్రజా పరిషత్ కింద ఉన్న రోడ్డుని కూడా మానవతా దృక్పధంతో అరుంధతి నగర్ ప్రజలు శ్రేయస్‌స కోరుకునే వారు కనుకనే మీరుచేయలేని పని మా తెలుగుదేశం పార్టీ నాయకులు గుంతలను పూడ్చారు. మీకు చేతనైతే జరగాల్సిన అభివృద్ధి పనుల లిస్టు మాకివండి, మేము చేపిస్తాము, ప్రజల శ్రేయస్సు కోరుకునే ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం ఇదే మి వైసీపీ వారు గట్టిగా గుర్తు పెట్టుకోవాలని నేను మీకు తెలియజేస్తున్నట్లు మండల ఎస్సీసెల్ అధ్యక్షులు బానుచదర్ కొమ్ము తెలియజేశారు.



### ఆప్కాస్ రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు

## అప్పగించే విధానాన్ని రద్దు చేయాలి




**గిద్దలూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెగ్యులర్ చేస్తామని మోసం చేసి ఆప్కాస్ విధానాన్ని తీసుకువచ్చిందని దీని ద్వారా కాంట్రాక్ట్ ఏజెన్సీల బెడద తప్పిందని ప్రతినెల 1 లేదా 2వ తేదీల్లో కార్మికుల అకౌంట్‌లో కట్ కాకుండా జీతం పడుతుందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి నాగయ్య అన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రికి పోస్ట్‌కార్డులు వేసి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి నాగయ్య మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే విధానాన్ని అమలు చేయాలని కేబినెట్ ఆలోచన చేసిందని దీనిని మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌గా వ్యతిరేకిస్తున్నామని, మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఐ చంటయ్య, పి రవి, కె బాలయ్య, పి పాపయ్య, డి.రంగయ్య, చెన్నమ్మ, సుబ్బమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

### డాక్టర్ షేక్ సుమయ ఘనంగా వీడ్కోలు పలికిన వైద్యశాల సిబ్బంది



**గిద్దలూరు, ఫిబ్రవరి 24 ,ప్రభాతవార్త**
గిద్దలూరు మండలంలోని సంజీవ రాయునిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ షేక్ సుమయ మాస్టర్ ఆఫ్ సర్జరీ (ప్రసూతి అండ్ గైనకాలజీ) విభాగంలో ఉన్నత చదువుల నిమిత్తం వెళ్తున్న సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను వైద్యసిబ్బంది కొనియాడారు. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి సమయంలో ఒక మహిళ అయి ఉండి ధైర్యంగా ముందుకు వెళ్ళి తన ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఎంతోమందికి పునర్జన్మ కల్పించిందన్నారు. గిద్దలూరు మారుమూల ప్రాంతంలో పేద ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలు అందించడమే తన లక్ష్యమని ఆమె తెలిపారు. ప్రతి మహిళామూర్తికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. ఆమె చేసిన సేవలు గిద్దలూరు ప్రజలు ఎప్పటికీ మరువలేనివన్నారు. అనంతరం వైద్య సిబ్బంది అందరూ కలిసి డాక్టర్ సుమయకు ప్రత్యేకంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### మహాశివరాత్రికి పటిష్టమైన పోలీస్ బందోబస్తు : సిఐ జి అస్సాన్



**త్రిపురాంతకం, ఫిబ్రవరి 24 ,ప్రభాతవార్త**
ఈనెల 26న త్రిపురాంతకంలో జరుగనున్న మహాశివరాత్రి మహోత్సవాలకు పటిష్టమైన పోలీస్ బందోబస్త్ నియమించనున్నట్లు త్రిపురాంతకం పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి అస్సాన్ తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మహాశివరాత్రి జాగరణకు వచ్చే భక్తులు రాకపోకలు సాగించేందుకు ఎలాంటి సమస్యలు లేకుండా చేసేందుకు బారీ పోలీస్ బందోబస్త్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పోలీస్ బందోబస్త్‌కు ఒక డిఎస్పి, ముగ్గురు సిఐలు, 11మంది ఎస్సైలతోపాటు 150మంది పోలీస్ సిబ్బందిని నియమిస్తున్నట్లు సిఐ అస్సాన్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయం చుట్టూ నాలుగు ద్వారాలు వద్ద బందోబస్తును నియమిస్తూ, సిసి కెమెరాలతోపాటు మూడు డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో సిఐతోపాటు ఎస్సై శివ బసవరాజు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

### కమ్యూనిజానికే వన్నె తెచ్చిన ఆదర్శ కమ్యూనిస్ట్ కామ్రేడ్ గాలి సుబ్బరాయుడు



**త్రిపురాంతకం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**
ఆదర్శ కమ్యూనిస్ట్ కామ్రేడ్ గాలి సుబ్బరాయుడు అని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో కామ్రేడ్ గాలి సుబ్బరాయుడు వర్ధంతి వేడుకలను సిపిఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న డి శ్రీనివాస్ గాలి సుబ్బరాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్ట్ ఉద్యమాల్లో గాలి సుబ్బరాయుడు చురుకుగా పాల్గొనేవారన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం అలుపెరుగని ఉద్యమాలు, పోరాటాలు చేశారన్నారు. ఉపాధ్యాయునిగా, ఉద్యమ కారుణిగా సమస్యలపై నిరంతరం పోరాడిన నాయకుడు గాలి సుబ్బరాయుడని శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకురాలు గాలి లక్ష్మి, రాజ్యం, ఖాశిం, నాగేశ్వరరావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

### మద్దిపాడు గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం ఎప్పుడూ..?



**మద్దిపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
స్థానిక గ్రామ పంచాయతీల నందు సాధారణ సమావేశాన్ని ప్రతి నెల నిర్వహించాల్సి ఉంటుంది. అలా కుదరని పక్షాన పంచాయతీల నందు 90 రోజుల కైనా సాధారణ సభను నిర్వహించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శిపై ఉంటుంది మద్దిపాడు గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం గత నవంబర్ 21వ తేదీన నిర్వహించారు. ఈనెల 20వ తేదీన గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికి కూడా పాలకవర్గ సభ్యులకు పంచాయతీ అధికారులు తెలియపరచలేదు. పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు సంబంధించిన జీతాలను సర్పంచ్ సంబంధించినటువంటి బంధువుల అకౌంట్‌కు నిధులు ట్రాన్స్‌ఫర్ అయినట్లు పాలకవర్గ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పాలకవర్గం సభ్యులు నిలదీస్తారని క్రమంలో గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు సమాచారం. గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశానికి స్థానిక సర్పంచ్ సహకరించకపోతే పంచాయతీ కార్యదర్శి నిర్ణయం తీసుకుని సమావేశం జరిపేందుకు అవకాశం ఉంటుంది. కానీ ఇప్పటి వరకు కూడా సర్వసభ్య సమావేశం ఏర్పాటుకు సంబంధించిన సమాచారం పాలకమండలి సభ్యులకు అందని పరిస్థితి. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం–1994 నందలి సెక్షన్ 31 ప్రకారం ప్రతి పంచాయతీ కార్యదర్శి 90 రోజుల లోపల ఖచ్చితంగా గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించాలి. అలా నిర్వహించక పోతే సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై ఉన్నత స్థాయి అధికారులు క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ చట్టం తెలుపుతుంది. మండల స్థాయి అధికారులు ఏవిధమైన చర్యలు తీసుకుంటారో, వారి విధేయతకు వదిలేయడమే అని మద్దిపాడు గ్రామస్తులు అంటున్నారు.

### అక్రమ ఇసుక దందాపై జనసేన కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు

**మద్దిపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
గత కొంత కాలం నుంచి మండల పరిధిలోని కొలచనకోట గ్రామ పరిధిలో ఏటి పోరంబోకు సర్వే నెంబరు 231 నందు గల ఎస్టీ సామాజిక వర్గం వారి భూములు, 133 కేవీ, 33కేవీ పవర్ లైన్స్, హిందూ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల స్మశాన వాటికలు, ఇతర రైతుల పంట పొలాలు ఉన్న ప్రాంతంలో అక్రమ ఇసుక దందా మీద తత శనివారం నాడు మద్దిపాడు మండల రెవెన్యూ మండల పరిషత్, పోలీసు విద్యుత్ శాఖ అధికారులకు జనసేన పార్టీ నాయకులు వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేసిన విషయం విధితమే. సోమవారం నాడు జనసేన పార్టీ మంగళగిరి కార్యాలయంలో లీగల్ డెస్క్‌లో మద్దిపాడు మండల జనసేన పార్టీ అధ్యక్షులు నున్నా బాల సుబ్రహ్మణ్యం సంబంధిత పార్టీ అధికారులను కలిసి సమస్యను వివరించి, వినతిపత్రాన్ని అందజేశారు.

## అప్కాస్‌ను రద్దు ఉపసంహరించుకోవాలి

### - మున్సిపల్ కార్మికుల నిరసన ర్యాలీ




**మార్కాపురం,ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
ప్రభుత్వం అప్కాస్‌ను రద్దు చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ సీపీఐ ఏఐటీయుసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు సోమవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి అధికారులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయుసీ పట్టణ అధ్యక్షులు షేక్ కాశీం సాహెబ్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేందుకు ఆప్కాస్‌ను రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకుందని అన్నారు. తక్షణమే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో కార్మిక లోకం ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులలో పర్మినెంట్ చేయాలని, మున్సిపల్ శానిటరీ విభాగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కాంట్రాక్టుకార్మికుల కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

### పీహెచ్‌సీని పరిశీలించిన మలేరియా ఆఫీసర్ మధుసూదన్‌రావు



**మద్దిపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
మండల కేంద్రం మద్దిపాడులోని పీహెచ్‌సీని జిల్లా మలేరియా శాఖ అధికారి మధుసూదన్‌రావు సోమవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ల్యాబ్ టెక్నీషియన్‌తో మాట్లాడుతూ నూతన సంవత్సరం నుండి కొత్త ఛార్టులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మలేరియా జ్వరాలకు చేస్తున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ క్రమంలోనే రికార్డులు పరిశీలించారు. పీహెచ్‌సీకి వచ్చే ఓపీలో 15 శాతం రోగులకు మలేరియా పరీక్ష కూడా నిర్వహించాలని ల్యాబ్ టెక్నీషియన్‌కు తెలిపారు. డెంగ్యూ కేసులు ఏమైనా ఉన్నాయా అంటూ విచారించారు. ఈ కార్యక్రమంలో ఆయనవెంట డాక్టర్ వినీలచౌదరి, డాక్టర్ శిరీష,సబ్ యూనిట్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, వెంకారెడ్డి, సీహెచ్‌ఓ రజిత కుమారి, సూపర్‌వైజర్ బాలకోటయ్య, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వీఆర్‌ఏల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



**మద్దిపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
మద్దిపాడు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోనూ వీఆర్‌ఏగా పని చేస్తున్నటు వంటి వారువారి సంఘానికి సంబంధించిన స్థానిక మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం నందు ఎన్నికల కార్యక్రమాన్ని నిర్వహించారు. వీఆర్‌ఏల సంఘం వివిధ పదవులకు పోటీ లేకపోవడంతో అన్ని పదవులు ఏకగ్రీవంగానే ఎన్నుకోబడ్డాయి. మద్దిపాడు మండల వీఆర్‌ఏల సంఘం నూతనకమిటీ అధ్యక్షులుగా ఎద్దు శ్రీరాములు (పెద్దకొత్తపల్లి),ప్రధాన కార్యదర్శిగావై.రాజు(ఇనమనమెల్లూరు), కోశాధికారిగా యు.సావిత్రి (మద్దిపాడు), ఉపాధ్యక్షులుగా కావూరి రాఘవులు(దొడ్డవరప్పాడు), ఉప కార్యదర్శిగా ఎం.చెంచురావు (కీర్తిపాడు), కార్యవర్గ సభ్యులుగాఊనూరి నరసయ్య(దొడ్డవరం), కావూరి కోటయ్య(బురేపల్లి),బూసరపల్లి వెంకట ప్రసన్నబాబు(ఏడుగుండ్లపాడు),బత్తులకోటేశ్వరరావు (మద్దిపాడు), కోటహనుమంతరావు (దొడ్డవరప్పాడు) , కొప్పోలు సుబ్బారావు(గుళ్ళాపల్లి), జి.పూర్ణచంద్రరరావు(ఇనమనమెల్లూరు) ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

### ప్రభుత్వ కార్యాలయాలకు ప్రధాని మోదీ చిత్రపటాల బహుకరణ



**మార్కాపురం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
భారతీయ జనతా పార్టీ మార్కాపురం పట్టణ అధ్యక్షులు పాదర్తి ఆంజనేయులు ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు ప్రధాని నరేంద్రమోడీ చిత్ర పటాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాదర్తి ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలతో పాటు ప్రధాని మోదీ చిత్రపటాన్ని కూడా కార్యాలయంలో ఉంచాలని కోరారు. సబ్ కలెక్టర్ కార్యాలయంతో పాటు తహశీల్దార్ కార్యాలయం, మార్కాపురం రైల్వే స్టేషన్, ఇతరత్ర ప్రభుత్వ కార్యాలయాలకు ప్రధాని మోదీ చిత్రపటాన్ని బహుకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జి.సతీష్,రామకృష్ణ, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, డి.కాశీం, వెంకటేశ్వర్లు, మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## జార్జీ ఫార్మసీ కళాశాలలో సంస్కృతి ఉత్సవ్



**మార్కాపురం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
సామ్యేల్ జార్జి ఫార్మసి కళాశాలలో మార్చి 6వ తేదీ నుండి 9వ తేదీ వరకు ఎస్‌జీపీఎస్ స్పోర్ట్స్ కార్నివాల్ టు కే 25 ఈవెంట్స్, సాంస్కృతి ఉత్సవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి ఆదిమూలపు సతీష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సంబంధిత కార్యక్రమాల గోడ పత్రికలు ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం డివిజన్ స్థాయిలో ఫార్మసీ కళాశాల ప్రొఫెషనల్ కాలేజీలు, డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో హాజరు కానున్నారని, క్రికెట్ వాలీబాల్ కబడ్డీ షటిల్ క్యారమ్స్ వంటి పోటీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. అలాగే 20, 25వ సాంస్కృతి ఉత్సవ్ కార్యక్రమంలో కూడా సింగింగ్ ఆర్ట్ కాంపిటీషన్ డాన్స్ సాంస్కృతిక కార్యక్రమాలు ఇతర రీట్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై.రాజా జయరావు, డాక్టర్ సునీత, డాక్టర్ అశోక్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

## తగలబడ్డ ద్విచక్ర వాహనం



**మార్కాపురం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో గల ఆంజనేయస్వామి గుడి వద్ద సోమవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనం ఉన్న పలంగా అగ్నికి ఆహుతి అయింది. మెకానిక్ షాపు వద్ద నిలిపి ఉన్న ఈ వాహనం ఎండ తాకిడికి మంటలు. చెలరేగినట్లు స్థానికులు అంటున్నారు. ఈ ప్రమాదంలో ఎక్సెల్ మోటార్ బైక్ మంటలలో ఖాళీ పూర్తిగా దగ్ధమైంది. ఎండలు తీవ్ర స్థాయికి చేరక ముందే మార్కాపురంలో ఎండ తీవ్రత అధికంగా ఉంది.

## కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



**తాళ్లూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
గ్రామాల్లోని రైతులు కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన ధర అందుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాస రావు కోరారు. మండలంలోని నాగంబొట్లపాలెం సొసైటీ పరిధిలోని తూర్పు గంగవరం గ్రామంలో సోమవారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన కందులను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7550 రైతులకు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్, నా ఫెడ్ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాల ద్వారా పండించిన ప్రతి రైతు పంటను అమ్ముకోవచ్చన్నారు. నగదు నేరుగా రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, టెక్నికల్ ఏవో శ్రీనివాస్ నాయక్, సొసైటీ సీఈఓ పులి శ్రీనివాసరెడ్డి, వీఏఏ వెంకట సుమ, రైతులు పాల్గొన్నారు.

### ఐసిడిఎస్ రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ చెంచుకుమారికి అంగన్‌వాడీ కార్యకర్తలు నివాళ్లు



**యర్రగొండపాలెం,ఫిబ్రవరి24,ప్రభాతవార్త**
య ర్రగొండపాలెం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేసి రిటైర్డ్ అయిన చెంచు కుమారి సోమవారం తెల్లవారు జామున అనరోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా పిడికిటివానిపల్లె గ్రామంలోని వారి నివాసానికి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి పద్మవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు అమె మృత దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్ వైజర్లు ఎ.పద్మజ,కెవి సుజాత,ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరలు నివాళుర్పించారు.

### పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో హైస్కూల్‌కు కుర్చీలు బహుకరణ



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
సంతనూతలపాడు హైస్కూల్లో పదో తరగతి చదివిన 1986–87 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం నాడు స్థానికహైస్కూల్‌కు 15 కుర్చీలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రమోద, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు సూదనగుంట శ్రీనివాసరావు, రావుల సుబ్బారావు, బొద్దు రామలింగయ్య, మట్టా మురళి, ఇందుర్తి నాగేశ్వరరావు, కారంశెట్టి నరసింహ స్వామి, మేళం సుబ్బారావు, ఎం.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలకు పలు ఆలయాలు సిద్ధం



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
మహాశివరాత్రి ఉత్సవాలకు సంతనూతలపాడు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆలయాల్లో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. పేర్నమిట్ట, సంతనూతలపాడు, చిలకపాడు, తదితర గ్రామాల్లో ఈ ఉత్సవాలు సఘనంగా జరగనున్నాయి. సంతనూతలపాడులోని గంగా పార్వతీ సమేత త్రిపురాంతక స్వామి వారి దేవస్థానంలో వేకువ జామునే స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రపంచామృతాభిషేకములు, ప్రత్యేక పూజలు, అమ్మవారికి పూలంగి సేవ, సహస్రనామ కుంకుమార్చన అనంతరం 9 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఎస్.బుజ్జిబాబుశర్మ తెలిపారు. అలాగే అదే రోజు రాత్రి 12 గంటలకు లింగోద్భవకాలంలో త్రిపురాంతక స్వామి వారికి దాతల సహకారంతో సుగంధ ద్రవ్యాల తోటి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, సహస్రభిషేకాలు జరగనున్నాయి. మహాశివరాత్రిలో భాగంగా బుధవారం ఉదయం వేళ ఉభయ దాతలు మాజీ సర్పంచ్ శిఘాకొల్లి నరసింహస్వామి, సోదరులు శిఘాకొల్లి శివ శంకర్‌రావు, వెంకట సుబ్బారావు, కుటుంబీకులు ఆధ్వర్యంలో ప్రతి ఏడాదిలో భాగంగా ఈ ఏడాది కూడా భారీగా ప్రసాదాలను పంపిణి చేయనున్నారు. ఎండోమెంట్ ఈవో ఎన్.నారాయణరెడ్డి, ఆలయ అర్చకులు ఎస్.బుజ్జి బాబు శర్మ తదితరులు ఈ వేడుకలను పర్యవేక్షిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలను సేకరించాల్సిందిగా వారు కోరారు.

### జనాల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు




**అర్ధవీడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
అర్ధవీడు మండలంలోని మంచి కార్పొరేట్ స్కూల్ లేనందున అర్ధవీడు మండలంలోని ప్రజలు మొత్తం కంభం మండలానికి చెందిన పాఠశాలకు పిల్లలను పంపటానికి మొగ్గు చూపిస్తున్నారు. పాఠశాల విద్యాసంస్థల అధినేతలు అర్ధవీడు మండలానికి చెందిన విద్యార్థులను పాఠవాలకు తరలించడానికి సంస్థ పేరు గల ఒక బస్సును పెట్టి విద్యార్థులను పాఠశాలకు తరలిస్తారు. అర్ధవీడు మండలానికి నాగులవరం రైల్వే గేటు దాటగానే ఒకటే రోడ్డు ఉన్నందున బస్సు డ్రైవర్లు మితిమీరిన వేగంతో అటు ప్రజలకు ఇటు విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అర్ధవీడు మండలానికి వచ్చే స్కూల్ బస్సులపై తనిఖీలు శూన్యమని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ బస్సు ఒక నిర్ణీత వేగంలో వెళ్లకుండా డ్రైవర్లకు ఇష్టం వచ్చినట్లు నడుపుతున్నారు. వారికి అవగాహన కార్యక్రమం చేపట్టడం కూడా శూన్యమని ప్రజలు అధికారులను విమర్శిస్తున్నారు. విద్యా సంస్థల అధినేతలకు మాత్రం వారిచ్చే ఫీజులు మాత్రమే ముఖ్యం కాని పిల్లల భవిష్యత్తు ముఖ్యం కాదు అనే తరహాలో స్కూల్ యజమానులు ప్రవర్తిస్తున్నారు. మరి ముఖ్యంగా అర్ధవీడు మండలం వైపు వెళ్లే పాఠవాల యొక్క బస్సును తనిఖీలు చేసి బస్సు సరైన కండిషన్‌లో ఉందో లేదో తేల్చి విద్యార్థుల ప్రాణాలు కాపాడాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు. ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్లక మునుపే విద్యాసంస్థల యొక్క బస్సుల తీరును ఉన్నతాధికారులు పరీక్షించాల్సిందిగా అర్ధవీడు మండలంలోని పాఠశాలకు వెళ్లే పిల్లల యొక్క తల్లిదండ్రులు అధికారులను కోరుకుంటున్నారు.

### విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
పదో తరగతి విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితే తేలికగా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చిలకపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.స్వప్న రాజు పేర్కొన్నారు. సంతనూతలపాడు మండలం చిలకపాడు హైస్కూల్లో సోమవారం జరిగిన పదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సభ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మొదట సరస్వతి పూజలు నిర్వహించారు. విద్యార్థులు భాగా చదివి ఉన్నత గ్రేడ్లను సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని హెచ్‌ఎం స్వప్న రాజు కోరారు. అనంతరం చిలకాపడ క్లస్టరు స్థాయిలో గల పాఠశాలకు క్లస్టర్ పరిధిలోని వేములపాడు, మట్టిపాడు గ్రామాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఎం.తిరుపతిరెడ్డి, కే.చంద్రమౌళిలు 20 కుర్చీలను స్వచ్ఛందంగా అందించినందుకు వారిని హెచ్‌ఎం స్వప్న రాజు, ఉపాధ్యాయులు సత్కరించారు.

## అసెంబ్లీ అంటే జగన్‌కు భయ మేల



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త**
11 సీట్లు సాధించిన రాష్ట్ర అసెంబ్లీ అంటే మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి భయమెందుకు అంటూ రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబులు ప్రశ్నించారు. ఒంగోలులోని వారి గృహ ఆవరణలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి పక్ష హోదాకు తగిన బల స్థానాలు వైసీపీకి రానప్పుడు ఎలా ఇస్తారని వారు పేర్కొన్నారు. సోమవారం నాడు రాష్ట్ర అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ ఎమ్మెల్యేలు ధన్యవాదాలు తెలపకుండా నినాదాలు చేసి వాక్ అవుట్ చేయడంపై వారు ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. 60 రోజులు పాటు అసెంబ్లీకి రాకపోతే వేటు పడుతుందని భయంతో జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వచ్చారన్నారు. ప్రజా సమస్యలు చర్చించడానికి అసెంబ్లీకి జగన్‌మోహన్‌రెడ్డి రాలేదన్నారు. ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకులు కారని ఒక సాధారణ పులివెందుల ఎమ్మెల్యే అని టీడీపీ నేతలు హరిబాబు, స్వాములు ఈ సందర్భంగా తెలిపారు.

## రైతులంతా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



**యర్రగొండపాలెం,ఫిబ్రవరి24,ప్రభాతవార్త**
య ర్రగొండపాలెం మండంలోని అమని గుడిపాడు, గుర్రపుశాల, గంజివారిపల్లె గ్రామల్లో సోమవారం రైతు సేవ కేంద్రల వద్ద భూధార్ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండంలోని రైతులంతా రైతు సేవ కేంద్రాలలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి కే.వి.శేషారెడ్డి అన్నారు. గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో జరుగుతున్న రైతుల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి యల్.మాల్యాద్రి పరిశీలించారు. రైతులందరూ ప్రత్యేక గుర్తింపు నంబర్ కోసం మీ రైతు సేవా కేంద్రానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ముందుగా పీఎం కిసాన్ లబ్ధిదారులు తప్పకుండా ఈనెల 26వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ గుర్తింపు సంఖ్య ద్వారానే అన్ని పథకాలకు అర్హత ఉంటుందని ఆయన తెలిపారు. రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు, జిరాక్స్ ఆధార్ లింకు అయిన సెల్‌ఫోన్ తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళ్లాలి. రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకొని 11 అంకెల ఐడీ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.రామరావు నాయక్, తెలుగుదేశంపార్టీ నాయకులు చిట్యాల వెంగళ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### స్వర్గీయ చెంచు కుమారికి ఏపీయుడబ్ల్యూజే నివాళి



**యర్రగొండపాలెం,ఫిబ్రవరి24,ప్రభాతవార్త**
య ర్రగొండపాలెం నియోజకవర్గ ఏపీయు డబ్లూజే అధ్యక్షులు కాకర్ల నరసింహమూర్తి సతీమణి స్వర్గీయ చెంచు కుమారి సోమవారం తెల్లవారు జామున ఆనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా పిడికిటివాని పల్లె గ్రామంలోని వారి నివాసానికి చేరుకుని అమె మృత దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఏపీయుడబ్ల్యూజే జిల్లా యూనియన్ సీనియర్ నాయకులు షేక్.నూరుద్దీన్, యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్‌వి.రమణ, యూనియన్ సీనియర్ నాయకులు మూల అల్లూరిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు షేక్.మహబుబ్‌బాష, యూనియన్ జిల్లా కోశాధికారి డి.బాబి, మార్కాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డి.మోహన్‌రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు ఎస్‌కె.మహమూబ్ సుభాని, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఫార్మర్ ఐడిలపై క్యాంపులు ఏర్పాటు



**దొనకొండ,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త**
ఫార్మర్ ఐడిల క్యాంపు పరిశీలించిన జిల్లా వ్యవసాయధికారి. జిల్లా వ్యాప్తంగా మండలాలలో రెండు మూడు సమీప గ్రామాలని కలిపి ఫార్మర్ ఐడిలపై క్యాంపులు ఏర్పాటు చేసినట్టు జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. శ్రీనివాస రావు గారు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేడు అరవెల్లిపాడు రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులతో ఏర్పాటు చేసిన క్యాంపు సమావేశం లో మాట్లాడుతూ సాగు పొలం వున్న ప్రతి రైతుకూ 11 అంకెల విశిష్ట సంఖ్యను గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ పద్ధతి లో ఆధార్ కార్డు కు లింక్ అయిన ఫోన్ నెంబర్ కి మూడు సార్లు ఓటీపీ లు వస్తాయని వాటిని గ్రామ సిబ్బందికి చెప్పటం లో రైతులు సహకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వ ఇవ్వబోయే అన్నదాత సుఖీభవ, రాయితీ విత్తనాలు, సున్నా వడ్డీ పంట రుణాలు మొదలగు వాటికి ఇప్పుడు ఇచ్చే విశిష్ట సంఖ్య తప్పనిసరని తెలిపారు. రైతులు పొలం పాస్ బుక్, ఆధార్ కార్డు, ఆధార్ సంఖ్యకి లింక్ అయిన ఫోన్ నెంబర్ తీస్కొని మీ గ్రామం లోనే వున్న రైతు సేవా కేంద్రానికి వెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకులని సంప్రదించాలని కోరారు. రైతులు రెండు కంటే ఎక్కువ రెవిన్యూ గ్రామాలలోపొలం ఉన్నట్టయితే ఎక్కడో ఒక చోట ఫార్మర్ ఐడి చేయించుకుంటే సరి పోతుందని, రెండు చోట్ల అవసరం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతుల పట్టా సొంత పొలాలకి మాత్రమే సర్వర్ అనుమతిస్తోందని, అసైన్ మెంట్, ఈనామ్, దేవాదాయ పొలాలకి తర్వాత నుండి వస్తదని తెలిపారు. దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీ కే. బాలాజీ నాయక్ గారు మాట్లాడుతూ డివిజన్‌లోని 8 మండలాల్లో రైతులందరు శిశీర సిబ్బందికి సహకరించి ఫార్మర్ ఐడి లు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాధికారి శ్రీనివాస నాయక్ గారు, మండల వ్యసాయ అధికారి ఎన్. లక్షి ్మ నారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు కె. ధన్‌రాజ్, సెర్పెంచ్ బాపనపల్లి శ్రీను , మండల నాయకులు శివ కోటేశ్వరరావు గారు సచివాలయ సిబ్బంది, రెండు గ్రామాల రైతు సోదరులు పాల్గొన్నారు.

# పార్టీ నాయకులును కలిసిన బిసి సెల్ అధ్యక్షులు



**దొనకొండ,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త**
దర్శి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు మోడీ వెంకటేశ్వర్లు గారి ఆధ్వర్యంలో ఎర్రబాలెం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు మరియు బిజెపి మండల పార్టీ నాయకుడు దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కడియాల లలిత్సాగర్ వారిని కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బత్తుల పెద్ద సుబ్బయ్య పూజారి సుబ్బయ్య పోతురాజు వెంకటరామయ్య (బీజేపీ )మరియు నాయకులు బత్తుల గురుమూర్తి జగన్నాథం శీను బత్తుల సుబ్బయ్య బత్తుల బాల గురవయ్య జిడ్డు రంగనాయకులు మచ్చు వెంకటేశ్వర్లు మోడీ సుబ్బారావు సగినాల పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభా మూర్తులకు ఘన నివాళి



**అద్దంకి , ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
చిన్ని శాంతయ్య సేవా సదన్‌లో చీమకుర్తి నాగేశ్వరరావు స్మారక కళావేదికపై ప్రతిభా మూర్తులైన సినీనటుడు రాజబాబు, మధురకవి మల్లవరపు జాన్ సాహిత్య విశేషాలను పలువురు వక్తలు వివరించారు. నటుడు రాజబాబు జీవిత విశేషాలను లక్కరాజు శ్రీనివాసరావు, మల్లవరపు జాన్ సాహిత్య విశేషాలను నిమ్మరాజు నాగేశ్వరరావులు వివరించారు. ఈ సభకు విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగ అధ్యక్షులు షేక్ మస్తాన్ అధ్యక్షత వహించారు. ముందుగా రాజబాబు, మల్లవరపు జాన్ చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిసిహెచ్ కోటయ్య, వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రగతి బ్యాంకు మేనేజర్ ఇట్టా వెంకటేశ్వర్లు, లేవి ప్రసాద్, రఘురామశర్మ, సందిరెడ్డి శ్రీనివాసరావు, ఆర్‌ఎస్‌రావు, ఎస్. కె. మస్తాన్, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఆర్వి రాఘవరావు, చందలూరి నారాయణరావు, ఎస్‌కె. రహీం తదితరులు పాల్గొన్నారు.

# అవయవ దాన అవగాహన సదస్సు



**అద్దంకి , ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
కేర్ అండ్ క్యూర్ హోమియో స్టోర్ ఆవరణలో అవయవ దాన అవగాహన సదస్సు జరిగింది. అద్దంకి పట్టణ ప్రజా సంఘాలు, ప్రకాశం అవయవదాన ప్రోత్సహ ఐక్యవేదిక ఒంగోలు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. రిమ్స్ వైద్యశాల విస్తరణ అధికారి జి. నాగేశ్వరరావు మాట్లాడుతూ మరణించిన తరువాత అవయవాలు శరీరం మట్టిపాలు అయ్యే కంటె మరొకరు జీవించేలా వైద్యరంగంలో వచ్చిన మార్పుల నేపద్యంలో అవయవదానంను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యులు కావూరి రఘుచంద్, మన్నం త్రిమూర్తులు, వెంకట నరసయ్య, పి. రాజ్యలక్ష్మి, బోయపాటి రవి, రాచమల్లు శివాంజనేయులు, పిసిహెచ్ కోటయ్య, కె.. అనిల్ కుమారసూరి తదితరులు పాల్గొన్నారు.

# 108 ఉద్యోగుల డిమాండ్‌లను అమలు చేయాలి



**అద్దంకి , ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం 2024 నవంబరు 24న వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో 108 ఉద్యోగుల యూనియన్ వారితో జరిగిన ఒప్పందాలు మేరకు, డిమాండ్స్‌ను అమలు చేయాలని, కోరారు. ఇప్పటికే ఒప్పందం జరిగి రెండు నెలలు గడుస్తున్నాయని ఆ మినిట్స్ అమలు చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ మురళికి 108 యూనియన్ సిబ్బంది, నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హరిబాబు, కమలాకర్, నాగరాజు, రవి, కోటేశ్వరరావు, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో అద్దంకి వాసి అన్నదాన కార్యక్రమం



**అద్దంకి , ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
అద్దంకి పట్టణానికి చెందిన హైదరాబాద్ జీవితా భీమా కార్యాలయం లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న చేబ్రోలు శివశంకర్ వారి మిత్ర బృందం సంయుక్తంగా శ్రీశైలంలో రెండు రోజులుగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మహ శివరాత్రిని పురస్కరించుకొని శ్రీశైలానికి వస్తున్న భక్తులకు ఎటువంటి ఆసౌకర్యాం కలగకుండా శివశంకర్ కొన్నేళ్ళగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సుమారు 1600 భక్తులకు అన్నదానం నిర్వహించారు.

# త్రాగునీటి చెరువులను పరిశీలించిన ఎంపిడిఒ



**కొరిశపాడు , ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని త్రాగునీటికి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా సోమవారం కొరిశపాడు ఎంపిడిఒ రాజ్యలక్ష్మి రాచపూడి త్రాగునీటి చెరువును పరిశీలించారు. గ్రామంలోని ప్రజలకు వేసవిలో త్రాగునీటి కొరత ఏర్పడకుండా సాగర్ నీటి ద్వారా చెరువులను నింపాలని, సూచించారు. ఎన్‌ఎస్‌పి అధికారులతో సమన్వయం చేసుకొని చెరువులను పూర్తిగా నీటితో నింపాలని సూచించారు. చిన్న చిన్న మరమ్మత్తులు ఎవైనా చెరువులకు వుంటే ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్ నిధులతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తుల చేపట్టాలని సిబ ్బందిని ఆదేశించారు. ఆమె వెంట ఉపాధిహామి ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సాంకేతిక సిబ ్బంది వున్నారు.

# మొక్కజొన్న చేలో అగ్ని ప్రమాదం - 20 వేలు నష్టం



**అద్దంకి , ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
అద్దంకి నాగులపాడు రోడ్డులోని గుడిపాటి చిరంజీవి మొక్కజొన్న చేలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన విద్యుత్ ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో మొక్కజొన్న పంట దగ్ధం కావడంతో 20వేలుదాక ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా. విద్యుత్ ప్రమాదంపై స్థానిక ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ వాహనం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పంట పూర్తిగా దగ్ధం కాకుండా, మంటలను ఆదుపు చేశారు.

# ఆప్కాస్‌ను కొనసాగించాలి - సి.ఐ.టి.యు



**అద్దంకి , ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
మున్సి పాలిటీలో పనిచేసే కార్మికుల విషయంలో ప్రస్తుతం వున్న ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలని, అద్దంకి మున్సి పల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలని పోస్టు కార్డు ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉసురుపాటి సామ్మేలు, జి. పెద్ద మార్క్, కె. మారుతి, యహోషువా, ఈ. ఆదాం, జి. భీష్మ, వెంకటరావు, శ్రీను, లక్ష్మీనారాయణ, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకి బోయలను ఎస్.టి.జాబితాలో చేర్చాలి

## - మంత్రి గొట్టిపాటికి వినతి



**అద్దంకి , ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి 8జిల్లాల వాల్మీకలను ఎస్టి జాబితాలో చేర్చాలని కోరుతూ ఆసంఘ అద ్దంకి నియోజకవర్గ అధ్యక్షులు కుమ్మరిపల్లి అరవింద రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతి పత్రం ద్వారా విజ్ఞప్తిచేశారు. ఆమేరకు అద్దంకి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లక్ష్మీ శ్రీనివాసరావుకు ఆ వినతిపత్రాన్ని అరవింద్ స్థానిక పార్టీ కార్యాలయంలో అందజేశారు.

# విద్యార్ధులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ



**అద్దంకి , ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
స్థానిక భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్ధులకు హైదరాబాద్‌కు చెందిన, అవినాష్, సాయి మాధురిల వివాహ రోజు సందర్బంగా గాంధీబొమ్మసెంటర్‌లోని లక్ష్మీ శిల్క్ బట్టలషాపుకు చెందిన సాయి సునీల్, కాజా రమేష్‌లు సంయుక్తంగా పెన్నులు, నోట్ పుస్తకాలు, స్వీట్ల్, పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా వారికి భోజనాలను కూడ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సత్రం బడి హెచ్‌ఎం ఈ రామారావు, ఇందిరా ప్రియదర్శిని, కొంగల శ్రీనివాసులు, పాలపర్తి యోనా, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రోటరీ 120వ వ్యవస్థాపక దినోత్సవం



**అద్దంకి , ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
స్థానిక రోటరీ కార్యాలయం లో ఇంటర్‌నేషనల్ రోటరీ 120వ వ్యవస్థాపక దినోత్స వం ఘనంగా జరిగింది. ఈ సందర్బంగా ప్రపంచ వ్యాప్తంగా రోటరీ ద్వారా జరుగుతున్న సేవలను వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు, సెక్రటరీ, చప్పిడి వీరయ్య, చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, వీరవల్లి రుద్రయ్య, బివి కృష్ణారెడ్డి, గంగాధర్‌రావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, ఎ. హరిప్రసాద్, పూర్ణచంద్రరరావు, శ్రీలక్ష్మి, శివకుమారి, భవనేశ్వరి, కాకార్ల వెంకటేశ్వర్లు, జ్యోతి చంద్రమౌళి, ఎజిపి రమేష్‌బాబు, దివాకర్ దత్తు, కాజావలి తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ సెంటర్‌కు వీల్ చైర్ బహుకరణ



**అద్దంకి , ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
గాజులపాలెంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు పేషెంట్ల అవసరార్దం కీర్తి శేషులు రోటెరియన్ గోరంట్ల లక్ష్మీనారాయణ జ్ఞాపార్దం ఆయన కుమారుడు వంశీ ఈ వీల్ చైర్‌ను సమకూర్చారు. డాక్టర్ గొట్టిపాటి జయ సింహకు ఈ వీల్ చైర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు, సెక్రటరీ, చప్పిడి వీరయ్య, చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, వీరవల్లి రుద్రయ్య, బివి కృష్ణారెడ్డి, గంగాధర్‌రావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, ఎ. హరిప్రసాద్, పూర్ణచంద్రరరావు, శ్రీలక్ష్మి, శివకుమారి, భవనేశ్వరి, కాకార్ల వెంకటేశ్వర్లు, జ్యోతి చంద్రమౌళి, ఎజిపి రమేష్‌బాబు, దివాకర్ దత్తు, కాజావలి పిహెచ్‌సి సిబ్బంది బాబు తదితరులు పాల్గొన్నారు.

# గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ సైబర్ నేరాలపై విద్యార్ధినీ, విద్యార్ధులకు అవగాహన

## - ఎస్సై వి.మహేష్



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
విద్యార్ధినీ, విద్యార్ధులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదివి బాగుపడాలని పెద్దదోర్నాల ఎస్సై వి. మహేష్ సూచించారు. స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో సోమవారం ఎస్సై వి. మహేష్ ఆధ్వర్యంలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్ సైబర్ నేరాలపై విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ సైబర్ నేరాలకు పాల్పడకుండా క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. చట్టాలు తెలుసుకుని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో చదువుకొని ఉజ్వల భవిష్యత్తును కాపాడుకోవాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల గురించి క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. జులాయిలాగా తిరిగి జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. ఈ అవగాహన విద్యార్ధుల స్వీయ రక్షణకు, సామాజిక బాధ్యతను పెంచుటకు ఉపయోగపడిందని, ఈ అవగాహన కార్యక్రమాలు మరింత మంది విద్యార్ధులకు చేరువ కావాలని పాఠశాల యాజమాన్యం అభిప్రాయపడింది. ఈ కార్యక్రమంలో ఈఎంఆర్‌ఎస్ కళాశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్ధులు పాల్గొన్నారు.

# అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందాలి

## - లోక్‌అదాలత్ సూపరింటెండెంట్ శ్రీమన్నారాయణ



**మార్కాపురం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందాలని, లోక్ అదాలత్ సూపరింటెండెంట్ శ్రీమన్నారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవా సంఘం ఆదేశాల మేరకు మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో మున్సిపాలిటీలోని 16,17వ వార్డులలో గడపగడపకు న్యాయ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా శ్రీమన్నారాయణ ప్రజలకు అవగాహన కల్పిస్తూ చట్టాలపై ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 సంవత్సరాలు కలిగిన మూగ, చెవిటి కుంటి వికలాంగుల వివరాలను ఆయన తెలుసుకుని ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు గురించి వివరించారు. ప్రభుత్వం దివ్యాంగుల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, అర్హులైన ప్రతి ఒక్కరూ వాటిని పొందాలన్నారు. బాల్య వివాహాల గురించి వివరిస్తూ బాల్య వివాహాల చట్టం శిక్షలు కలిగే అనర్ధాలు గురించి వివరించారు. పేద ప్రజలకు న్యాయ సేవా సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవా సహాయకులు భాష, ఆదినారాయణ, కమిటీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సోదరుడు కృష్ణకిశోర్ రెడ్డిని

# కలిసిన నూతన కమీషనర్ ఐ శ్రీనివాసులు



**గిద్దలూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
గిద్దలూరు నగర పంచాయితీ నూతన కమీషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఐ శ్రీనివాసులు సోమవారం ఉదయం గిద్దలూరు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా కృష్ణకిశోర్ రెడ్డిని పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నగర పంచాయితీ అధికారులు, తెలుగుదేశంపార్టీ నాయకులు పాలుగుళ్ళ చిన్న శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి వద్దు - విద్య ముద్దు



**బల్లికురవ, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
పదో తరగతి చదువుతున్న బాలికలు ఆ తరువాత ఉన్నత విద్య వైపు దృష్టి సారించి తమ భావి జీవితానికి బంగారు బాట వేసుకోవాలని తహశీల్దార్ రవి నాయక్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో జరిగిన పదో తరగతి బాలికల అవగాహన కార్యక్రమంలోఆయన మాట్లాడారు. ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెళ్లి వద్దు - చదువే ముద్దు అని 10వ తరగతి పూర్తి చేసిన, విద్యార్థులను ఉద్దేశించి అవగాహన కల్పించడం శుభపరిణామమన్నారు. ఎంపీడీ కుసుమకుమారి మాట్లాడుతూ బాలిక విద్య కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ ఉపకార వేతనాలు అందిస్తూ వారిని అత్యున్నత స్థానంలో నిలిపేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాయన్నారు. సీడీపీఓ సుధా మాట్లాడుతూ పదో తరగతి తర్వాత ఇంటర్ చదవకుండా ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నాయని, బాలిక విద్య పదో తరగతితోనే ఆగిపోకూడని ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రిన్సిపాల్ సుధాకరరావు మాట్లాడుతూ పురుషులతో ధీటుగా మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని ఇందుకు సునీత విలియమ్స్‌ను ఉదాహరణగా తీసుకొని అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. ఇంకా వివిధ శాఖల అధికారులు మాట్లాడారు.

# రైతు విశిష్ట నమోదు సంఖ్య అవగాహన కార్యక్రమం



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
రైతు విశిష్ట నమోదు సంఖ్య అవగాహన కార్యక్రమం సోమవారం పెద్దదోర్నాల, చిన్నగుడిపాడు గ్రామాలలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహశీల్దార్ కే. శాంతి పాల్గొని రైతు విశిష్ట సంఖ్య యొక్క ముఖ్య ఉద్దేశాన్ని రైతులకు తెలియజేశారు. అలాగే ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దగ్గర జవహర్‌లాల్ నాయక్ మాట్లాడుతూ పీఎం కిసాన్ పథకం కింద 19వ విడత కింద 5709 మంది రైతు కుటుంబాలకు 1.14 కోట్ల రూపాయలు ఈ రోజు ప్రధాన మంత్రి రైతులకు నగదును విడుదల చేయడం జరిగింది. కావున రైతులందరూ తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలలో తమ సంఖ్యను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# నారపరెడ్డికి లలిత్ సాగర్ నివాళి



**తాళ్లూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
మండలంలోని దారంవారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మంచాల నారపరెడ్డి(89) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న దర్శి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ భర్త లలిత్ సాగర్ గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. నారపరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారపరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శులు శాగం కొండారెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడగం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ మంచాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు పేరిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సత్యం తదితరులు ఉన్నారు.

# జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం



**జరుగుమల్లి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం ఐదో రోజు సోమవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని కోర్సు డైరక్టర్ మండల ఎంఈఓ బి. నాగేంద్రవదన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈసీసీఈ డే, గ్రాడ్యుయేషన్‌డే, పాఠశాల సంసిద్ధతా మేళా కార్యక్రమాలు లక్ష్యాలు, కృత్యాలు, వాటి ఫలితాలు ఆయా కార్యక్రమాల ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విజయ, భారతి, రిసోర్స్ పర్సన్‌లుగా ఎం. నాగేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, వట్టిగుంట బ్రహ్మయ్య వహరించారు. యోగా టీచర్ ఏ. విజయలక్ష్మీ పాల్గొన్నారు.

# రైతులకు పెట్టుబడి సహాయంగా పిఎం కిసాన్ పథకం

## - ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు



**మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
రైఉతలకు వ్యవసాయంలో పెట్టుబడి సహాయంగా పిఎం కిసాన్ పథకంను దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టారని వ్యవసాయ శాఖాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. మార్కాపురం మండలంలోని రైతులకు పిఎం కిసాన్ 19వ విడతలో 8528మంది రైతులకు రూ. 1. కోట్లు వారి ఖాతాలకు జమ చేయనున్నారని మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 18వ విడతల్లో ఒక్కొక్క విడతకు రూ. 2వేల చొప్పున సంవత్సరానికి రూ. 6వేలు అర్హత కలిగిన ప్రతి రైతు అకౌంట్లలో జమచేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా ప్రధాన మంత్రి ద్వారా ఈ రోజు 19వ విడత బీహార్ రాష్ట్రంలోని బాగల్పూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమం నుండి రైతుల అకౌంట్‌లోకి జమ చేయనున్నట్లు, మండలంలోని ప్రతి రైతుసేవా కేంద్రంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించడం జరిగిదని ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. ప్రతి రైతు రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేపించుకోవాలని తెలిపారు. ఆయన కొండేపల్లి, మాల్యవంతునిపాడు గ్రామాల యందు ఫార్మర్ రిజిస్ట్రేషన్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాల్యవంతునిపాడు, కొండేపల్లి రైతు సేవాకేంద్రంలోని సిబ్బంది నాగవేణి, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

# గుడ్ సమారటిస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



**మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
వేసవిలో రహదారి వెంట వెళ్ళే వారి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు గుడ్ సమారటిస్ సర్వీస్ సొసైటీ ఫౌండర్ ఎనిబెర మోష ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మార్కాపురం పట్టణంలోని కొండేపల్లి వెళ్ళే బ్రిడ్జివద్ద ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి కమిటీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వేసవి దృష్ట్యా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన గుడ్ సమరటిన్ సర్వీస్ సొసైటీ ఫౌండర్ ఎనిబెర మోషను వారు అభినందించారు. ప్రతిరోజు 200లీటర్ల కూలింగ్ మినరల్ వాటర్‌ను అందుబాటులో ఉంచుతామని మోష వెల్లడించారు. అంతేకాకుండా రహదారి వెంట వెళ్ళే చిన్నారులు, వృద్ధులను హాస్పిటల్‌కు వెళ్ళే వారిని దృష్టిలో ఉంచుకొని ముందు రోజుల్లో మజ్జిగ వంటివి ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి ట్రెజరర్ రామస్వామి, వైస్ ప్రెసిడెంట్ గుర్రం ఆర్థర్, కౌనిలర్లు దూదేకుల కరిముల్లా, ఎం ఉత్తమ్ కుమార్, దారువేముల హర్షిత బాబీ, చర్చి సభ్యులు టిఎస్ జయపాల్, కె జాన్ వినయ్ కుమార్, బూదాల పాల్ మనోహర్, పుప్పాల దేవానంద్ రావు, కోలా జాన్ బాబు ప్రసాద్, విజయ్, ఖాజా, నాయబ్ రసూల్, జన్నపోగు విజయ్ కుమార్, జన్నపోగు రాజేంద్ర, తూంపాటి నాగరాజు, ఎనిబెర రాజ్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

# దర్శి గురుకుల ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

**దర్శి,ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**
దర్శిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో రానున్న విద్యా సంవత్సరం కొరకు ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. మాధవరావు సోమవారం తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మార్చి నల 6వ తేదీ గురువారం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఏప్రిల్ 6వ తేదీ ఆదివారం ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 94933358538 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

## అటకెక్కిన పారిశుద్ధ్యం శీర్షికపై స్పందించన అధికారులు



**మద్దిపాడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

**వార్త ప్రభావం**



అటకెక్కిన పారిశుద్ధ్యం శీర్షికన ఫిబ్రవరి 24న వార్తదినపత్రిక నందు ప్రచురితమైన వార్తపై ఈవోపీఆర్డీ దొడ్డవరం పంచాయతీ ఇన్‌ఛార్జీ అధికారి కొండపి రఘుబాబు స్పందించి, వార్త దినపత్రికలో వచ్చిన పలు అంశాలపై వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ కొండపి రఘుబాబు వార్తప్రతినిధితో మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య, మంచినీటి పైపులు మరమ్మత్తులు, ఇతరత్రా పనులు చేపట్టడానికి ఒక్కో సారి ముందుగా కొంత చెల్లింపులు చేయవలసిన పరిస్థితులు ఉంటాయని, కొన్ని గ్రామాల్లో ఎవ్వరు ముందుకు రాకపోవడం వలన పంచాయతీ కార్యదర్శి తన సొంత డబ్బును సదరు కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారని, సదరు డబ్బు తిరిగి పొందడానికి వారు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కొన్ని గ్రామాలలో గ్రామ పాలక మండలి సహకారం చాలా తక్కువగా ఉందని, సమావేశాలకు ఏ మాత్రం హాజరు కారని, హాజరు అయినా ప్రజా సమస్యలను చర్చించరని, ఎక్కువ సేపు సమావేశం నందు ఉండరని, పంచాయతీ కార్యదర్శులతో సహకరించరని అటేవంటి గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన అన్నారు. అటువంటి పరిస్థితుల్లో గ్రామ పంచాయతీలలో పని చేయుచున్న, ఇన్‌ఛార్జీ బాధ్యతలతో ఇతర గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులకు విధి నిర్వహణ కత్తి మీద సాములా ఉందని ఆయన అన్నారు. దొడ్డవరం గ్రామ పంచాయతీ నందు ప్రస్తుతం చెత్త నుండి సంపద తయారీ కేంద్రం చుట్టూ జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయని, చిన్న చిన్న రిపేర్స్ అవసరమని సదరు పనులు పూర్తి అయిన పిదప చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో వాడుకలోకి తీసుకువస్తామని తెలిపారు. అవినీతి ఆరోపణలపై సర్పంచ్ పూనూరి సుబ్బారావు చెక్ పవర్ తీసివేఇస తనకు సదరు అధికారం ఇచ్చిన పిదప గ్రామ పంచాయతీ నందు పని చేయుచున్న తాత్కాలిక సిబ్బంది అందరకు మొత్తం బకాయిలు చెల్లించామని, కొత్తగా ఇన్‌చార్జీ పంచాయతీ కార్యదర్శిగా చేరిన షేక్ నూరుల్లా లాగిన్ 2 రోజుల క్రితమే అప్రూవల్ పొందినట్లు, జనవరి నెల జీతాలు చెల్లింపుకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం దొడ్డవరం గ్రామం పంచాయతీ నందు పారిశుధ్య కార్మికులు వారికి కేటాయించిన ప్రాంతాలలో ప్రతి రోజు విధులు నిర్వర్తిస్తున్నారని, రిజిస్టర్ లో ప్రజల దగ్గర పంచాయతీ కార్యదర్శి సంతకాలు తీసుకుంటున్నారని తెలిపారు. గ్రామ సర్పంచ్ పూనూరు సుబ్బారావు తమ దొడ్డవరం గ్రామ పంచాయతీ నందు లక్షల మేర అవినీతి జరిగిందని, జిల్లా కలెక్టర్కుఉ, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పన్నుల చెల్లింపులు చేయడానికి ప్రజలు ముందుకు రావడం లేదని ,అయినప్పటికి గ్రామ పెద్దల సహకారంతో ఇంటి పన్ను, నీటి పన్ను బకాయిలు మార్చి లోపు ప్రజల నుండి పూర్తిగా వసూళ్ల చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రముఖ దినపత్రిక నందు 1- 2 రోజులలో టెండర్ ప్రకటన జారీ చేసి, టెండర్ ప్రాసెస్ ద్వారా కరెంట్ సామానులు కొనుగోలు చేసి వీధి లైట్ల మరమ్మత్తులు చేపట్టుటకు తక్షణమే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొందరు గ్రామ ప్రజలు తాము చేసిన చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పెట్టిన కేసులలో అరెస్టు తప్పించుకోవడానికి తాము కొన్ని సంవత్సరాలుగా చెల్లించని ఇంటి పన్నులు చెల్లింపులు చేస్తామని, తమకు ఇంటి పన్ను చెల్లింపు రసీదు వెంటనే కావాలని డిమాండ్ చేస్తున్నారని, కొందరు గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఇల్లు కట్టుకొని కరెంటు మీటరు కోసం పన్ను కడతామని హడావుడి చేస్తున్నారని కొందరు అసహజ మరణాలకు మరియు ఎక్కడో మరణించిన వారి డెత్ సర్టిఫికేట్‌లు డిమాండ్ చేస్తున్నారని, వారి అభ్యర్ధన పరిశీలించడానికి కొంత సమయం, తగు విచారణ అవసరమని, అందుకు ఆగ్రహంతో వారు అధికారులపై ఆరోపణలు చేస్తున్నారని అటువంటి ఒత్తిళ్లకు బాధ్యత గల ఏ అధికారి తల వంచరని స్పష్టం చేశారు. దొడ్డవరం గ్రామంలోని ఎస్సీ, బీసీ, కాలనీలలో ఈనెల 27న 3 రకాల చెత్త బుట్టలు ఉచిత పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజా ప్రతినిధులు సదరు కార్యక్రమంలో పాల్గొంటున్నారని, గ్రామ ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన పన్నుల చెల్లింపు ఆవశ్యకతలపై సదరు కార్యక్రమంలో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. దొడ్డవరం గ్రామ పంచాయతీ అభివృద్ధికి, ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాల విషయంలో ఎటువంటి అలసత్వం వహించకుండా తగు ఆదేశాలు పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బందికి వెంటనే జారీ చేసి, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం ఇకపై జరగకుండా చర్యలు చేపడతామని వార్త దినపత్రికలో వచ్చినటువంటి అట్టకెక్కిన పారిశుధ్య శీర్షికలో సమస్యలను త్వరగా పరిష్కరించి గ్రామ అభివీద్దికి కృషి చేస్తామని ఈవోపీఆర్డీ , గ్రామ పంచాయతీ ఇన్‌ఛార్జీ అధికారి కొండపి రఘుబాబు హామీ ఇచ్చారు.

## దర్శి నియోజకవర్గంలో రోడ్లకు మహర్ధశ

**దర్శి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**



టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ కృషి ఫలితం దర్శి నియోజకవర్గంలో ఆర్అండ్‌బి పంచాయతీ రహదారులు అభివృద్ధి త్వరలో చేపట్టనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి సమగ్ర అంచనాలు రూపొందించాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు అందాయి. ఇప్పటికే గ్రామాల్లో 15 కోట్లతో రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణాలు చేపట్టాం. మరో ఐదు కోట్లతో ప్రధాన రహదారుల్లో మరమ్మత్తులు చేపట్టాం. ముఖ్యంగా దర్శి నియోజకవర్గంలోని గ్రామాల లింకు రోడ్లు అదే విధంగా కురిచేడు- దొనకొండ ఆర్అండ్‌బి ప్రధాన రహదారి విస్తరణ పనులను గుర్తించాలని ముఖ్యమంత్రిని కోరిన మీదట అంచనాలు రూపొందించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. కురిచేడు- దొనకొండ రోడ్డు రూ.25 కోట్లతో ప్రాధమిక అంచనాలను ఇప్పటికే పంపామని అయితే డీటెయిల్ అంచనాలు రూపొందించాలని కోరారు. అదే విధంగా పంచాయతీ రాజ్ పరిధిలోని గ్రామీణ రోడ్లైన ప్రధానంగా తాళ్లూరు మండలంలోని శివరాంపురం టూ తూర్పుగంగవరం, తాళ్లూరు టూ గుంటిగంగ, తాళ్లూరు టూ కుంకుపాడు, ముండ్లమూరు మండలంలోని ఈదర- వేముల వయా కొమ్మవరం, కురిచేడు మండలంలో ఎన్నెస్పీ అగ్రహం టూ బోధనంపాడు, దొనకొండ మండలంలో రుద్రసముద్రం టూ పోలేపల్లి, దొనకొండ-రాయవరం ఆర్అండ్‌బి రోడ్డు టూ కట్టకిందపల్లి వయా మల్లంపేట. దర్శి మండలంలో చందలూరు టూ అబ్బాయిపాలెం ఈ ఎనిమిది రహదారులకు దాదాపు రూ.35 కోట్లు అవసరం అవుతాయని తెలియజేశారు. వీటిని కూడా పూర్తి చేసుకునేందుకు నివేదికల రూపొందించాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు అందడం దర్శి అభివృద్దికి ఒక ముందడుగుగా డాక్టర్ లక్ష్మీ అన్నారు. త్వరలో కార్యరూపం దాల్చేందుకు కృషి చేస్తామని ఆమె ప్రకటించారు.

## టీడీపీ నేత మృతికి నివాళులర్పించిన కడియాల లలిత్ సాగర్

**కురిచేడు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**



కురిచేడు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గంధం గురునాధం ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మరణించగా విషయం తెలుసుకున్న టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ కురిచేడులోని వారి నివాసం చేరుకొని పార్ధివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తదుపరి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. నివాళులర్పించిన వారిలో నియోజకవర్గంలోని టీడీపీ సీనియర్ నాయకులు, కురిచేడు మండల టీడీపీ అధ్యక్షులు పిడతల నెమిలయ్య, మాజీ పార్టీ అధ్యక్షులు కాట్రాజు నాగరాజు, టీడీపీ సీనియర్ నాయకులు మస్తాన్ వలి, బద్రి వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.

## ఉచిత ఎంసెట్ కోచింగ్ కరపత్రాలు ఆవిష్కరణ

**యర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**



యర్రగొండపాలెం పట్టణంలో ఉచిత ఎంసెట్ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించాలనే లక్ష్యముతో ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. ఆ సంస్థ ఆధ్వర్యంలో గోడ పత్రిక మరియు కరపత్రాలను పలు శాఖల అధికారులు పాల్గొని విడుదల చేశారు. యర్రగొండపాలెం పట్టణంలోని మండల కార్యలయ ఆవరణంలో జరిగిన కార్యక్రమానికి యర్రగొండపాలెం మండల డిప్యూటీ తహశీల్దార్ నలగాటి మల్లికార్జున నాయుడు ముఖ్య అతిధిగా పాల్గొని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ యర్రగొండపాలెం మండలం పరిధిలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్ధుల భవిష్యత్తు ప్రణాళికలో భాగంగా డాక్టర్లుగా, ఇంజనీర్లుగా రాణించాలంటే ఇలాంటి కోచింగ్ సెంటర్ల అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. సంస్థ చేస్తున్న కార్యక్రమానికి డిపార్ట్‌మెంట్ తరపున సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. స్వచ్ఛంధ సంస్థలు విద్య, వైద్య, ఉపాధి రంగాలలో పేద విద్యార్ధులకు చేయూత అందించడం కోసం పాటుపడడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎండి సలీమ, ఏపిఓ శైలజ, మండల ఏఓ సలీం మరియు సిబ్బంది, ట్రస్ట్ చైర్మన్ ఎస్ విజయ్ కుమార్, టిడిపి నాయకులు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ చైర్మన్

**కనిగిరి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**



కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ సోమవారం పట్టణంలోని ఆరో సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మూమెంట్ రిజిస్టర్లు, హాజరు పట్టికలను పరిశీలించి, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని గమణించారు. విధులకు గైర్హాజరైన ఉద్యోగుల వివరాలను అడిగి తెలుసుకుని, అలసత్వంగా వ్యవహారించిన వారిపై డిజిటల్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. సచివాలయ నిర్వహణలో లోపాలు ఉన్నాయని గుర్తించిన ఆయన, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల నుండి ఎక్కువగా ఏ సమస్యలు వస్తున్నాయో క్షేత్ర స్థాయిలో స్వయంగా తెలుసుకుని, వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సచివాలయంలో ప్రజలకు అందాల్సిన సేవలను మరింత విస్తృతం చేయాలి. సచివాలయానికి వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహారించాలి. అలాగే ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందుబాటులో ఉంచి, వీటిని సమర్థంగా అమలు చేయాలని సచించారు. అంతే గాక విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం ఖాయమని హెచ్చరించారు. ప్రజా సేవకు అంకితభావంతో పని చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.

## అక్రమదారులపై భూకబ్జా కేసు నమోదు చేయాలి

**- ప్రజా సంఘాల ఐక్యవేదిక - ఆర్డీఓకు ప్రజా విజ్ఞప్తుల దినంలో వినతి**

**కనిగిరి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**



కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో ఆక్రమణలపై సమగ్ర సర్వే జరిపి అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని కోరుతూ ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డిని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పీసీ కేశవరావు సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినంలో వినతిపత్రాన్ని అందజేశారు. సర్వే నెంబ 538, 540 లలో పెద్ద చెరువు అలుగు వాగును ఆక్రమించి బేస్ మట్టం నిర్మిస్తున్నారని ఆర్డీఓకు తెలిపారు. షేక్ నల్లగౌస్ సర్వే నెంబరు 493/బిలో య 2.94 సెంట్లలో అలుగు వాగుకు పిల్లర్లు వేసి చెరువు అలుగు వాగు ఆక్రమించారన్నారు. శంఖవరం రెవెన్యూ సర్వే నెంబరు 419 రులో వాగును ఆక్రమించి మున్సిపాలిటీ అనుమతి లేకుండా వెంచర్ వేయడం జరిగిందన్నారు. కనిగిరి పెద్ద చెరువు సాధన రెస్టారెంట్ వారు వాగును ఆక్రమించి ప్లాట్లు పెట్టడం జరిగిందన్నారు. అలుగు వాగు నీరు వెళ్ళుటకు అవకాశం లేక 2 నెలల క్రితం కురిసిన తుఫానుకు కాలనీలోనికి వరద నీరు వచ్చిందన్నారు. సర్వే నెంబరు 488లో య6-78 సెంట్లు గల కుంటను ఆక్రమించి చదును చేసి ప్లాట్లు పెట్టుటకు సిద్ధమవుతున్నారన్నారు. వెన్నెల అపార్టుమెంట్ వెనుక పెద్ద చెరువు పలుగు వాగు ఆక్రమించి వంతెన నిర్మాణాలు చేపడుతున్నారని వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. శంఖవరం రెవెన్యూ సర్వే నెంబరు 191, 912, 193 లలో హైకోర్టులో స్టేటస్ కో ఉన్నప్పటికి భూమిలో విద్యుత్ అధికారులు స్తంభాలు లైను వేయడం జరిగిందని తెలిపారు. కనిగిరి పట్టణంలోని సర్వే నెంబరు 894, 895 లలో ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాలలో మార్కెట్ యార్డులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న బలసాని బెంజిమెన్, బలసాని రూబెన్, బలసాని కోటేశ్వరరావులు ప్రభుత్వ అవసరాలకు వదలి 8 ప్లాట్లను అమ్ముకొని, వాగు పోరంబోకును ఆక్రమించుకున్నారన్నారు. పై సమస్యలను రెవెన్యూ, ఇరిగేషన్ , మున్సిపల్ అధికారులకు తెలియజేసినా ఒకరిపై ఒకరు చెప్పుకొని తప్పుకుంటున్నారు. గత నెలలో జరిగిన రెవెన్యూ సదస్సులో కూడా అర్జీలు ఇవ్వడం జరిగిందన్నారు. సర్వే చేయించి హద్దులు వేసి ఆక్రమణలకు పాల్పడిన వారిపై భూ కబ్జా కేసులు నమోదు చేయాలని కోరారు. ఒకరిపై ఒకరు చెప్పుకొని వంతులు పెట్టుకొని తప్పుకోవాలని చూస్తే కుదరదని మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ సమన్వయంతో పని చేసే ఆక్రమణలను కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అందుకు తగిన చర్యలు తాను చేపట్టడం జరుగుతుందని ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి ప్రజా సంఘాల ఐక్యవేదికగా నాయకులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఎస్‌కే బషీర్, ఆర్.ఏడుకొండలు, నరేంద్ర, చెన్న కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## కూండ్ల వారి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న దారపనేని, నూతంగి

**కనిగిరి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**



ప్రముఖ వ్యాపారవేత్త డైరీ వాల్స్ ఐస్ క్రీమ్స్ అధినేత కూండ్ల రామకృష్ణ, శ్యామల దంపతులు విజయవాడలోని ప్రగతి నగర్‌లో నూతన గృహ ప్రవేశంలోకి శుభారంభం చేశారు. ఈసందర్భంగా కూండ్ల రామకృష్ణ, శ్యామల దంపతులు కుమారుడు కూండ్ల రవీంద్రబాబు, ధనలక్ష్మీ దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని కూండ్ల వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నూతంగి వెంకటనారాయణ, నరసింహారావు, సూర్యనారాయణ, లక్ష్మీ నారాయణ, దారపనేని కృష్ణ, విజయవాడ 42వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు పొనుగుబాటి వెంకట సుబ్బయ్య, మేడసాని వెంకటేశ్వర్లు, కోయ మహేంద్ర, పోకా గోపాల్, పోక వారి బంధుమిత్రులు, కల్లూరి వారి బంధుమిత్రులు, కూండ్లవారి బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 19వ విడత నిధులు విడుదల

**ముండ్లమూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**



మండల వ్యవసాయాధికారి ముండ్లమూరు వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ సమరోహ్ కార్యక్రమం భాగల్‌పూర్, బిహార్ నుండి పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి సంబంధించిన 19వ విడత విధులు విడుదల చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని రైతు సేవా కేంద్రాలలో పీఎం కిసాన్ లబ్దిదారులకు ప్రత్యక్షంగా టీవీలలో చూపించి, ప్రధానమంత్రి ప్రసంగాన్ని వివరించారు. ముండ్లమూరు మండలంకు సంబంధించి 9545 లబ్దిదారులకు 1 కోటి 91 లక్షల రూపాయలు వారి ఖాతాలకు నేరుగా జమ చేయడం జరిగిందని తెలియజేశారు. పీఎం కిసాన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.6వేల రూపాయలు భూ యజమానులకు 3 విడతలుగా సీ 1వ విడత జూన్- జులై మాసాలలో, 2వ విడత అక్టోబర్‌లో, 3వ విడత జనవరి - ఫిబ్రవరి మాసాలలో జమ చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, అభ్యుదయ రైతు సోదరులు పాల్గొన్నారు.

## నూతన తహశీల్దార్‌గా శైలేంద్రకుమార్ బాధ్యతలు స్వీకరణ

**యర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**




యర్రగొండపాలెం మండల నూతన ఇన్చార్జి తహశిల్దార్‌గా పెద్దారవీడు మండల రెగ్యులర్ తహశిల్దార్ శైలేంద్ర కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. యర్రగొండపాలెం తహశిల్దార్ కిలారి బాలకిశోర్ పలు అభియోగాల నేపధ్యంలో సస్పెండ్‌కు గురయ్యారు. ఆయన స్థానంలో డిప్యూటీ తహశిల్దార్‌గా ఉన్న నలగాటి మల్లిఖార్జున నాయుడిని ఇన్చార్జి తహశిల్దార్‌గా కొనసాగుతున్న విషయం విధితమే. అయితే కలెక్టర్ ఆదేశానుసారం పెద్దారవీడు రెగ్యులర్ తహశిల్దార్ అయిన పి శైలేంద్ర కుమార్‌ను యర్రగొండపాలెం మండల ఇన్చార్జి తహశిల్దార్‌గా నియమించడంతో నేడు ఆయన తహశిల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భ:గా ఆయన మాట్లాడుతూ సిబ్బందితో కలిసి భూ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తమను కలవవచ్చునని సూచించారు. ఆయనతోపాటు డిప్యూటీ తహశిల్దార్ నలగాటి మల్లిఖార్జున నాయుడు ఉన్నారు.

# శ్రీశైల మహాక్షేత్రం





**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**







మరెక్కడా లేని విధంగా జ్యోతిర్లింగ స్వరూపుడు మహాశక్తి స్వరూపిణి ఒకే ఆలయ ప్రాంగణంలో వెలసి ఉండడం శ్రీశైల క్షేత్రం యొక్క ప్రత్యేకత. అందుకే శ్రీశైలం జ్యోతిర్లింగ సహిత శక్తి పీఠం క్షేత్రంగా పేరొందింది. ప్రఖ్యాత శైవ కేంద్రంగా వెలుగొందుతున్న శ్రీశైలం శక్తి స్థలంగా కూడా ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. ఒకప్పుడు ఈ క్షేత్రంలో వామాచార సాంప్రదాయాలు ప్రభలంగా ఉండడం. యౌగిక తాంత్రిక చిహ్నాలు, కుండలిని శిల్పాలు, చతుషష్టి యోగినీమూర్తులు చోటు చేసుకోవడం ఈ క్షేత్రపు శాక్తేయ ఛాయలను స్పష్టం చేస్తున్నాయి. భ్రమరాంబ దేవి వారు18 శక్తి క్రీటాలలో ఒకరు. శక్తి పీఠాల ఆవిర్భావానికి సంబందించిన విషయంలో శ్రీశైలం సతి దేవి యొక్క మెడ భాగం పడిందని చెప్పబడింది. దక్షుడు చేస్తున్న యజ్ఞంలో అవమానింపబడిన సఖి దేవి యోగాగ్నిలో దుమికి ఆత్మహుతిని పొందింది. దాంతో పరమశివుడు తన దేవేరి సతీదేవి కళేబరాన్ని(సూక్ష్మ దేహాన్ని) భుజంపై వేసుకొని విజయ తాండవం చేయసాగాడు. శివుని ఆవేశాన్ని తగ్గించి ఆయనను ఆ నిరువేదము నుంచి దూరం చేసేందుకు శ్రీ మహావిష్ణువు తన సుదర్శన చక్రంతో సతీదేవి శరీర భాగాలను ఖండించారు. అలా సతీదేవి శరీర భాగాలు పలు చోట్ల పడటంతో ఆ ప్రదేశాలన్నీ శక్తి పీఠాలుగా వెలిశాయి. ఆ విధంగా సతీదేవి మెడ భాగం పడిన ప్రదేశమే శ్రీశైలం. కాగా ఆదిపరాశక్తి భ్రమరాంబ రూపంలో ఈ క్షేత్రాన వెలిసింది. ఒకప్పుడు అరుణాసురుడుని రాక్షసుల్ని సంహరించేందుకు ఆదిపరాశక్తి భ్రమర రూపాన్ని (తుమ్మెద రూపాన్ని) ధరించింది. ఆ రాక్షసుని సంహారానంతరం అమ్మవారు ఈ క్షేత్రంలో భ్రామరి శక్తిగా కొలువుదీరిందని పలు పురాణాలు చెబుతున్నాయి. జ్యోతిర్లింగ స్వరూపుడైన శ్రీ మల్లిఖార్జునుడు మంగళకరుడు. అమృతం కసం దేవతలు రాక్షసులు పాలసముద్రాన్ని చిలికినప్పుడు హాలహలం పుట్టింది. ఈ హాల హాలంలోకాలన్నిటిని భస్మం చేసే గుణం ఉంది. దీంతో దేవతలు అందరూ ప్రార్ధించగా శివుడు ఆ విషాన్ని మింగి లోక రక్షకుడైనా మానవ జీవితం సుఖదు:ఖాల సంగమము. సుఖ దు:ఖాలనే ద్వందాల మధ్యనే మన జీవన యానం సాగుతూ ఉంటుంది. అయితే ఆధ్యాత్మిక జీవితం కలిగిన దైవ సంబంధమైన బాటలో కూడా తరించాల్సిన అవసరం ఉంది. భూలోక కైలాసంగా ఉన్న శ్రీశైల దర్శనం సకల పాప హరణం. ఇంతటి ప్రాధాన్యత కలిగిన శ్రీశైలంలో ఎన్నో మహిమానిత్వ దర్శనీయ స్థలాలు ఉన్నాయి చైసి తరిద్దాం. శిఖరేశ్వరం ఎనిమిది కిలోమీటర్లు, హఠకేశ్వరం నాలుగు కిలోమీటర్లు, పాలధార- పంచదారలు నాలుగు కిలోమీటర్ల, కైలాస ధ్వారం 7 కిలోమీటర్లు భీముని కొలను ఎనిమిది కిలోమీటర్లు, శ్రీ సాక్షి గణపతి మూడు కిలోమీటర్లు, శ్రీశైలం డ్యాం 15 కిలోమీటర్లు, ఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయం 21 కిలోమీటర్లు, పాతాళేశ్వర స్వామి ఆలయం 1 కిలోమీటర్, శ్రీ అంకాలమ్మ ఆలయం 1/2 కిలోమీటర్, శ్రీ ఆరామ వీరభద్ర స్వామి ఆలయం ముందు భాగంలోని కళ్యాణ కట్ట వదన శ్రీ బయలు వీరభద్ర స్వామి 1/2 కిలోమీటర్, శ్రీ ప్రసన్నాంజేయస్వామి ఆలయం 1 కిలోమీటర్, పంచ మఠములు- శ్రీ భ్రమరాంబ ఆలయానికి పడమట వైపు 2 కి.మీ, మల్లమ్మ కన్నీరు 1 కి.మీ శివాజీ మెమోరియల్ కాంప్లెక్స్ 1/2 కి.మీ, శ్రీ సిద్ది రామప్ప కొలను 1/2 కి.మీ పాతాళగంగ 2 కి.మీ, అక్క మహాదేవి గుహాలు 12 కి.మీ, కదళీ వనం 17 కి.మీ, భైరవసేల 13 కి.మీ ఉంటుంది.

## మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

**ముండ్లమూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**



ముండ్లమూరు మోడల్ స్కూల్ నందు 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో విద్యార్ధులను చేర్చుకొనుటకు ఈనెల 24వ తేదీ నుండి వచ్చే నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ. ఏపీఎంఎస్. ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కే.పూర్ణచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయగోరు విద్యార్ధులు ఓసీ, బీసీ విద్యార్ధులు 01-09-2013 నుండి 31-08-2015 మధ్య ఎస్సీ, ఎస్టీ విద్యార్ధులు 01-09-2011 నుండి 31-08-2015 మధ్య జన్మించిన వారై ఉండి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదో తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలి. ప్రవేశం కొరకు దరఖాస్తు చేసిన విద్యార్ధులకు 5వ తరగతి స్థాయిలో 20-04-2025 ఆదివారం ఉదయం 10గంటల నుండి 12 గంటలకు ప్రవేశపరీక్షల ఆదర్శ పాఠశాల ముండ్లమూరు నందు నిర్వహించబడును. ముండ్లమూరు మండలంలోని విద్యార్ధినీ, విద్యార్ధులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కే.పూర్ణచంద్రరావు తెలియజేశారు.

## చిన్నారుల భద్రత అభివృద్ధే లక్ష్యంగా అంగన్ వాడీలు పనిచేయాలి

**- ఎంపిడిఓ వెంకటరామిరెడ్డి**

**రాచర్ల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**



చిన్నారుల భద్రత అభివృద్ధే లక్ష్యంగా అంగన్ వాడీ కార్యకర్తలు పనిచేయాలని మండల ఎంపిడిఓ సూరె వెంకటరామిరెడ్డి అన్నారు. రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి 120రోజుల కార్యక్రమంలో భాంగంగా 5వ రోజు సోమవారం జరిగిన శిక్షణ కార్యక్రమలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జాతీయ విద్యా విధానంలో నూతన ఒరవడి సృష్టించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందని అందులో భాగంగా పిల్లలకు చిన్నతనం నుండే విద్య అభివృద్ధి, క్రమశిక్షణ, అభ్యసనం వాటిపై ఆసక్తి పెంచేందుకు అంగన్ వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి తద్వారా పిల్లల్లో పెను మార్పులు తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. వారి విద్యాభివృద్దిలో అంగన్ వాడీలతోపాటు పిల్లల తల్లిదండ్రులను కూడా భాగస్వాములను చేసి వారి భద్రత అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగుతోందని ప్రస్తుతం మంగళవారంతో ఈ శిక్షణ కార్యక్రమాలు పూర్తి అవుతాయని శిక్షణలో తెలుసుకున్న అంశాలను పరిగణలోనికి తీసుకొని వాటి ద్వారా చిన్నారులకు విద్యాభ్యాసం చేయాలన్నారు. వారి ఎదుగుదలకు మంచి ఆరోగ్యం కొరకు చేపట్టవలసిన చర్యలను కూడా ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి వి గిరిధర్ శర్మ మాట్లాడుతూ శిఒణ కార్యక్రమాలు చాలా బాగా జరిగాయని మంగళవారంతో పూర్తవుతున్నందున శిక్షణలో నేర్చుకున్న విషయాలను పరిగణలోనికి తీసుకొని వాటి అమలే ధ్యేయంగా పనిచేయాలని అంగన్ వాడీలకు సూచించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి మాట్లాడుతూ అంగన్ వాడీలందరూ బాధ్యతగా విధులు నిర్వహించి చిన్నారుల అభివృద్ధికి పాటుపడాలని వారి ఎదుగుదలకు శ్రీకారం చుట్టాలని మంచి విద్యా విధానంలో వారిని ముందుకు నడిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బిఎల్‌రామానాయక్,డిఆర్‌పిలు అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 27న జాబ్ మేళా

**కనిగిరి, ఫిబ్రవరి 24 ,ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ది సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన గవర్నమెంట్ డిగ్రీ కళాశాల కనిగిరి నందు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ది అధికారి జే.రవితేజ యాదవ్ తెలియజేశారు. ఈ జాబ్ మేళా కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్, సింధుజ మైక్రో క్రెడిట్ లిమిటెడ్, పేటీఎం తదితర కంపెనీలు పాల్గొనుచున్నాయి. కావున కనిగిరి నియోజకవర్గం, ప్రకాశం జిల్లాలోని 19 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల మధ్య గల ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు ఆర్.బెనర్జీ బాబు(స్కిల్ హబ్ కోఆర్డినేటర్) 8008822821 నెంబరును సంప్రదించాలన్నారు.

## భక్తిశ్రద్ధలతో రుద్ర యాగం ఘనంగా ప్రారంభమైన మహాశివరాత్రి వేడుకలు









**ఒంగోలు కల్చరల్ ,ఫిబ్రవరి 24 ,(ప్రభాతవార్త)**

ఒంగోలు సంతపేట షిరిడి సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారికి మాఘమాసం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రముఖ వేద పురోహితులు మఠంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వాములు మరియు (శివాలయం) ధర్మకర్త ప్రకాశం జిల్లా స్వాతి గ్రూప్ అధినేత కవర్తపు బాలకృష్ణ సుజాత దంపతులు కాశీ విశ్వేశ్వర స్వామికి పంచామృత అభిషేకం నిర్వహించి బిల్వదళాలతో శివుని అష్టోత్తర శతనామావళి పూజ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు.అనంతరం రుద్రహోమం,చండీహోమం కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో హోమ క్రతువులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కాశీ విశ్వేశ్వర స్వామి అభిషేకాన్ని హోమాలు తిలకించి వేద పురోహితుల ఆశీస్సులను తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

25-2Pg5.qxd:25-2Pg5.qxd 01/01/01 6:56 AM Page 1



# 2వేల మంది యుఎస్‌ఎయిడ్ ఉద్యోగులపై వేటు

## బలవంతపు సెలవులు పెట్టించిన ట్రంప్ సర్కార్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 24:** అంతర్జాతీయ అభివృద్ధి కార్యక్రమాలకు, మానవతా దృష్టితో సహాయానికి యుఎస్ ఎయిడ్ సంస్థ ద్వారా అందుతున్న నిధులను అమెరికా ప్రభుత్వం ఆపివేసిన విషయం తెలిసిందే. తాజాగా రెండు వేల మంది యుఎస్ ఎయిడ్ ఉద్యోగులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేటు వేశారు. మిగిలిన వారిలో కొంతమందిని మినహాయించి వేలమంది ఉద్యోగులకు బలవంతపు సెలవులు ఇచ్చినట్లు యుఎస్ ఎజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ వెబ్‌సైట్‌లోని నోటీసు ద్వారా తెలుస్తోంది. ఉద్యోగుల తొలగింపునకు ఫెడరల్ జడ్జి అనుమతించిన తర్వాతే ట్రంప్ యంత్రాంగం ఈ విషయంలో ముందుకెళ్లారు. ప్రభుత్వ ప్రణాళికను నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరిన ఉద్యోగుల విజ్ఞప్తిని యుఎస్ డిస్ట్రిక్ జడ్జి కార్ల్ నికోలస్ తిరస్కరించారు. ప్రభుత్వం చేసే అనవసరపు ఖర్చులను తగ్గించడానికి పనిచేస్తున్న మస్క్ నేతృత్వంలోని డోజ్ ఇప్పటికే అనేకమంది యుఎస్ ఎయిడ్ ఉద్యోగులపై వేటు వేసిన విషయం తెలిసిందే. తాజాగా తీసుకొన్న ఈ నిర్ణయం మిగిలిన ఉద్యోగుల్లో భయాందోళన కలిగిస్తోంది. అయితే యుఎస్ ఎయిడ్ ద్వారా వృథా ఖర్చులు ఎక్కువవుతున్నాయని, అది నేరగాళ్ల సంస్థ అని మస్క్ ఇప్పటికే ఆరోపించిన విషయం తెలిసిందే. అందుకే నిధులను ఆపేస్తున్నట్లు ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా దాదాపు 600



మంది ఉద్యోగులను కార్యాలయ భవనంలోకి వెళ్లనీయకుండా నిలిపివేశారు. ఈ ఆదేశాలపై ఫెడరల్ జడ్జి అమీర్ అలీ గతవారం తాత్కాలికంగా స్టే ఇచ్చారు. అమెరికా కాంగ్రెస్ సభ్యులు యుఎస్‌ఎయిడ్ ద్వారా సాయం అందించడానికి ఆమోదం తెలిపినప్పుడు ప్రభుత్వం దాన్ని ఎలా నిలిపేయగలదని జడ్జి నిలదీశారు. అయినా ట్రంప్ తన చర్యలను సమర్థించుకుం టున్నారు. యుఎస్ ఎయిడ్ ద్వారా భారత్‌లో జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడానికి అమెరికా ప్రభుత్వం రూ. 182 కోట్లు ఇచ్చిందని ట్రంప్ పలు మార్లు ఆరోపించారు. ఇకపై అటువంటి నిధులను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచంలో అధిక సుంకాలు విధించే దేశాల్లో ఒకటైన భారత్ వద్ద చాలా డబ్బు ఉందని, ఆ దేశానికి తామెందుకు నిధులు ఇవ్వాలని ప్రశ్నించారు. దీంతో ఈ విషయంపై ఇరుదేశాల మధ్య భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.



# న్యూజిలాండ్ సమీపంలో చైనా యుద్ధ విన్యాసాలు

**వెల్లింగ్టన్, ఫిబ్రవరి 24:** చైనా చుట్టుపక్కల దేశాలనే కాదు.. సుదూరంగా ఉన్న వాటిని కూడా వేధిస్తోంది. తాజాగా సోమవారం న్యూజిలాండ్ తీరానికి అత్యంత సమీపంలో డ్రాగన్ యుద్ధ నౌకలు లైవ్ ఫైర్ డ్రిల్స్ మొదలుపెట్టాయి. దీనిపై ఆ చిరుదేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచాన్ని శాసించే స్థాయిలో నౌకాదళం (బ్లూవాటర్ నేవీ) సిద్ధం చేయాలనే బీజింగ్ ప్లాన్‌లో భాగంగానే వీటిని నిర్వహిస్తున్నట్లు నిపుణులు అనుమానిస్తున్నారు.

ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ మధ్యలో టాస్మాన్ సముద్రంలో రెండు లైవ్ ఫైర్ డ్రిల్స్‌ను చైనా నేవీ నిర్వహించింది. శుక్ర, శనివారాల్లో ఇవి జరిగాయి. ఈ నేపథ్యంలో ఇరు దేశాలకు చెందిన ప్రయాణికుల విమానాలకు ఎటువంటి హెచ్చరికలు లేకపోవడంతో.. హఠాత్తుగా తమ మార్గాలను మధ్యలోనే మళ్లించుకోవాల్సి వచ్చింది. దీనిపై న్యూజిలాండ్ రక్షణ మంత్రి జూడిత్ కొల్లిన్స్ స్పందిస్తూ.. ఈ విన్యాసాలు అసాధారణమని పేర్కొన్నారు. ఆ నౌకల వద్ద అత్యాధునిక ఆయుధాలున్నాయని వెల్లడించారు. ఒక నౌకలో 112 లాంచ్ సెల్స్, యాంటీషిప్ బాలిస్టిక్ క్షిపణులు ఉన్నట్లు పేర్కొన్నారు. వీటి రేంజి సుమారు 540 నాటికల్ మైళ్లు ఉండొచ్చని వెల్లడించారు.

ఈ విన్యాసాలపై చైనా ప్రభుత్వ మీడియా స్పందిస్తూ 8=ృపశ్చిమ దేశాలు కూడా వాటి సముద్ర జలాల్లో ఇలాంటి విన్యాసాలకు అలవాటు పడాలని సలహా ఇచ్చింది. చైనా మిలటరీ వ్యవహారాల నిపుణుడు షాంగ్‌జోంగ్ పింగ్ గ్లోబల్ టైమ్స్‌తో మాట్లాడుతూ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నేవీ భవిష్యత్తులో చైనా తీరాల్లోనే కాకుండా అంతర్జాతీయ జలాల్లో కూడా ఇటువంటి విన్యాసాలు నిర్వహిస్తుందని వెల్లడించింది. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ స్పందిస్తూ చైనా యుద్ధవిన్యాసాలు అంతర్జాతీయ చట్టాలను పాటించినా తమకు ముందస్తు ఇచ్చి ఉండాల్సిందన్నారు. ఆ దేశ విదేశాంగ మంత్రి పోనీవాంగ్ స్పందిస్తూ ఈ పరిణామాలపై చైనాను వివరణ కోరనున్నట్లు వెల్లడించారు. కానీ, బీజింగ్ మాత్రం వీటికి కొట్టిపారేసింది. ఆ దేశ విదేశాంగశాఖ స్పందిస్తూ.. ఆస్ట్రేలియా అకారణంగా ఆరోపణలు చేస్తోందని పేర్కొంది. చైనా ముందస్తు నోటీసులు ఇచ్చినట్లు వెల్లడించింది.

# అమెరికా ఇచ్చింది 100 బిలియన్ డాలర్లే..

## 500 బిలియన్ డాలర్లు కాదు: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

**కీవ్, ఫిబ్రవరి 24:** రష్యాపై యుద్ధం చేసేందుకు తమకు అమెరికా అందించిన సాయం 100 బిలియన్ డాలర్లే అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. ఇటీవల ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఈ యుద్ధంలో ఆయుధాల కోసం ఇప్పటివరకు 320 బిలియన్ డాలర్లు ఖర్చు కాగా.. ఇందులో 120 బిలియన్ డాలర్లను ప్రజల నుంచి సేకరించామని.. మరో 200 బిలియన్ డాలర్లను ఐరోపా సమాఖ్య, అమెరికా అందించాయని జెలెన్‌స్కీ కీవ్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. 'మొత్తంగా అమెరికా నుంచి 67 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలు.. 31.5 బిలియన్ డాలర్ల బడ్జెట్ సపోర్టు మాత్రమే అందాయి. ఎవరైనా సరే దానిని 500 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టి అంతమొత్తం ఖనిజ సంపద ఇవ్వమని అడగకూడదు' అని పేర్కొన్నారని క్వీవ్ ఇండిపెంటెంట్ పత్రిక పేర్కొంది.

ఉక్రెయిన్‌కు యుద్ధంలో మద్దతు కొనసాగాలంటే బదులుగా 500 బిలియన్ డాలర్ల విలువైన ఖనిజాలను తమకు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ ఒప్పందానికి క్వీవ్ కూడా సానుకూలంగా ఉందని ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. చాలా సందర్భాల్లో అమెరికా అధ్యక్షుడు క్వీవ్‌కు అందించిన సాయాన్ని రకరకాలుగా చెప్పారు. ఓ సందర్భంగా ఏకంగా 350 బిలియన్ డాలర్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఈ నెల 24వ తేదీతో ఉక్రెయిన్ యుద్ధానికి మూడేళ్లు పూర్తయ్యాయి. మరోవైపు దీనికి ఒకరోజు ముందు రష్యా ఏకంగా 267 డ్రోన్లతో క్వీవ్‌పూ దాడులు నిర్వహించింది. ఈ స్థాయిలో వీటిని వాడటం ఇదే తొలిసారి. 2022 ఫిబ్రవరి 24న 'ప్రత్యేక మిలిటరీ ఆపరేషన్' పేరుతో రష్యా యుద్ధాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. నాటో విస్తరణను నిలువరించే ప్రయత్నం, డాన్‌బాస్ విమోచనం, నాజీయిజం నిర్మూలన వంటివి తమ లక్ష్యాలుగా పుతిన్



ప్రకటించారు. మొదట్లో మాస్కో సేనలు దూకుడు కనబర్చినా.. తర్వాత పాశ్చాత్య దేశాల ఆయుధ సాయంతో క్వీవ్ సైతం దీటుగా స్పందించింది. మూడేళ్లలో ఇరువైపులా లక్షలాది మంది సైనికులు మరణించారు, గాయపడ్డారు. కోట్ల డాలర్ల మేర ఆస్తినష్టం వాటిల్లింది.

# ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంకోసం రెండో పెళ్లి..

## అసలు విషయం బయటపెట్టిన అత్తింటివారు అవాక్కైన అధికారులు



**లక్నో, ఫిబ్రవరి 24:** ప్రభుత్వ ఆధ్వర్యంలో సామూహిక జరుగుతుండగా దాదాపు 300 మంది వధూవరులు తమ కుటుంబసభ్యులతో కలిసి పెళ్లి పీటలపై కూర్చున్నారు. అంతలోనే కొందరు వ్యక్తులు ఒక్కసారిగా పెళ్లి మండపానికి వచ్చి ఆపండి అంటూ సినిమా స్టైల్లో అన్నారు. వివాహానికి సిద్ధమైన వధువుల్లో ఒకరు అస్మా అనే మహిళకు అప్పటికే పెళ్లి అయిందని తాము ఆమె అత్తింటా వాళ్లమని తెలపడంతో అక్కడ ఉన్నవారంతా ఆశ్చర్యపోయారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంతో గేదెలు కొనుగోలు చేయడానికి ఈ వివాహ నాటకం ఆడుతుందని తెలుసుకుని అధికారులు ఖంగుతిన్నారు. ఆమె అత్తింటివారు తెలిపిన వివరాల ప్రకారం మూడేళ్ల క్రితం అస్మాకు నూర్ మహమ్మద్ అనే వ్యక్తితో వివాహం అయింది. వారి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇరువురి మధ్య విభేదాలు ఎక్కువవడంతో అస్మా ఆరునెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం సామూహిక వివాహాలు నిర్వహిస్తోందని అందులో పెళ్లి చేసుకున్న జంటలకు యోగి ప్రభుత్వం రూ.35 వేలు ఆర్థికసాయం, ఇతర బహుమతులు అందచేస్తున్నట్లు తెలుసుకొంది. దీంతో వెంటనే ఆమెకు ఆలోచన వచ్చింది. ప్రభుత్వం చేస్తున్న వివాహాల్లో తన బంధువు జబేర్ అహ్మద్‌ను రెండో పెళ్లి చేసుకుని వచ్చే నగదును చెరి సగం పంచుకోవాలని ప్రణాళిక వేసింది. ఆ డబ్బుతో చెరో గేదెను కొనుక్కోవాలని వారు నిర్ణయించుకున్నారు. అనుకున్న ప్రకారం సామూహిక వివాహ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. చివరి నిమిషంలో విషయం తెలుసుకున్న అస్మా అత్తింటివారు పెళ్లి వేదిక వద్దకు చేరుకుని ఆ వివాహాన్ని ఆపివేయిం చారు. సామూహిక వివాహ నిబం ధనలను ఉల్లంఘించినందుకు, అనధికారికంగా లబ్ధి పొందేందుకు దరఖాస్తు చేసుకున్నందుకు, ప్రభుత్వ పనులను అడ్డుకున్నందుకు పోలీసులు వధూవరులు ఇద్దరి పైనా కేసు నమోదు చేశారు.

# మహా రాజకీయాల్లో కొత్త పరిణామాలు: తరచూ భేటీ అవుతున్న థాకరే ద్వయం



**ముంబయి, ఫిబ్రవరి 24:** అవిభాజ్య శివసేనలో కొనసాగి ఆధిపత్యపోరులో ఉద్ధవ్‌థాకరేకు సేన అధిపతి బాధ్యతలు రావడం తీవ్రంగా విభేదించి వేరుకుంపటి పెట్టుకున్న ఎంఎన్ఎస్ అదినేత రాజ్‌థాకరే, సేన అధినేత ఉద్ధవ్ థాకరేలు తరచూ భేటీకావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. థాకరేకు వరుసకు సోదరుడు అయిన రాజ్‌థాకరే ఇటీవల ఒక వివాహ వేడుకలో రాజ్‌థాకరేను కలిసారు. ఉద్ధవ్‌తోపాటు ఆయన సతీమణి రష్మిథాకరే కూడా రాజ్‌థాకరేను అభిమానంతో పలకరించారు. రాజకీయంగా వేరుపడిన ఈ సోదరులు మళ్లీ కలుస్తుండటం మళ్లీ ఒకటిగా విలీనం అవుతారా అన్న సందేహాలను రాజేస్తున్నారు. అంధేరిలో మహారాష్ట్రకు చెందిన ఒక సీనియర్ అధికారి ఇంట్లో జరిగిన వివాహవేడుకల్లో రాజ్ థాకరే, ఉద్ధవ్‌థాకరేలు కలుసుకున్నారు. ఇటీవలి కాలంలో అటు ఎంవిఎలోను, ఇటు మహాయుతిలోను చెలరేగుతున్న అంతర్గత కుమ్ములాటల నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఎంఎన్ఎస్, సేన యుబిటి రెండూ పరస్పరం కూర్చుని తమ మధ్య ఉన్న రాజకీయ వైరుద్యాలను పరిష్కరించుకోవాలనుకుంటున్నట్లు ప్రచారం తెరపైకి వచ్చింది. ఎందుకంటే మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నాయి. అన్నింటికంటే మించి రాజధాని ముంబయి మహానగర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ పార్టీలు అనివార్యంగా పోటీచేయాల్సి ఉంది. ఎంఎన్ఎస్, ఎంవిఎ నేతల భేటీ స్థానిక సంస్థల ఎన్నికల కోసమేనని స్పష్టం అవుతోంది. గడచిన రెండునెలల్లో వీరిద్దరూ మూడుసార్లు కలుసుకున్నారు. 2005లో రాజ్‌థాకరే అవిభాజ్య శివసేననుంచి వేరుపడి మహారాష్ట్ర నవ్ నిర్మాణ్‌సేన(ఎంఎన్ఎస్)ను స్థాపించారు. అసెంబ్లీఎన్నికల్లోకూడా వేరువేరుగాపోటీచేసారు గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా శివసేన థాకరే వర్గానికి 20 సీట్లు రాగా రాజ్‌థాకరే ఎంఎన్ఎస్ ఒక్కసీటు కూడా గెలవలేకపోయింది. ఈ పరిణామాల నేపథ్యంలో వీరిద్దరు తరచూ భేటీ కావడం వెనుక విలీనం ఒక్కటే అయి ఉంటుందన్న ఊహాగానాలు తారస్థాయికి చేరాయి. వీటికితోడు మహాయుతిలో కూడా ఒకప్పటి అవిభక్త శివసేన నుంచి వేరుకుంపటితో బిజెపికి మద్దతిచ్చిన ఏక్‌నాథ్‌షిండేకు కూడా అక్కడ పొసగడంలేదు. అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. షిండే వర్గం ఎమ్మెల్యేలకు ఇచ్చిన భద్రతా కవర్‌ను పూర్తిగా తొలగించడం ఈ వైరుధ్యాలకు మరింత ఆజ్యంపోసింది. వీటన్నిటి నేపథ్యంలో రాజ్‌థాకరే, ఉద్ధవ్‌థాకరేల భేటీ ఇపుడు మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తావిచ్చింది.

# పిఎం కిసాన్ పథకం కింద 19వ విడత నిధులు విడుదల!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించే ఆశయంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పిఎం కిసాన్ నిధులు సోమవారం జమ అయ్యాయి. ఈ పథకం కింద 19వ విడత నిధులను నేడు ప్రధాని మోడీ విడుదల చేశారు. బీహార్‌లోని భాగల్పూర్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా 'పిఎం కిసాన్ సమ్మాన్ నిధి' కింద ఈ నిధులు విడుదల చేశారు. తాజాగా విడుదల చేసిన రూ.22 వేల కోట్ల 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రైతులకు ఏటా ఒక్కో విడత



రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో రూ.6 వేల సాయం అందించే పిఎం కిసాన్ పథకాన్ని కేంద్రం 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించింది. ఇప్పటివరకు 11 కోట్లమంది రైతులకు 18 వాయిదాల్లో రూ.3.46 లక్షల కోట్లు అందచేసింది. ముందుగా పిఎం కిసాన్ అధికారికి వెబ్‌సైట్‌కి వెళ్లాలి. కుడివైపున కనిపిస్తున్న ఆప్షన్లలో బెనిఫిషియరీ స్టేటస్ ఆప్షన్ ఉంటుంది. సెలక్ట్ చేసుకున్న తర్వాత ఆధార్ లేదా ఖాతా నెంబరును ఎంటర్ చేసి గెట్ డేటా పై క్లిక్ చేయాలి. స్టేటస్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఒకవేళ మీరు పిఎం కిసాన్‌కు రిజిస్టర్ చేసుకుని, ఈ కెవైసి పూర్తి చేసి ఉంటే ఖాతాలోకి డబ్బు జమవుతుంది. అలాగే లబ్ధిదారుల జాబితాలో పేరు ఉందో లేదో కూడా చెక్ చేసుకోవచ్చు. బెనిఫిషియరీ స్టేటస్ కింద బెనిఫిషియరీ లిస్ట్ ఆప్షన్ కనిపిస్తుంది. ఈ ఆప్షన్‌పై క్లిక్ చేసే మరొక పేజీకి రీడైరెక్ట్ అవుతుంది. ఇక్కడ లబ్ధిదారుని రాష్ట్రం, జిల్లా, ఉప జిల్లా, బ్లాక్, గ్రామాలను ఎంచుకుని 'గెట్ రిపోర్ట్'పై క్లిక్ చేస్తే లబ్ధిదారుల జాబితా కనిపిస్తుంది.

పిఎం కిసాన్ హెల్ప్‌లైన్ నెంబర్ 155261/011-24300606కు కాల్ చేసి కూడా సమాచారం తెలుసుకోవచ్చు.

# షిండేకు పట్టున్న థానెలో బిజెపి నాయక్ జనతాదర్బార్



**ముంబయి, ఫిబ్రవరి 24:** మహారాష్ట్రలోని అధికార మహాయుతిలో లుకలుకలకు కారణం జనతా దర్బార్ అని కూడాకూటమి నేతలు చెపుతున్నారు. థాణెలో మహాయుతినేత గణేశ్‌నాయక్ రెండో విడత జనతా దర్బార్ నిర్వహణకు భారీ ఎత్తున ఏర్పాట్లుచేయడాన్ని కూడా షిండేకు సుతరాము ఇష్టంలేదు. టౌన్‌హాల్‌మీటింగ్‌లకోసం థాణె నగరంలో భారీ ఎత్తున పోస్టర్లు కూడా అంటించారు. థాణె ఏక్‌నాథ్‌షిండేకు పెట్టని కోటగా నిలిచిన సంగతి తెలిసిందే. జిల్లాలో ఈ దర్బార్ నిర్వహణతో షిండే ఏకస్వామ్యాన్ని సవాల్ చేసినట్లవుతుంది. అంతేకాకుండా థాణెకు ఇన్‌ఛార్జి మంత్రిగా కూడా గణేశ్‌నాయక్ ఉన్నారు. నాయక్ ఇప్పటికే నవీముంబయంలోని వాశిలో దర్బార్‌ను నిర్వహించారు. ఈనెల 3వ తేదీ నిర్వహించిన ఈ దర్బార్‌కు విశేష స్పందన లభించింది. థాణె లోక్‌సభ ఎంపి శివసేన షిండే వర్గానికి చెందిన వారు నరేశ్ ఎంహాస్కే ఈ తీరుపట్ల కూడా నిరసన తెలుపుతున్నారు. అయితే పైకి మాత్రం ప్రజలు వారి రాజకీయ నేతలనున కలుసుకోవడానికి వెళితే ఎందుకు అడ్డుకోవాలి అని ప్రశ్నించారు. థాణె దర్బార్‌తో ఇపుడు నాయక్, షిండేల మధ్య ఉన్న వైరాన్ని మరింతపెంచు తోంది. అవిభక్త శివసేనలో ఉన్న షిండేకు అప్పట్లో థాణె జిల్లాపై మంచి పట్టు ఉండేది. ఇపుడు షిండేకు ఫడ్నవిస్‌కు ఎదురవుతున్న వైరుద్యాలతో థాణెలో బిజెపి పట్టుకోసం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే బిజెపి మంత్రి గణేశ్‌నాయక్ థాణెలో జనతాదర్బార్‌ను నిర్వహించారు. 1990లోనే నాయక్ ఈ జనతా దర్బార్‌ను నిర్వహించి ప్రజల దృష్టిలోపడ్డారు. ఈనెల 3వ తేదీనే నవీముంబయి టౌన్‌షిప్ థాణెజిల్లా పరిధిలోనే జనతాదర్బార్ నిర్వహిం చారు. ఇపుడు ఏకంగా థాణె జిల్లా కేంద్రంలోనే నిర్వహించడం తర్వాత 21వతేదీ పాల్గర్‌జిల్లాలో నిర్వహిస్తామని ప్రకటించారు. షిండే ప్రమేయం లేకుండా థాణెలో జనతాదర్బార్ నిర్వహించడం కూడా షిండే శివసేన నేతలకు సుతరాము ఇష్టంలేదు సరికదా బిజెపి వైఖరిపై మండిపడుతున్నారు.



# శీష్‌మహల్‌కు మీడియా టూర్.. మీరే నిర్ణయించాలి

## ఢిల్లీ మంత్రి పర్వేష్‌సింగ్ వర్మ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** అసెంబ్లీ ఎన్నికల్లో వాడివేడిగాజరిగిన శీష్‌మహల్‌ప్రచారం బిజెపికి ఎంతో కొంత కలిసి వచ్చిందన్నది వాస్తవమే. ఇపుడు అధికార పగ్గాలుచేపట్టిన తర్వాత అప్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందన్న అభియోగాలను ప్రజల్లోకి మరింత తీసుకువెళ్లేందుకు వీలుగా ఈ శీష్‌మహల్‌కు మీడియాటూర్‌ను ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేస్తోంది. అవినీతినిరోధిస్తామన్న నినాదంతో అధికారం చేపట్టి పదేళ్లు పాలించిన ఆప్ కొన్ని ప్రభుత్వ సంస్థలను నిబంధనలకు విరుద్ధంగా విలీనంచేసి, 50వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ అద్దాలమేడను నిర్మించిందని బిజెపి రాష్ట్ర చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ విమర్శించారు. అందుకే వాస్తవాలు ప్రజలకు తెలియజేసేందుకు వీలుగా ఈ టూర్‌ను చేపట్టామని ఢిల్లీ ప్రభుత్వం కూడా చెపుతోంది. ఆమ్ ఆద్మీకి ఇంత భారీ ఎత్తున విలాసవంతమైన భవనంలో జీవించాలన అత్యాశ ఏర్పడిందంటూ బిజెపి సెటైర్లువేస్తోంది. ఢిల్లీ మంత్రి పర్వేష్‌వర్మ మీడియాతో మాట్లా డుతూ బంగ్లా లోపలికి మీడియా బృందాన్ని తీసుకువెళతామని, గత ఆప్‌ప్రభుత్వం ప్రభుత్వ నిధులు ఎలా దుర్వినియోగం చేసిందీ మీరే చెప్పాలని సూచించారు. మొత్తం 33కోట్ల రూపాయల ఖర్చుతో ఈ భవనాన్ని ఆధునీ కరించారు. ఇప్పటికే బిజెపి కొన్ని స్నాప్ షాట్‌లను కూడా వైరల్‌చేసింది. ఢిల్లీ బిజెపి చీఫ్ అయితే ప్రభుత్వ సంస్థల విలీనాలను వెంటనే రద్దుచేయాలంటూ లెఫ్టినెంట్ గవర్నర్ వీరేంద్ర సచ్‌దేవాకు లేఖలు రాసారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేజ్రీవాల్ ఈ భవనంలో నివసించారు. 2015 నుంచి 2024వరకూ ఇక్కడే ఉన్నారు. ఇపుడు కొత్త సీఎం రేఖా గుప్తా తను ఈ బంగ్లాలో బస చేయనని ముందే చెప్పారు. అయితే ఈ భవనం ఏంచేయాలన్నది భవిష్యత్తులో నిర్ణయిస్తామని ప్రకటించారు.

# భారతీయ వంటకాల్లో 'మఖానా' సూపర్‌ఫుడ్

## బీహార్ పర్యటనలో ప్రధాని మోడీ

**పాట్నా, ఫిబ్రవరి 24:** భారతీయ వంటకాల్లో మఖానా సూపర్‌ఫుడ్ అని ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకారి అని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. 365 రోజుల్లో 300 రోజులు అది తన ఆహారంలో భాగం అయ్యేలా చూసు కుంటానన్నారు. దేశవ్యాప్తంగా చాలామందిప్రజలకు అల్పాహారంలో మఖానా తప్పనిసరి అని అంతర్జాతీయ స్థాయిలో దాని ఉత్పత్తి ఉండాలన్నారు. సోమవారం బీహార్‌లోని భాగల్‌పూర్‌లో పర్యటన సందర్భంగా తన ఆహారపు అలవాట్లను వివరించారు. రైతుల శ్రేయస్సుకోసం బీహార్‌లో మఖానాబోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు వార్షిక బడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మఖానా బోర్డు ఏర్పాటుకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నామని అన్నారు. ఈ బోర్డుద్వారా ఉత్పత్తి, ప్రాసెసింగ్,



మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపడతాయి. రైతులకు శిక్షణ అందుతుందన్నారు. వారు అన్ని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందేలా బోర్డుచూస్తుందని ప్రధాని తెలిపారు. దీనికి గుర్తుగా భాగల్‌పూర్‌లో మోడీకి మఖానాతోచేసిన దండను వేసి గౌరవించారు. ఢిల్లీ రైల్వేస్టేషన్ తొక్కిసలాటపై బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్‌యాదవ్ చేసిన వ్యాఖ్యలపై మోడీ ఆగ్రహం వ్యక్తంచేసారు. ప్రయాగరాజ్‌లో కుంభమేళా నిర్వహణలో ఐక్యత కనిపిస్తోంది. భారత దేశ అద్భుతమైన వారసత్వాన్ని కాపాడేందుకు భవిష్యత్తు నిర్మాణం కోసం ఎన్డీయే ప్రభుత్వం అందరితో కలిసి పనిచేస్తుందని ఆటవిక రాజ్యాన్ని ప్రోత్సహించే ఈ వ్యక్తులు మన వారసత్వాన్ని విశ్వాసాలను ద్వేషిస్తున్నారని బీహార్‌లోప్రధాని ఆగ్రహం వ్యక్తంచేసారు. లాలూప్రసాద్ కుంభమేళా అర్థంలేనిదని వ్యాఖ్యలు చేసారు. ఇదంతా బుజ్జగింపు రాజకీయాలని లాలూ వ్యాఖ్యలను బిజెపి తిప్పికొట్టింది. దీనిపై ఇపుడు బీహార్ పర్యటనలో ప్రధాని స్పందించారు. బీహార్‌లో ఈ ఏడాది చివరిలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో అక్కడి రాజకీయాలు వేడెక్కాయి. పార్టీలు, నాయకులమధ్య పరస్పర విమర్శలు హోరెత్తాయి.

# ఢిల్లీ స్పీకర్‌గా విజేంద్రగుప్తా బాధ్యతల స్వీకారం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** ఢిల్లీ రాజకీయ వర్గాల్లో ముందునుంచి చర్చ జరిగినట్లుగానే బిజెపి ఎమ్మెల్యే విజేందర్‌గుప్తా అసెంబ్లీ స్పీకర్ పదవి సాధించుకోగలిగారు. విజేందర్‌గుప్తాను స్పీకర్‌గా ఎన్నుకున్న తర్వాత సీఎం రేఖాగుప్తా ప్రతిపక్ష నాయకురాలు అతిశిసింగ్ ఆయనను పోడియం మీదకు తీసుకెళ్లి స్పీకర్ కుర్చీలో కూర్చోబెట్టారు. ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఆమ్ ఆద్మీపార్టీ పరాజయం చవిచూసింది. బిజెపి ఘనవిజయం సాధించింది. 48 స్థానాలతో బిజెపి, 22 స్థానాలతో ఆప్ గెలిచాయి. మహిళా సీఎంగా రేఖా గుప్తా పదవీప్రమాణం చేస్తే తొలిరోజు ప్రొటెం స్పీకర్‌గా అర్విందర్‌సింగ్ లవ్లీని లెఫ్టినెంట్ గవర్నర్ వికెసక్సేనా నియమించారు. తొలిరోజు ఆయన ఎమ్మెల్యేలచేత ప్రమాణస్వీకారాలుచేయించారు. తర్వాత స్పీకర్‌ను ఎన్నుకున్నారు. అసెంబ్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా మంగళవారం ప్రసంగిస్తారు.



కాగా ఈరోజు ఢిల్లీ రాజకీయాల్లో చరిత్రాత్మకమైనరోజుఅని గడచిన 12 ఏళ్లుగా ఢిల్లీకి ఏర్పడిన ఆప్‌దాకు బాధ్యులెవరో ప్రజలే నిర్ణయించారని ఢిల్లీ పర్యావరణ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా అన్నారు.

# సంక్షోభంలోకి భగవంత్‌మాన్ సర్కార్!



**చండీఘర్, ఫిబ్రవరి 24:** పంజాబ్‌ప్రభుత్వం త్వరలోనే సంక్షోభంలోకి పడిపోతోందని ప్రతిపక్ష నాయకుడు కాంగ్రెస్‌నేత ప్రతాప్‌సింగ్ బాజ్వా ప్రకటించారు. అధికార పార్టీకి చెందిన 32 మంది ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని మరికొందరు కూడా బిజెపితో టచ్‌లోకి వెళుతున్నారని ఆయన చెప్పారు. భగవంత్ మాన్ ప్రభుత్వం ఒక్కసారిగా కుప్పకూలిపోతుందని ఆయన జోస్యంచెప్పారు. ఆప్‌ప్రభుత్వాని కూల్చివేయాలన్న తపన ఎంతమాత్రం కాంగ్రెస్ పార్టీకి లేదని, అయితే యాధృచ్ఛికంగానే ఎమ్మెల్యేలు అసహనంతో ఉన్నారని ఆయన చెప్పారు. బిజెపి ఇప్పటినుంచే ఆప్‌ప్రభుత్వాన్ని నిస్తేజపరిచే చర్యలు చేపట్టిందన్నారు. ఆప్ ప్రభుత్వం ఐదేళ్లపాటుపనిచేయాలనే కోరుకుంటున్నామని దీనివల్ల ప్రజలకు కూడా ఎ లాంటి ప్రభుత్వాన్ని తాము ఎన్నుకున్నామో అన్న నిజాలు తెలుస్తాయన్నారు. ఆప్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు ఎంతో అసహనంతో ఉన్నారని, వేలాదికోట్ల రూపాయలు ఆస్ట్రేలియా, ఇతర దేశాలకు హవాలా ఛానళ్లలో తరలిపోతున్నాయని, ఇదంతా ఆప్ హయాంలోనే జరుగుతున్నదని అన్నారు. ఈసొమ్ము అంతా మద్యం, భూమార్ఫిడిలవల్ల సమకూరిన అవినీతిసొమ్ము అని ఆయన ఆరోపించారు. పంజాబ్‌లో ఇపుడు ఢిల్లీమోడల్‌కొనసాగుతోందని, దోపిడీలో నిపుణులుగా తయారవుతున్నారని ఆరోపించారు. బాజ్వా ఆరోపణలను ఆప్ కూడా తిప్పికొట్టింది. బాజ్వా బిజెపికి వెళ్లిపోయే ఆలోచనల్లో ఉన్నారని బిజెపిలో ఇప్పుడే తన టికెట్ ఖరారుచేసుకున్నారరని, బెంగళూరులో బిజెపి సీనియర్ నాయకులను కలిసినట్లు ఆప్ నేత నీల్‌గార్గ్ ఆరోపించారు. రాహుల్‌గాంధీ ప్రతాప్‌బాజ్వాపై ఓ కన్నేసి ఉంచాలని సూచించారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం కుప్పకూలిపోవడం, ఎన్నికల్లో ఆప్ ఓటమి తర్వాత పంజాబ్‌లోని భగవంత్ మాన్ ప్రభుత్వంపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. పంజాబ్ ప్రభుత్వం ఇపుడు అవినీతి వ్యతిరేక కార్యాచరణను ప్రారంభించింది. ఎన్నికల్లో ప్రధాన హామీ కూడా ఇచ్చింది. ఇందుకు అనుగుణంగానే కానిస్టేబుళ్లనుంచి ఇన్‌స్పెక్టర్లవరకూ అవినీతి ఆరోపణలపై 52 మంది పోలీస్ అదికారులను డిస్మిస్‌చేసింది. 1993 బ్యాచ్ ఐపిఎస్ అధికారి వరిందర్‌కుమార్‌ను కూడా మార్పిడిచేసారు. విజిలెన్స్ డైరెక్టర్‌గా ఉన్న ఆయన్ను పోలీస్ చీఫ్‌కు రిపోర్టు చేయాలని ఆదేశించారు. ముక్తసర్ సాహిబ్ డిప్యూటి కమిషనర్ రాజేష్ త్రిపాఠి 2016 ఐఎఎస్ అధికారి. ఆయన్ను కూడా సస్పెండ్ చేసారు. విజిలెన్స్ విభాగం ఆయనపై విచారణకు ఆదేశించడంతో సస్పెండ్ అయ్యారు.

# హంద్రీనీవా పరిధిలో భూగర్భ జలాలు అడుగంటకుండా, చెరువులకు నీరు అందించాలి: ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త బ్యూరో** హంద్రీనీవా కాలువ 2వదశ కాల్వ లైనింగ్ పనులకు సంబంధించి మా రైతుల అభ్యంతరాలు, ఇబ్బందులను పరిశీలించాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆమె మంత్రి క్యాంప్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ నియోజకవర్గంలో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాస్తవంగా శనివారం రోజు రాప్తాడు నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ పరివాహక ప్రాంత రైతులతో ఎమ్మెల్యే సునీత, పరిటాల శ్రీరామ్ సమావేశమయ్యారు. హంద్రీనీవా అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ ప్రాంతానికి ఎదురయ్యే కష్టాల గురించి వివరించారు. లైనింగ్ పనులు చేస్తే తమ ప్రాంతంలో ఉన్న చెరువులకు నీరందే అవకాశం లేదని, భూగర్భజలాలు తగ్గే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో రైతులకు ఇబ్బంది లేకుండా చేసేందుకు కొన్ని ప్రతిపాదనలు కూడా చేశారు. కాలువ వెంబడి గల వివిధ చెరువులు, కుంటలను హంద్రీనీవా నీరు అందేలా.. తూములను ఏర్పాటు చేయటం, కాలువ సమీపంలో వంకలపై గల చెక్ డ్యామ్ లకు నీరు అందించే విధంగా తూములు ఉండాలని, కాలువ ఉన్న ప్రాంతంలోని వివిధ గ్రామాల రైతులు, ప్రజలు కాలువను దాటే విధంగా వంతెనలు నిర్మించాలని తమ అభిప్రాయాలను రైతులు చెప్పారు. రైతులు చెప్పిన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు సోమవారం మంత్రి నిమ్మల రామానాయుడు గారిని కలిసి.. రైతులు ప్రతిపాదించిన అన్ని అంశాల గురించి వివరించారు. తీవ్ర కరవు ప్రాంతమైన రాప్తాడు నియోజకవర్గంలో గతంలో నీరు లేక వలసలు ఉండేవన్నారు. హంద్రీనీవా నీరు వచ్చిన తర్వాత తిరిగి ఈ ప్రాంతం వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. హంద్రీ నీవా కాలువ వెంబడి 38 చెరువులకు నీరు ఆగితే చాలా నష్టపోతారన్నారు. అన్ని చెరువులకు నీరందడంతోపాటు భూగర్భ జలాలు తగ్గకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి రామానాయుడు స్పందిస్తూ కచ్చితంగా రైతులు చెప్పిన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు...జీడిపల్లి పేరూరు ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వండి..

జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పరిటాల రవీంద్ర అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే సునీత మంత్రి రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు. 2018లో అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు మీద నమ్మకంతో భూములిచ్చిన రైతుల్లో చాలా మందికి ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. యూపీపీ కాలువకు సంబంధించి భూసేకరణకు మొత్తం రూ.50.00 కోట్లకు గాను రూ.4.86 కోట్లు గతంలో చెల్లించారన్నారు.

ప్రస్తుతం రూ.14.50 కోట్లకు సీఎఫ్ఎంఎస్ ద్వారా భూసేకరణ చెల్లింపుల కోసం బిల్లులు అప్లోడ్ చేశారన్నారు. వెంటనే ఈ రూ.14.50 కోట్ల నిధులు విడుదల చేసి రైతులకు ఇవ్వడంతో పాటు ప్రాజెక్ట్ పనులకు కూడా నిదులు మంజూరుచేసి పనులను పునః ప్రారంభించాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు.



స్వామి అమ్మవార్లకు పూజాదికాలు నిర్వహిస్తున్న దృశ్యం

# దుర్గమ్మ ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు వేదోక్తంగా ప్రారంభం

**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 24, ప్రభాత'వార్త' :** అమ్మలగన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ ఆలయంలో శివరాత్రి ఉత్సవాల సంబరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ఆదిదంపతులకు పట్టువస్త్రాలను అధికారులు సమర్పించారు. శ్రీ గంగా, పార్వతి సమేత మల్లేశ్వర స్వామివార్ల ఉత్సవర్లకు మంగళస్నానములు జరిపించి నూతన వధూవరులుగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవచనము, అంకురార్పణ, మండపరాధన, కలశస్థాపన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్టాపన, మూల వినియోగంతో మొదటిరోజు పూజాదికాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, డిప్యూటి ఇఓ రత్నరాజు, ఎఇఓ ఎం దుర్గారావు, వైదిక సిబ్బంది పాల్గొన్నారు.

**- ఆన్లైన్‌లో కళ్యాణోత్సవ టికెట్లు:** శివరాత్రి పర్వదినాన ఆదిదంపతులకు నిర్వహించే కళ్యాణోత్సవ టికెట్లను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. కనకదుర్గమ్మ.ఓఆర్‌జి ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్‌చేసుకోవాలని ఇఓ కె రామచంద్ర మోహన్ తెలిపారు. 26వ తేదీ ఉదయం నుండి సాయంత్రం వరకు శ్రీ మల్లేశ్వర స్వామివార్లకు త్రికాల అభిషేకాదులు జరుపుతామన్నారు. ఉదయం 6 నుండి 9 వరకు, ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 వరకు, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 వరకు అభిషేకాలు జరుగుతాయన్నారు. రాత్రి 9 గంటల నుండి మహన్యాసం, అనంతరం లింగోద్భవ అభిషేకం, మహానివేదిన, హారతి, మంత్రపుష్పం జరుగుతాయన్నారు. అనంతరం శ్రీ మల్లేశ్వర స్వామివార్ల ఆలయ ప్రాంగణంలో శ్రీ గంగా, పార్వతి(దుర్గా) సమేత శ్రీ మల్లేశ్వర స్వామివార్ల దివ్య లీలా కళ్యాణోత్సవం జరుగుతుందన్నారు.

**- 27 న రథోత్సవం:** 27న సాయంత్రం 4 గంటలకు రథోత్సవము, 28వ తేదీన ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, ధాన్యకోటోత్సవం, వసంతోత్సవము, అవభృథోత్సవం (దుర్గాఘాట్‌నందు) , తదుపరి ధ్వజారోహణం జరుగుతాయన్నారు. మార్చి 1న శ్రీ మల్లేశ్వర స్వామివార్లకు సాయంత్రం పంచహారతులు, ద్వాదశ ప్రదక్షణలు, పవళింపు సేవ, మార్చి2, 3వ తేదీల్లో ఉదయం 8 గంటలకు పవళింపు సేవలు జరుగుతాయన్నారు. 26వ తేదీ నిర్వహించే మహాశివరాత్రి కళ్యాణోత్సవంలో పాల్గొన వలసిన ఉభయ దాతలు ఆర్జిత సేవా రుసుము రు.1,116లను చెల్లించి పాల్గొనాలన్నారు. పాల్గొన్న వారికి శేషవస్త్రము, రవిక, శ్రీ చక్రలడ్డు అందిస్తామన్నారు. టిక్కెట్లను డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు. కనకదుర్గమ్మ. ఓఆర్‌జి నందు టిక్కెట్లు బుక్‌చేసుకోవాలన్నారు.



# ఆద్యంతం ఆధ్యాత్మికతతో తిరుపతి ఆవిర్భావ వేడుకలు

**తిరుపతి,ఫిబ్రవరి 24ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతి ఆవిర్భావ దినోత్సవ వేడకలను రాయలసీమరంగస్థలి ఆద్యంతం ఘనంగా జరుపుకుంది. సోమవారం ఉదయం రాయలసీమ రంగస్థలి సంస్థ చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు కెఎన్‌రాజా, కల్పన, నిర్మల, జ్యోతి, జయమ్మ ,పద్మ, పొన్నాలజేజిరెడ్డి, వాసురావు, ఉషారాణి, పార్వతి, చంద్రబాబునాయుడు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు విశేష వేషధారణలతో తిరుపతి నగరం ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. తిరుమలతిరుపతిదేవస్థానం, తిరుపతి నగరపాలకపసంస్థ ఈ వేడుకలను నిర్వహించాలని ఆయన కోరారు. పురాతన పట్టణాల్లో తిరుపతి ఒకటిగా నిలిచిందన్నారు. మహాపుణ్యక్షేత్రం తిరుపతి నగరానికి ఖచ్చితమైన ఆవిర్భావం దినోత్సవం లభించడం గర్వించదగిన విషయమన్నారు. ఇటీవల తిరుపతిగ్రామ దేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయం పున:నిర్మాణంలో భాగగంగా లభ్యమైన శాసనాలు పరిశీలన చేసిన చరిత్రకారులు 900 సంవత్సరాలు ముందే తిరుపతి ఆవిర్భవించిందని పేర్కొన్నారు.



సిఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్న ఆలూరి రమేష్

# ప్రధాన పౌరసంబంధాల అధికారిగా ఆలూరి రమేష్ నియామకం

**విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి:** పీ ముఖ్యమంత్రి ప్రధాన పౌరసంబంధాల అధికారిగా ఆలూరి రమేష్ నియమిస్తూ సీఎంవో అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.ఆయన ముఖ్యమంత్రి పీఆర్వోగా ఇప్పటికే పనిచేస్తూ సీపీఆర్వోగా ఆయన చంద్రబాబు ఎంపిక చేసారు.ఆ మేరకు అధికారిక ఉత్తర్వులు విడుదలయ్యాయి.తనను ఈ పదవిలో నియమించిన చంద్రబాబుకు పుష్పగుచ్ఛాన్నిచ్చి ధన్యవాదాలు తెలిపారు ఆలూరి రమేష్..ఆయన దశాబ్దన్నర కాలం పైగా పాత్రికేయరంగంలో పలు బాధ్యతలు నిర్వహించారు.రమేష్‌ను పాత్రికేయ సంఘాలు అభినందించాయి.

# గవర్నర్ ప్రసంగంలో పస లేదు కూటమి మేనిఫెస్టోను సభలో చదివారు

## - ఎక్స్ వేదికగా పిసిసి చీఫ్ షర్మిల కీలక వ్యాఖ్యలు

**విజయవాడ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున గవర్నర్ ప్రసంగంలో పసలేదని ఎక్స్ వేదికగా ఏపీసీసీ చీఫ్ షర్మిల కీలక వ్యాఖానించారు. దిశానిర్దేశంఅంతకన్నా లేదన్నారు.అన్ని అర్థ సత్యాలు, పూర్తి అబద్ధాలు. సూపర్ సిక్స్ హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన లేదు. సంక్షేమం, పునరుజ్జీవనం అంటున్నారే కానీ ఎప్పటి నుంచి అమలు చేస్తారో క్లారిటీ లేదు. ఇచ్చిన గ్యాస్ సిలిండర్ తప్పా మిగతా 5 హామీలపై స్పష్టతద లేదు. మనుషులు ,వనరులు, చేపలు అంటూ సామెతలు చెప్పారు తప్పిస్తే బాబు విజన్ 2047 కి దమ్ములేదు. 8 నెలల పాలన కాలయాపన తప్పా ఎక్కడా కమిటిమెంట్ కనిపించలేదు. హామీల అమలు కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు గవర్నర్ ప్రసంగం తీవ్ర నిరాశను మిగిల్చింది. రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి ఎక్కడొచ్చాయి? 4 లక్షల ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఎవరికిచ్చారు? తొలి సంతకం పెట్టిన డీఎస్సీకి అసలు నోటిఫికేషన్ అయినా ఇచ్చారా? ఆరోగ్య శ్రీ బకాయిలు ఎప్పుడు చెల్లించారు? కొత్త సీసాలో పాత సారా అనే సామెత లెక్క కూటమి మ్యానిఫెస్టోనో గవర్నర్ చదివారు తప్పిస్తే కొత్త అంశాలు ఒక్కటి లేవు. ఒక జనాలు ఛీ కొడుతున్నా వైసీపీఅధ్యక్షులు జగన్ తీరు మాత్రం మారలేదు. 11 మంది ఎమ్మెల్యేలతో కలసి 11 నిమిషాలు ఉండటానికా అసెంబ్లీకి వచ్చింది? ప్రజా సమస్యల కన్నా మీకు ప్రతిపక్ష హోదానే ముఖ్యమా? సభ్యత్వాలు రద్దవుతాయనే భయంతో అటెండెన్స్ కోసం వచ్చారా? కూటమి ప్రభుత్వ వైఫల్యాలలను ప్రశ్నించడానికి మీకు ప్రతిపక్ష హోదానే కావాలా? ప్రజల శ్రేయస్సు కంటే మీకు పదవులే ముఖ్యమని అసెంబ్లీ సాక్షిగా నిరూపించుకున్నారు. వైకాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులకు పదువులు ముఖ్యం కాదు అనుకుంటే ప్రజాసమస్యలమీద చిత్తశుద్ధి ఉంటే మంగళ వారం నుంచి అసెంబ్లీకి వెళ్ళాలని కోరు తున్నాం.

# పూడి గ్రామ హరిజనవాడలో మహిళపై జీబిఎస్ కేసు నమోదు

## - జిల్లాలోనే తొట్టంబేడు మండలంలో తొలికేసు నమోదు

**తొట్టంబేడు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త** తిరుపతి జిల్లా, తొట్టంబేడు మండలం పూడి గ్రామంలోని హరిజనవాడలో ఒమహిళకు జీవిఎస్ కేసు జిల్లాలోనే తొలిసారిగా నమోదయ్యిందని కాసరం ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ మాధవుడు అన్నారు. పూడి హరిజనవాడలో నివాసం ఉంటున్న ధర్మయ్య భార్య వెంకటమ్మ ఈనెల 10వ తేదీన సాధారణ జ్వరం, ఆరోగ్యం నిస్సత్తువగా ఉందని పూడి హెచ్‌డబ్ల్యుసి నందు ఎంఎల్‌హెచ్‌పి తేజ వద్ద చికిత్స పొందిందని మూడు రోజుల తర్వాత తిరుపతిలో నివాసం ఉంటున్న తన కుమార్తె ఇంటికి వెళ్ళినట్లు పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీన స్విమ్స్‌లో తిరుపతి నందు అడ్మిట్ అయ్యిందని అదేరోజు నిర్వహించిన వైద్యపరీక్షల్లో గులియన్ బారే సింద్రోమ్(జిబిఎస్)కేసుగా స్విమ్స్ తిరుపతి న్యూరాలజీ విభాగం నిర్ధారణ చేసినట్లు తెలిపారు. దీంతో సోమవారం కాసరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఈ.మాధవుడు, సూపర్‌వైజర్ సిబ్బంది క్షేత్రస్థాయి సిబ్బందితో కలసి కేసుకు సంబందించిన వివరాలు రీజాయిండర్ రిపోర్ట్ నివేదికను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పంపామన్నారు. 22వతేదీన సంబందిత పూడి హరిజన వాడలో వైద్యశిబిరం నిర్వహించి క్షేత్రస్థాయి సిబ్బందితో ఇంటింటి సర్వే చేసి జ్వరాలు మరియు ఇతర జబ్బులకు చికిత్స అందించామన్నారు. ఎలాంటి జ్వరకేసులు నమోద కాలేదని పంచాయతీ సిబ్బందితో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. అన్ని రకాల తాగునీటి వనరుల వద్ద నీటి నమూనాలు సేకరించామని, ల్యాబ్ నివేదికలు అనుసరించి తాగునీటి ప్రమాణాలు తీసి నీటి వనరులు మెరుగు పరిచే చర్యలను తొట్టంబేడు ఎంపిడిఓ సురేంద్రనాధ్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు చేపట్టారు.



మంచినీటి సురక్షితకేంద్రంలో శాంపిల్స్‌ను సేకరిస్తున్న దృశ్యం

వ్యాధిపట్ల ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. వ్యాధిలక్షణాలను పరిశీలిస్తే జీబిఎస్ సోకిన వారికి నరాల బలహీనత, శ్వాసకోశకు సంబందించి ఊపిరితిత్తులపై ప్రభావం ఉంటుందన్నారు. అయితే ఇది విస్తరించే వ్యాధికాదని సరైన వైద్యపొందితే ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు.



శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బిఐఎస్ అధికారి డి వివేక్‌వర్ధన్‌రెడ్డి

# బిఐఎస్ కార్యక్రమాల బలోపేతానికి రిసోర్స్ పర్సన్ల నియామకం

**విజయవాడ, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లో బిఐఎస్ కార్యకలాపాలను బలోపేతం చేయడానికి రిసోర్స్ పర్సన్లను నియమించి వారికి ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం విజయవంతంగా నిర్వహించార. ఈసందర్భంగా బిఐఎస్ విజయవాడ సైంటిస్ట్ సి/డిప్యూటి డైరెక్టర్ డి వివేక్‌వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ 130 మంది నిపుణులను ఎంప్యానల్ చేశామని వారంతా ఎప్పటికప్పుడు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు బిఐఎస్ కార్యకలాపాలను ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వ శాఖలు, పరిశ్రమ, వాణిజ్య సంస్థల హెచ్‌ఓడిలకు సందేశాల ద్వారా బిఐఎస్ పాత్రను మరింత లోతుగా వ్యాపి చేయడానికి మనక్‌మిత్రాస్ నిమగ్నమయ్యారన్నారు. కార్యక్రమంలో బిఐఎస్ విజయవాడ స్టాండర్డ్స్ ప్రమోషన్ ఆఫీసర్ డి కృష్ణ వీర్ వర్మ, బిఐఎస్ అధికారులు పాల్గొన్నారు.

# అర్ధనారీశ్వరాలయం అభివృద్ధితో ఆకర్షణీయం

## శ్రీకాళహస్తీశరాలయానికి రూ.2కోట్లతో అభివృద్ధి

**తొట్టంబేడు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశరాలయానికి ఆమడదూరంలో ఉన్న అర్ధనారీశ్వరాలయం అభివృద్ధిలో భక్తులను ఆకట్టుకుంటోంది. నిధులు సుమారు రూ.2కోట్లతో ఆలయాభివృద్ధికి శ్రీకారం చుట్టారు. మూడేళ్ళ క్రితం వరకు శిధిలావస్థలె ఉన్న ఆలయాభివృద్ధికి శ్రీకాళహస్తీశ్వరుని నిధులు అందాన్ని ఆపాందిస్తున్నాయి. స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అర్ధనారీశ్వర ఆలయంలో వెలసిన స్వయంభువు లింగం రెండు వర్ణాల్లో కనిపిస్తుంది. జీవనది స్వర్ణముఖి ఒడ్డున వెలసిన ఈ దివ్యక్షేత్రానికి ఎప్పుడో పరిపాలించిన రాజులు మణిమాక్యాలను కేటాయించారు. కాలక్రమంలో కొన్ని ఆక్రమణలకు గురైనా నేడు ఆలయ పరిసరాలు 10 ఎకరాలుగా మారింది. నాయుడుపేట-తిరుపతి జాతీయరహదారిగా రూ.1750కోట్లతో ఆరులేన్ల రోడ్డును తీర్చిదిద్దారు. శ్రీకాళహస్తికి కిలోమీటరు దూరంలో ఈ రహదారి పయనిస్తుంది. ఈ రహదారికి సుమారు కిలోమీటరు దూరంలో అర్ధనారీశ్వరాలయం వెలసి భక్తులకు కొంగుబంగారంగా వరాలిస్తోంది. వెళ్ళడానికి దారి డొంక లేని ఆలయానికి మహర్ధశ కల్పించుటకు గత పాలకులు, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి బైపాస్ నుంచి సుమారు కిలోమీరు దూరంలో అర్ధనారీశ్వరాలయం వెలసింది. ఇక్కడ సోమ, మంగళ, శుక్ర, వారాల్లో కాకుండా మిగిలినరోజుల్లో కూడా భక్తులు విశేష సంఖ్యలో హాజరై పూజలు జరుపుకుంటారు. ముఖ్యంగా మహిళలకు ఆకర్షణీయంగా మారిన ఈ ఆలయంలో కార్తీకమాసంలో వేలాది మంది భక్తులు పాల్గొంటూ దీపారాధన చేస్తుంటారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చుట్టుపక్కల పది గ్రామాల ప్రజలు కదలిరావడం ఆనవాయితీ. మరో నెలరన్నర రోజుల్లో పూర్తికానున్న ఆలయం సర్వాంగసుందరంగా కనిపించనుంది. సుమారు 200మంది భక్తులు వరకు కూర్చుని స్వామిఅమ్మవార్లను దర్శించుకునే భాగ్యం కలగనుంచి సుమారు పది ఎకరాల్లో రూపుదిద్దుకుంటున్న ఆలయం వద్ద గోశాల, బిల్వనవృక్షం వనంలు ఏర్పాటు చేస్తున్నారు. ఇక మహాశివరాత్రి సందర్భంగా విచ్చేసే భక్తులకు ఇప్పటికే క్యూలైన్లు ఏర్పాటు చకచగా చేస్తున్నారు. ఎక్కడా జరగని విధంగా ఇక్కడ అన్నదానాలు, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. హరుడు, భవహరుడు, భక్తవశంకుడు, మూగజీవులకు ముక్తిని ప్రసాదించిన ముక్కంటీశుడు శ్రీకాళహస్తీశ్వరుడు. ఎంతో పవిత్రపుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో పరమేశ్వరుడు స్వయంభువుగా వాయులింగ రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నాడు. తనశరీరంలో అర్ధభాగాన్ని పార్వతీదేవికి ఇచ్చిన పరమశివుడు అర్ధనారీశ్వరునిగా వెలిశాడు. ఈరూపాన్ని లింగాకారంగా మార్చి సువర్ణముఖినదీ తీరాన శ్రీకాళహస్తి లోనే ఆ ఆదిదంపతులు కొలువై భక్తులకు కోరిన వరాలిస్తున్నారు. ఇక్కడికి మరొకొద్ది దూరంలో ఈసలాపురం(విశాలపురం) గ్రామంకు సమీపం సువర్ణముఖి నదిలో అర్ధనారీశ్వరుడు కొలువై ఉన్నాడు.

# అధికారులు చెప్పిన సాక్ష్యం ఆధారంగా రుజువైన నేరం!

## సంచలన తీర్పు వెలువరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్

**అనంతపురం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం జిల్లా నార్పలకు చెందిన మట్టి పవన్ కుమార్ హత్య కేసులో ఐదుగురికి జీవిత కాలపు కఠిన కారాగార శిక్ష విధిస్తూ అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ .శ్రీనివాస్ సోమవారం సంచలన తీర్పు చెప్పారు. కేసు పూర్వాపరాల్లోకి వెళితే, నార్పలకు చెందిన హతుడు మట్టి పవన్ కుమార్, మెదటి ముద్దాయి డిపో షాజిద్ మంచి స్నేహితులు. వారి మధ్య భేదాభిప్రాయాలు వచ్చి కొట్లాడుకుంటూ, తరచూ మట్టి పవన్ కుమార్ ఈ డిపో షాజిద్ ను, నాల్గవ ముద్దాయి తలారి సుధాకర్ ను చంపుతానని బెదిరించేవాడు. వారి మధ్య భేదాభిప్రాయాలు తారాస్థాయికి చేరడంతో మట్టి పవన్ కుమార్ తన తల్లిదండ్రులతోపాటు సంసారాన్ని నార్పల నుండి అనంతపురం కు మార్చారు. 2022 సంవత్సరం ఏప్రిల్ 12 తేదీన తేదీ మట్టి పవన్ కుమార్ అతని తండ్రి మట్టి శ్రీనివాసులు రేషన్ బియ్యం తెచ్చుకోవడం కోసం నార్పలకు వెళ్లారు. మధ్యాహ్నం తండ్రికి చెప్పకుండా మట్టి పవన్ కుమార్ నార్పల తహసీల్దార్ ఆఫీస్ వద్దకు పోయాడు, అక్కడ డిపో షాజిద్ తారస పడడంతో ఇద్దరూ ఘర్షణ పడ్డారు, ఆ క్రమంలో మట్టి పవన్ కుమార్ డిపో షాజిద్ పై కత్తితో దాడి చేయగా, అతని చేతికి గాయాలయ్యాయి. ఆ తర్వాత అదే రోజు రాత్రి డిపో షాజిద్ తన అనుచరులైన చింతాకు రమేష్, చిక్కేపల్లి నాగేంద్ర, తలారి సుధాకర్, మరియు తలారి అరుణ్ లను వెంట పెట్టుకొని మట్టి పవన్ కుమార్ కోసం వెతుకుతూ వుండగా, రాత్రి సుమారు 1030 గంటల సమయంలో నార్పల గ్రామంలోని వడ్డే తిమ్మన్న తోట వద్ద మట్టి పవన్ కుమార్ వున్నాడన్న సమాచారం తెలుసుకొని పై వారందరూ స్టీల్ రాడ్, రెండు కట్టెలు తీసుకొని అక్కడికి పోయి, డిపో షాజిద్ ఏమిరా నీవు మధ్యాహ్నం నాతో గొడవపడి నన్నే కొట్టడానికి వస్తావా నిన్ను చంపితే నీకు దిక్కెవరు".. అంటూ డిపో షాజిద్, తలారి సుధాకర్, తలారి అరుణ్ తమ వెంట తెచ్చుకొన్న స్టీల్ రాడ్, కట్టెలతో అతి దారుణంగా కొడుతూ, కొట్టేటప్పుడు తలారి సుధాకర్, చిక్కేపల్లి నాగేంద్రను వీడియో తీయమని ఆదేశిస్తూ,

ఈ వీడియో చూచి అందరూ మనమంటే భయపడాలి అని చెప్పగా నాగేంద్ర తన సెల్ నుండి మట్టి పవన్ కుమార్ ను చంపేటపుడు వీడియో తీసి, దానిని తలారి సుధాకర్ సెల్ కు ఫార్వర్డ్ చేశాడు. అందులో .. సుధాకర్ అంటే ఒక బ్రాండ్".. అంటూ రాడ్ తో ఇష్టానుసారంగా కొట్టే దృశ్యాలు వున్నాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో హల్చల్ చేసింది. పోలీసులు నాగేంద్ర మరియు తలారి సుధాకర్ సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని ఫారెన్సిక్ ల్యాబ్ కు పంపి, అందుకు సంబంధించిన బలమైన డిజిటల్ సాక్ష్యాలను కోర్టు ముందు ప్రవేశపెట్టడం వలన, ప్రత్యక్ష సాక్షులు సాక్ష్యం చెప్పక పోయినప్పటికీ, సెల్ ఫోన్ లో నిక్షిప్తమైన సాక్ష్యంతో పాటు అధికారులు చెప్పిన సాక్ష్యం ఆధారంగా నేరం ఋజువు కావడంతో ముద్దాయిలు డిపో షాజిద్, చింతాకు రమేష్, చిక్కేపల్లి నాగేంద్ర, తలారి సుధాకర్, తలారి అరుణ్.. లకు జీవిత కాలపు కఠిన కారాగార శిక్ష విధిస్తూ,ఒక్కొక్కరికి 20,000/ జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. శ్రీనివాస్ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున రాచమల్లు హరినాథ్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారు.

ఈ కేసులోని ముద్దాయిలు అందరూ 25 సంవత్సరాల లోపు యువకులు, ఒక్కరు మినహా అందరూ అవివాహితులు. ఈ కేసులో అప్పటి నార్పల ఎస్సై యు .వెంకట ప్రసాద్, సెక్షన్ 302 ఆర్ / డబ్ల్యు సెక్షన్ 34 ఐపీసీ క్రింద ఎఫ్ఐఆర్ నెంబర్ 57/2022 గా నమోదు చేయగా, అప్పటి ఇటుకలపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్లు టీ. విజయ భాస్కర్ గౌడ్, టీ.అస్రార్ బాషా, సమగ్ర దర్యాప్తు జరిపి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు.

ఈ కేసులో సాక్షులను తీసుకు రావడంలో తిళీ। మల్లి రెడ్డి, కానిస్టేబుళ్ళు రామమోహన్, షానవాజ్ తదితరులు బాగా సహకరించారు. వీరందరిని అనంతపురం జిల్లా ఎస్పీ పి .జగదీష్ అభినందించారు.

# విఆర్‌ఒల సమస్యలను పరిష్కరించండి: మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం



**విజయవాడ, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** విఆర్‌ఓలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలంటూ విఆర్‌ఓ అసోసియేషన్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరింది. సోమవారం అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు. సచివాలయాల రేషనలైజేషన్ వల్ల భవిష్యత్తులో విఆర్‌ఓలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఖాళీగా వున్న సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సివిల్‌సప్లై, ఇతర శాఖల్లో ఖాళీగా వున్న పోస్టుల్లో అర్హులైన గ్రేడ్1, 2 విఆర్‌ఓలకు అవకాశం కల్పించాలన్నారు. రేషనలైజేషన్ చేసేప్పుడు విఆర్‌ఓల సంఘంతో చర్చించాలన్నారు. ఒక సచివాలయానికి ఒక విఆర్‌ఓ వుండేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన విఆర్‌ఏలకు ప్రమోషన్లివ్వాలని, గ్రేడ్1, 2 విఆర్‌ఓ లకు కామన్ డిడిఓగా తహసీల్దార్ వుండేలా నిర్ణయం తీసుకోవాలని, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ లైన్ డిపార్ట్‌మెంట్ ద్వారానే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తదితర డిమాండ్లను మంత్రికి వినతిపత్రం రూపంలో అందించారు. అనంతరం మంత్రి బాల వీరాంజనేయ స్వామిని కలిసి సచివాలయ వ్యవస్థ మార్పులపై చర్చించారు. అనంతరం సిసిఎల్‌ఏ అడిషనల్ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డిని కలిసి విఆర్‌ఓలపై జరుగుతున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలన్నారు.

# బస్సు బోల్తా - 17 మందికి గాయాలు - ఇద్దరి పరిస్థితి విషమం

**సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త** పాండిచ్చేరి నుంచి విజయవాడకు ఆదివారం సాయంత్రం బయలుదేరిన ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు అర్ధరాత్రి సమయంలో సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరు వద్ద జాతీయ రహదారి క్రాస్ రోడ్డు సమీపంలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 17 మంది గాయపడగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పాండిచ్చేరి నుంచి 34 మంది ప్రయాణికులతో విజయవాడకు బయలుదేరిన బస్సు సూళ్లూరుపేట సమీపానికి రాగానే అదుపుతప్పి జాతీయ రహదారి పక్కనే ఉన్న గుంటలోకి బోల్తాపడింది. అర్ధరాత్రి సమయం కావడంతో బస్సులోని ప్రయాణికులు హాహాకారాలు చేశారు. జాతీయ రహదారిపై వెళుతున్న వివిధ వాహనాల వారు బోల్తాపడిన బస్సులో నుంచి ప్రయాణికులను బయటకు తీసేందుకు శ్రమించారు. సమాచారం తెలిసిన వెంటనే స్థానిక ఎస్ఐ బ్రహ్మానాయుడు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. క్రేన్ తెప్పించి బస్సును గుంటలో నుంచి బయటకు తీశారు. ప్రయాణికులను వెలుపలికి తీయించారు.





ప్రమాదంలో 17 మంది గాయపడగా, వీరితో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో వీరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గాయపడిన వారికి చికిత్స చేయించారు. అనంతరం తీవ్రంగా గాయపడిన ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు. డ్రైవర్ అతివేగం కారణంగా బస్సు బోల్తా పడిందని ప్రయాణికులు తెలిపారు. కాగా, ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. బస్సు బోల్తా పడిన పరిస్థితిని చూస్తే ఎంతోమంది చనిపోయి ఉంటారని అందరూ భావించారు. సూళ్లూరుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గోదావరి మహా పుష్కరాల నేపథ్యంలో ప్రయోగరాజ్‌లో అధ్యయనం చేస్తున్న మంత్రి నారాయణ

**విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో రెండేళ్ళలో గోదావరి మహా పుష్కరాలు ఆరంభమవుతున్న నేపథ్యంలో, ముందస్తు అధ్యయనం కోసం కుంభమేళా ఏర్పాట్లు ఏపీ పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ బృందంప్రయాగ రాజ్ చేరుకున్నది. మంత్రి నారాయణతో పాటు మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్,రాజమండ్రి మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్2027 లో ఏపీ లో జరిగే గోదావరి పుష్కరాల ఏర్పాట్ల కోసం కుంభమేళా లో అధ్యయనం చేసారు.మంత్రి, అధికారులు. ఈ సాయంత్రం ప్రయాగ రాజ్ లో కుంభమేళా అధారిటీ ఆఫీసును సందర్శించిన బృందంకుంభమేళా ఏర్పాట్లు,రద్దీ నిర్వహణ,ట్రాఫిక్ నియంత్రణ,భద్రత చర్యలు గురించి మంత్రి బృందానికి ప్రెజెంటేషన్ ఇచ్చిన కుంభమేళా ఆఫీసర్ విజయ్ కిరణ్ ఆనంద్‌కుంభమేళా అధారిటీ కమాండ్ కంట్రోల్ రూాం ను పరిశీలించిన మంత్రి,అధికారులుస్నాన ఘాట్ల వద్ద ఏర్పాట్లను అక్కడి అధికారులతో కలిసి మంత్రి నారాయణ బృందం పరిశీ లించింది.

25-2P□g7exHMNWJQE.qxd:25-2P□g7exHMNWJQE.qxd 01/01/01 9:15 AM Page 1



# సభాపతి, మీడియాపై ఆంక్షలు ఎందుకు, పునరాలోచించండి: ఎపియూడబ్ల్యూజే

**విజయవాడ.ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధివ** రాష్ట్ర శాసనసభ సమావేశాల కవరేజికి కొన్ని పత్రికల, చానళ్ల,రిపోర్టర్లను అనుమతించకపోవడం సమంజసం కాదని , ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) వ్యాఖ్యానించింది.ఈ ఆంక్షలను తొలిగించాలని విజ్ఞప్తి చేసింది.ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు , ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఐజేయూ జాతీయ కార్యదర్శి డీ సోమసుందర్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివ ఏచూరి, సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు, విజయవాడ అర్బన్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు తప్పుపట్టారు. ఆమేరకు సోమవారం వారు ఒక మీడియా ప్రకటన జారీ చేసారు.రాజ్యాంగంలో చట్టసభలకు అత్యున్నత గౌరవం ఉందని, అదే విధంగా పత్రికా రంగానికి కూడా నాలుగో స్థంభంగా కీలకస్థానం ఉందని, శాసనసభ కవరేజికి అన్ని పత్రికల చానళ్ల విలేఖరులకు అవకాశం ఇవ్వాల్సి ఉండగా కొందరికి అనుమతి ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడం విచారకరమని , మీడియా పట్ల అలాంటి పక్షపాత ధోరణులు కొనసాగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని యూనియన్ నాయకులు ఆ ప్రకటనలో అభిప్రాయ పడ్డారు. ఈ విషయంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ అలాంటి నిర్ణయం తీసుకుంటారని తాము ఊహించలేదని, అపారమైన రాజకీయ అనుభవం, ప్రజాస్వామ్య పరిణతి కలిగిన సభాపతి తమ నిర్ణయాన్ని పునరాలోచించాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. గతంలో వైఎస్ ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో కొన్ని పత్రికలు , ఛానెళ్ల ప్రతినిధులకు శాసనసభ కవరేజికి అవకాశం నిరాకరించడం జరిగిందని , అవే తప్పులను కూటమి ప్రభుత్వం కొనసాగించడం 2024 ఎన్నికల తీర్పులోని ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొన్నారు. అలాగే ముఖ్యమంత్రి అధికారిక సమావేశాలకు కూడా కొన్ని పత్రికలు చానల్స్ ను పిలవకపోవడం తగదన్నారు. శాసనసభ స్పీకర్, ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునః పరిశీలించి , మీడియా ప్రతినిధులు అందరికీ అవకాశం ఇవ్వాలని , రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా మీడియా పాస్‌లో విషయంలో అత్యంత ప్రాచుర్యం కలిగిన తటస్ట పత్రికలకు సైతం తగిన పాస్‌లు ఇవ్వడం సరికాదన్నారు.

# శిద్దనకొండూరు కొండపై బయటపడిన శిలాశాసనం



**కలిగిరి,(నెల్లూరు) ఫిబ్రవరి 24 ప్రభాతవార్త;** కలిగిరి మండలం శిద్దనకొండూరు కొండపై 13వ శతాబ్దపు శిలాశాసనం బయట పడింది. వివివరాల్లోకి వెళ్తే శిద్దనకొండూరు కొండపై శ్రీ శిద్దేశ్వర స్వామి ఆలయం ఉంది. ఆ ఆలయానికి గ్రామస్తులు వెళ్తుంటారు. ఈక్రమంలో గ్రామానికి చెందినపాలిశెట్టి లక్ష్మీకాంతారావు అనేవ్యక్తికి ఆలయ పరిసరాల్లో శిలాశాసనాన్ని కనుగొనడం జరిగింది. ఈవిషయం కలిగిరి మండల బిజెపి నాయకునికి చేరవేయడంతోఆయన సహకారంతో చెన్నైకి చెందిన బారతీయ పురావస్తుశాఖ చెన్నై శాసన విబాగపతి డాక్టర్ ఎం .ఏసుబాబు, చిత్రకారులు రసూల్‌బాబు శిద్దనకొండూరు చేరుకున్నారు. గ్రామస్తుల సహకారంతో గ్రామానికి 2కిలోమీటర్ల దూరంలో ఉన్న శిలాశాసనాన్ని గుర్తించారు.ఈసందర్బంగా వారు మాట్లాడుతూ ఈ శిలాశాసనం 13వ శతాబ్దంలో రాయబడిందన్నారు.తెలుగు చోళరాజైన మనుమశిద్ది మహారాజుకుమారుడు శ్రీమనుమ గాండగోపాలుని కాలంలో శిద్దనకొండూరు ను పాలించే నూంకినాయకుడి కుమారుడు శిద్దప్ప క్రీస్తువకం 1290 వికృతనామ సంవత్సరం దశమి సోమవారం జారీ చేశారని వివరించారు.శిద్దనకొండూరు గ్రామం వెయ్యి సంవత్సరముల క్రితమే ఉన్నట్లు వాస్త్రం చేబుతుందన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్తాన చైర్మన్ రూపిశెట్టి రామబద్రరావు,జాతీయ అత్యుత్తమ ఉపాద్యాయ పురష్కారగ్రహీత నందనవనం ప్రబాకర్‌రావు, పాలిశెట్టిలఇక్ష్మీకాంతారావు,అంబటి శివశకర్,మురుగమ్మశ్రీకాంత్,గనిశెట్టిమాదవ, నేతి బాను, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత క్రెడిట్ కార్డులు, స్మార్ట్‌ఫోన్ గిఫ్ట్‌లతో బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్న సైబర్ నేరగాళ్లు

### బహుమతులు వస్తే జాగ్రత్తగా ఉండాలి: టిజిసిఎస్‌బి

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** ప్రజలను మాయచేయడంలో ఆరితేరిన సైబర్ నేరగాళ్లు ఈ క్రమంలో కొత్త పంథాను ఎంచుకున్నారు. ఇప్పటి వరకు స్టాక్ ట్రే డింగ్, డిజిటల్ అరెస్టు, లాటరీలు తదితర పద్దతుల్లో అమాయకులను బురిడి కొట్టించిన సైబర్ నేరగాళ్లు ఇప్పుడు కొత్తగా ఉచిత క్రెడిట్ కార్డులు వాటితో పాటు స్మార్ట్ ఫోన్‌లను బహుమతులుగా పంపుతూ వాటిని వాడుతున్న వారి బ్యాంకు ఖాతాల వివరాలు తెలుసుకుని నిమిషాల్లో నగదును కాజేస్తున్నారు. ఈ తరహా మోసం బెంగళూరులో వెలుగు చూడగా బాధితుడు ఏకంగా 2.8 కోట్ల రూపాయలను పోగొట్టుకున్నాడు. ఈ తరహా మోసాలపై అన్ని వర్గాల వారు అప్రమత్తంగా వుండాలని తెలం గాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అధికారులు హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు ఎంచుకున్న కొత్త పద్దతి వింతగా వుండడం విశేషం. గుర్తు తెలియని వ్యక్తు లు మేము పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాము. మీరు ఉత్తమ కస్టమర్‌గా ఎంపికయ్యారు. అందుకుగానూ మీకు అపరిమితంగా వాడుకునే క్రెడిట్ కార్డుతో పా టు దీనిని తీసుకుంటే ఖరీదైన స్మార్ట్ ఫోన్‌ను బహుమతిగా ఇస్తున్నాము. దయచేసి కాదనకుండా స్వీకరించండి. అని చెబుతారు. దీని తరువాత పార్శిల్‌లో ఇంటికి క్రెడి ట్ కార్డుతో పాటు స్మార్ట్ ఫోన్ వస్తుంది. వీటిని తీసుకుని ఫోన్‌లో సిం కార్డు అమర్చి ఫోన్‌ను వాడడం మొదలుపెట్టాక బ్యాంకు ఖాతాలో గల గూగూల్ పే, ఫోన్ పే వివరాలన్నీ సైబర్ నేరగాళ్లకు నిమిషాల వ్యవధిలో తెలిసిపోతుంటాయి. సైబర్ నేరగాళ్లు ఈ వివరాలు తెలుసుకునేందుకు బహుమతిగా పంపిన సెల్‌ఫోన్‌లో అంతకు ముందుగానే ఇన్‌స్టాల్ చేసిన క్లోనింగ్ యాప్ కీలకంగా వ్యవహరిస్తుంది. ఈ యాప్ వల్ల ఎలాంటి ఓటిపి అవసరం లేకుండానే బహుమతిగా వచ్చిన స్మార్ట్ ఫోన్‌లో సిమ్ కార్డులు వాడి వినియో గించిన ఖాతాదారుల వివరాలు సైబర్ నేరగాళ్లు కాజేస్తున్నారు. ఈ తరహా మోసాల పట్ల అన్ని వర్గాల వారు అప్రమత్తంగా వుండాలని టిజిసిఎస్‌బి అధికారులు కోరారు. ఉచితం గా క్రెడిట్ కార్డులు వాటితో పాటు స్మార్ట్ ఫోన్‌లు బహుమతిగా వస్తే ఎవరూ ఆశపడవద్దని వారు కోరారు. దీనిపై వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని వారు కోరారు.

## జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి

### రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు.. కలెక్టరేట్ల వద్ద నిరసనలు

**హైదదరాబాద్ ముషీరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్క రించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవ పున్నయ్య విజ్ఞప్తి చేశారు. టిడబ్ల్యుజెఎఫ్ పిలుపు మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సమాచారభవన్ వద్ద ఫెడ రేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన తెలపగా, జిల్లా కలెక్టరేట్ల ముందు జిల్లా కమిటీ నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఎస్.హరీష్‌ను కలసి వినతిపత్రం అందచేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం తదితర సమస్య లను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, కార్యదర్శులు గుడిగ రఘు, ఎస్.కే.సలీమ కార్యవర్గ సభ్యులు, కె.పాండురంగారావు, పి. నాగవాణి, మణిమాల, నాయకులు యర్రమిల్లి రామారావు, శ్రీనివాస్ గౌడ్, రవికుమార్, సిహెచ్ రంగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యకు 15 శాతం నిధులు కేటాయించేలా సిఎంకు నివేదిస్తా

### రాష్ట ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించే అంశాన్ని సిఎం రేవంత్‌రెడ్డిని సంప్రదించి కమిషన్ తరఫున నివేదిక అందజేస్తామని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విద్య రక్షణకు ఉద్యమించాలని, విద్యా హక్కు కల్పిం చకపోతే దళితులు చదువుకు దూరమయ్యేవారని అన్నారు. ప్రొఫెసర్ కె.లక్షీ ్మనారయణ మాట్లాడుతూ మనువాద భావాజాలం వల్లనె విద్యకు బడ్జెట్ కేటాయించకుండా దళితులను విద్యకు దూరం చేసే కుట్ర చెస్తున్నారన్నారు.

యంవి పౌండేషన్ జాతీయ కార్యదర్శి ఆర్.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామి ప్రకారం 15 శాతం బడ్జెట్ కేటాయించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు.

డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు.




# ఇందిరమ్మ ఇళ్లకు పసుపురంగులా!

## -రుయా ఆస్పత్రిని విశాఖలోని ఆస్పత్రి తరహాలో అభివృద్ధి చేయాలి - కాంగ్రెస్ ధర్నాలో మాజీమంత్రి డాక్టర్ చింతా

**తిరుపతి,ఫిబ్రవరి 24ప్రభాతవార్తప్రతినిధి:** గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సహకారంతో తిరుపతిలో దామినేడు వద్ద అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళకు జిల్లా అధికారులు పసుపురంగు వేయడం దారుణమని కేంద్రమాజీమంత్రి, మాజీ ఎంపి డాక్టర్ చింతామోహన్ ఖండించారు.తిరుపతిలోని రూయా ఆస్పత్రిని కర్నూలు, గుంటూరు, విశాఖలోని ప్రభుత్వ ఆస్పత్రుల తరహాలో అభివృద్ధిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. తిరుపతి రుయా ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దాలన్నారు.అన్ని విభాగాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నిరుపేదలందరికీ ఉచితంగా సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలను అందించాలని ఆయన సూచించారు. అలిపిరి వద్ద నిర్మిస్తున్న చిన్నపిల్లల ఆస్పత్రి భవనాన్ని రుయాకు కేటాయించాలన్నారు. టిటిడి పాలకమండలిలో ఈ విషయం చర్చించి చైర్మన్, ఇఒ నిర్ణయం ప్రకటించాలన్నారు. స్విమ్స్ ఆస్పత్రిలో పేదలకు వైద్యసేవలు గగనంగా మారాయన్నారు. డబ్బు కట్టందే వైద్యసేవలు అందడం లేదని ఆవేదన చెందారు. ఈ మద్యకాలంలో కూటమి నేతల పాపాలు ఎక్కువయ్యాయయన్నారు.. డబుల్ బెడ్‌రూమ్‌ల ఇళ్ళను పేదలకు ఉచితంగా ఇవ్వాలని చింతా రాష్ట్రప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ళకు పసుపు రంగులు వేయడం ఏంటని, జిల్లా కలెక్టర్,అధికారులకు ప్రభుత్వంపై మమకారం ఉంటే పసుపుచొక్కాలు వేసుకోవాలని ఆయన సూచించారు.

# ఎస్వీయూ రిటైర్డ్ టైం స్కేలు ఉద్యోగుల వయో పరిమితి పెంచండి

### - సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు ఎస్వీయూ ఉద్యోగుల విజ్ఞప్తి



**తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీలో జూనియర్ అసిస్టెంట్లుగా 30 సంవత్సరాలు పనిచేసి రిటైర్డ్ అయిన తర్వాత ఎటువంటి బెనిఫిట్స్ లేకపోవడంతో మా కుటుంబాల ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందని, కనీసం 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు రెండు సంవత్సరాలు వయోపరిమితి పెంచితే సంతోషంగా ఉంటుందని ఎస్వీయూ నాన్ టీచింగ్ టైం స్కేలు ఉద్యోగుల సంఘం సభ్యులు, ఎస్వీయూ రిటైర్డ్ టైం స్కేలు ఉద్యోగులు డీఎం విజయచంద్ర నాయుడు, కె. రెడ్డెప్పరెడ్డి, ఏ రమేష్‌బాబు, జి. నాగరాజు, బి. సిద్దయ్య, టీకే వెంకటరమణ ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బాబుకు విజ్ఞప్తి చేశారు. దీనిలో భాగంగా సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డీఎం విజయచంద్రనాయుడు మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా టైం స్కేలు ఉద్యోగులకు సమాన వేతనం లేదని, అలాగే రిటైర్డ్ అయిన తర్వాత రావాల్సిన బెనిఫిట్స్ ఏమీలేదని బాధపడ్డారు. అంతే కాకుండా గత ప్రభుత్వం 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పర్మినెంట్ ఉద్యోగులకు వయోపరిమితి పెంచారని టైం స్కేలు ఉద్యోగులనఉ పట్టించుకోక పోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ టైం స్కేలు ఉద్యోగులను గుర్తించి 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలు వరకు రెండు సంవత్సరాలు పాటు వయోపరిమితి పెంచాలని కోరారు. ఇప్పటికే రిటైర్డ్ టైం స్కేలు ఉద్యోగులు ఈ విషయమై సీఎం నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌బాబు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు.

# హంస,యాళీ వాహనాలపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్స వాల్లో సోమవారం ఉదయం స్వామి అమ్మవార్ల హంస, యాళీ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్స వాల్లో ఏర్పాట్లలో ఆలయాధికారులు సిబ్బంది నిమగ్నమై ఏర్పాట్లను చురుగ్గా చేస్తున్నారు. ఉత్స వాలను విజయవంతం చేయటానికి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశించారు. మూడు రోజులుగా ఆయన మాతృమూర్తి,మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ ర ంగినేని చెంచయ్యనాయుడులు పర్యవేక్షిస్తున్నారు. అయితే కొత్త నాయకత్వంతో కార్యాలయంలో శాఖల మధ్య సమన్వయం కుదరటం లేదు. ఎవరు ఏ పని చేస్తున్నారో అంతా అయోమయంగా మారింది.సోమవారం ఉదయం స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో చక్కగా అలంకరించారు.రాజేష్,సూరి గురుకుల్స్ స్వామి అమ్మవార్లతో పాటు పంచమూర్తులను చక్కగా ముస్తాబు చేయగా రంగినే చెంచయ్యనాయుడు హాజరు కాగా డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డిలు హాజరు కాగా ఆలయ అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామి నాథన్ గురుకుల్ స్వామి అమ్మవార్లకు హారతులిచ్చి గ్రామోత్స వానికి తరలించారు. వివిధ వాయుద్య బృందాలతో భక్తుల్ని గగుర్పాటు కల్పిస్తూ ఉత్స వాన్ని శివయ్య గోపురం, రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు చేర్చారు. స్వామి వారిని బంగారు హంస వాహనంపై, అమ్మవారిని బంగారు యాళీ వాహనంపై ప్రతిష్టించారు. స్వామి అమ్మవార్ల ముందు వినాయకుడు, వల్లిదేవ సేన సమేత సుబ్రమణ్యం స్వామి, కన్నప్ప వెళుతుండగా కోలాటాల బృందాలు కోలాటాలతో భక్తులను ఆకర్షించారు. గా ఓ వైపు తప్పెట్ల మోత,మరో వైపు బ్యాంకుమేళాలు, ఇంకొక వైపు సంప్రదాయ సన్నాయి,డోలు, ఇంకో వైపు శాక్స్,బ్యాంకు మేళాలతో ఊరేగింపు దద్దరిల్లింది.ఉత్స వాలను ఆలయ ఎఇఓ లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్ పెక్టర్ హరియాదవ్‌లు పర్యవేక్షించారు. ఊరేగింపు సందర్బంగా పట్టణ సిఐ డి.గోపి సూచనలతో ట్రాఫిక్ ఎస్‌ఐ, బాలాజి,వెంకటరెడ్డిలు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాలను దారి మళ్ళించారు. గ్రామోత్స వం తేరువీధి, నెహ్రూవీధి, సినిమావీధి, బాబూ అగ్రహారం, నగరి వీధి, బజారువీధుల గుండా సాగింది.

# గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికల వివరణ : మంత్రి పార్ధసారధి

**విజయవాడ,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త ప్రతినిధి:**గవర్నర్ ప్రసంగంలో గత ప్రభుత్వ విధ్వంసకర పాలన,రాష్ట్రానికి జరిగిన నష్టం,పది సూత్రాల ద్వారా ప్రస్తుత ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు స్పష్టంగా వివరించబడ్డాయని గృహ నిర్మాణం,సమాచార శాఖ మంత్రి పార్థసారథి అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని 10 లక్షల కోట్ల అప్పులతో అధోగతి పాలు చేసిందని, 9400 కోట్ల కేంద్ర రాయితీలను సద్వినియోగం చేసుకోకుండా రాష్ట్రపై భారం మోపారని ఆయన విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం 9,300 కోట్ల బకాయిలు చెల్లించి కోల్పోయిన పథకాలను పునరుద్దరించిందని, గత ఐదేళ్ళలో 10.4 శాతంకి పడిపోయిన జిడిపీని 2024-25లో 12.5%కి పెంచామని తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 ద్వారా ఈ లక్ష్యాలు సాధ్యమవుతాయని,బలహీన వర్గాల అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.గీత కార్మికులకు 15% రిజర్వేషన్,నాయీ బ్రాహ్మణులకు పలు రకాల సహాయాలు అందిస్తున్నామని వివరించారు. గృహ నిర్మాణానికి గత ప్రభుత్వం 1.80 లక్షలలో 30వేలు మాత్రమే ఇస్తుంటే,ప్రస్తుత ప్రభుత్వం 50వేల నుండి 70వేల వరకు అందిస్తోందని తెలిపారు.చంద్రబాబు గతంలో ప్రజల వద్దకు పాలన తీసుకువెళ్ళగా,ఇప్పుడు ప్రజల చేతుల్లోకి పాలన వచ్చిందని, దీనివల్ల పరిపాలన సులభతరమైందన్నారు.6లక్షల కోట్లతో 4 లక్షల ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించామని,తల్లికి వందనం వచ్చే విద్యా సంవత్స రం నుండి అమలవుతుందని ప్రకటించారు.ప్రస్తుత ప్రభుత్వంలో అభివృద్ధి,సంక్షేమం రెండూ సమతుల్యంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడాల్సి న జగన్ ఎంఎల్‌ఏలు ఒక వ్యక్తి కోసం దిగజారారని,పదవుల కోసం,హాజరు కోసం మాత్రమే సభకు వస్తున్నారని ప్రజలు వీరిని నిందిస్తున్నారని విమర్శించారు.

### వాల్తేర్ డివిజన్ మేనేజర్ గా లలిత్ బోహ్రా బాధ్యతల స్వీకరణ

**విశాఖపట్నం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ట్రాఫిక్, వాణిజ్య విధాన రూపకల్పనలో విస్తృత అనుభవం ఉన్న 1998 బ్యాచ్ ఐ.ఆర్.టి.ఎస్ అధికారి లలిత్ బోహ్రా విశాఖపట్నంలోని వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన భారత ప్రభుత్వ పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖలో సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. ఎమ్మెన్నార్‌ఈలో జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్నప్పుడు, ఆయన పీ.ఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన, పి.ఎం కుసుం, ఆఫ్‌షోర్ విండ్‌తో సహా పవన శక్తి విధానం, గ్రీన్ ఎనర్జీ కారిడార్లు, సౌర తయారీ కోసం పిఎల్‌ఐ పథకం తదితర పథకాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. ఆయన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీకి డైరెక్టర్ జనరల్ గా కూడా పనిచేశారు.

# నందీశ్వరులకు నిలయం శ్రీకాళహస్తి ఆలయం



**శ్రీకాళహస్తి , ఫిబ్రవరి 24:** పద్యాలల్లో ప్రబంద గణాల్లో మొట్టమొదటి వాడైన నందీశ్వరుని ప్రాధాన్య తను చక్కగా వివరించారు.ఏ శైవక్షేత్రంలో అయినా శివుని దర్శించుకోవడానికి ముందు నందీశ్వరుని అనుమతి కావాలన్నది భావ .శాంతానంద ప్రదాయమైన నందీశ్వరునికి సమస్కారం.పరమేశ్వరుని దర్శనానికి నీ అనుమతి ఇవ్వు నందీశ్వరా! అంటూ పేర్కొన్నారు.రెండవ శ్లోకంలో తిరుగుప్రయాణంలో నందీశ్వరుని వృషణాలను తాకుతూ కొమ్ముల నుంచి దర్శిస్తే కైలాసాన్ని దర్శించినంత భాగ్యమని పేర్కొన్నారు.ఈ ఏడాది 'మహాశివరాత్రి పర్వదినం' బుధవారం వచ్చింది. అంతేకాకుండా అరుదైన ఈ రోజు రావటం మహాశివరాత్రి బుధవారం త్రయోదశి రావటంతో నందీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించాలని పండితులు చెబుతున్నారు.కాబట్టి ఈ సారి శివరాత్రి నాడు శివయ్యతో పాటు ఆయన ముందు ఉండే నందీశ్వరుని దర్శనం మహాభాగ్యమని చెబుతున్నారు. అలాంటి నందీశ్వరునికి శ్రీకాళహస్తి దివ్య క్షేత్ర ంలో ప్రాధాన్యత కల్పించాలంటూ పలువురు కోరుతున్నారు.సాధారణంగ శైవక్షేత్రాలల్లో ప్రముఖమైనది శ్రీశైలం కొ ండకు వెళితే ముందుగానే మల్లన్నను నందీశ్వరుని కొమ్ముల నుంచి దర్శిస్తారు.అయితే వాయులింగక్షేత్రంగా ప్రసిద్ది చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామిగర్భలాయానికి ఎదురుగా వెలసినా స్వయంభువు నంది ఉంటుంది.ధ్వజస్తభం ఎదురుగా పడమరగా ఆలయ ప్రధాన గొడల ప్రక్కన్న పెద్ద నల్లరాతిలో నందిని ఏర్పాటు చేశారు.దర్శనానికి వెళ్ళె భక్తులు మొదట నంది వృషణాలలను తాకి దండం పెడుతుంటారు. కాగా ధ్వజస్థంభం ఎదుట ఓ సూక్ష్మనందిని ఏర్పాటు చేసారు. ఇలా దక్షిణ కైలాసంలో పలుచోట్ల నింది విగ్రహాలను ఏర్పాటు చేసారు.ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఉన్న ఏక శిలా విజయస్థంభంపై నందిని ఏర్పాటు చేసారు. ఉత్స వాల్లో కూడా ముందు ఏనుగు తరువాత నంది వెళుతుంటాయి. శ్రీకాళహస్వీశ్వరాలయంలో వెలసిన నంది ప్రాధాన్యత భక్తులకు తెలియజేయటానికి ప్రయత్నించాలని కోరారు.ఎంతో ప్రాశస్త్యం ఉన్న నంది శ్రీకాళహస్తిలో పట్టించుకోవడం లేదనే అసంతృప్తి భక్తుల్లో ఉంది. అ ందుకనో భక్తులు నందిశ్వరుని వద్ద మంచి క్యూ ఏర్పాటు చేసి అక్కడ ప్రాధాన్యత తెలపాలని కోరుతున్నారు.వాయులింగేశ్వరుని సన్నిధిల్లో స్వయంభువు నంది వెనుక రాగి నందిని ఏర్పాటు చేశారు.విఐపిలు,స్దానికులు ఈ మార్గంగుండా వెళ్ళుతు నందికొమ్ముల నుంచి దర్శనం చేసుకుంటారు.సామాన్య భక్తులకు మాత్రం ఈ ప్రాధాన్యతను గుర్తించక వాయులింగేశ్వరుని దర్శించుకుంటు వెళ్తుంటారు.ఆలయంలో నిర్వహించే పంచకాల పూజలల్లో ఎంతో ప్రాధా న్యత కల్గిన నంది స్వయంభువునందికి అత్యంత ప్రాధాన్యమైన నందీశ్వరుని ఈ దివ్యక్షేత్రంలో ఎంతో ప్రాధాన్యం ఇస్తారు.అక్కడ పిండం పెట్టడం ప్రాధాన్యత ఇచ్చారు.సాధారణంగా ఆలయ ంలో ఆనవాయితీ.

# వన్యప్రాణుల సంరక్షణకు కట్టుబడి ఉన్నాం

### బోర్డు సమావేశంలో మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** వన్య ప్రాణుల సంరక్షణ విషయంలో ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో మంత్రి కొండా సురేఖ అధ్య క్షతన 8వ రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వన్య ప్రాణుల సంరక్షణ, అటవీ, పర్యావరణ పరిరక్షణ అంశాలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరిగింది. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ అటవీ, జీవవైవిధ్య నిర్వహణ మెరుగుపరిచే దిశగా నిపుణుల సూచనలను ఆమె స్వాగతించారు. 7వ ఎస్‌బిడబ్ల్యు సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించిన మంత్రి.. జాతీయ వన్యప్రాణుల సంరక్షణ మండలి సమీక్షకు పంపిన పలు రాష్ట్ర ముఖ్య ప్రాజెక్టులపై ఆరా తీసారు. సమావేశంలో ప్రధాన అటవీ సం రక్షణాధికారి మాట్లాడుతూ 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు ఏర్పాటు తప్పనిసరిగాజరగాల్సి న అంశమని వివరించారు .జీవో నం 52, (2.12.2024) ద్వారా తెలంగాణలో ఎస్‌డబ్ల్యు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పోచారం వన్యప్రాణుల అభయారణ్యం నుంచి వెళ్లే మెదక్ యల్లారెడ్డి రహదారి విస్తరణకు అనుమతి మంజూరు చేశారు.అటవీ ప్రాంతాల్లో వీనీది లైన్ల ఏర్పాటు ప్రతి పాదనలపై చర్చ జరింది.ములుగులో 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, నాగార్జునసాగర్ డివిజన్‌లో పెద్దగట్టు ఎత్తిపోతల పథకానికి అనుమతి మంజూరు చేశారు. యానిమల్ పాసేజ్‌ల మార్పుల కోసం 18 ప్రతిపాదనలు, మొబైల్ టవర్ల కోసం 13 ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. ఎన్‌బిడబ్ల్యుకు పంపే ముందు అవసరమైన సవరణలపై చర్చించారు.మీసేవ ద్వారా యానిమల్‌మ్యాన్ కాంఫ్లిక్ట్ బాధితులకు పరిహారం చెల్లించడానికి కార్పస్ నిధి గురించి ఈ సమావేశంలో చర్చించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ల నుంచి 1,088 కుటుంబాల పునరావాసం వివరాల పై అధికారుల నుంచి వివరాలలను మంత్రి అడి తెలుసుకున్నారు.కమ్యూనిటీ ఆధారిత ఎకో టూరిజం ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించడమే కాకుండా అలాగే కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో భారీ వాహనాల రాకపోకలపై నిషేధాన్ని తొలగించే అంశాలను ఈ సమావేశంలో పరి శీలిం చారు. రాష్ట్ర వ్యాప్తంగా జంతు ప్రదర్శనశాలలు, జాతీయ పార్కులు, ఇంకా పట్టణ పార్కుల అభివృద్ధి కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.స్థానిక సేంద్రీయ చెట్లను ప్రాధాన్యతగా పెంచి, సహజ అటవీ వ్యవస్థను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా బోర్డు సభ్యుల సూచనలను మంత్రి కొండా సురేఖ అభినందించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, రామ్‌దాస్ నాయక్, ముఖ్య కార్యదర్శి నదీమ్, శిదిదినీ దోబ్రియాల్, ఎలు సింగ్, మంత్రి పీఎస్ సోమరాజు, ఇతర స్నతాధికారులు పాల్గొన్నారు.

### కెసిఆర్ 14 నెలలు అసెంబ్లీకి రాకపోవడం కూడా రికార్డే: మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** కోహ్లీ దుబాయ్ వేదికగా 14 వేల రన్నులు కొట్టి రికార్డు సృష్టిస్తే ప్రతిపక్ష నేత కేసిఆర్ 14 నెలల 14 రోజులు అసెంబ్లీకి రాకుండా రికార్డు సృష్టించారని మత్రి కొండా సురేఖ ఎద్దేవా.

# ఐఐటి హైదరాబాద్‌తో జర్మన్ విశ్వవిద్యాలయం భాగస్వామ్యం

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 24. ప్రభాతవార్త :** హైడెల్బర్గ్ విశ్వవిద్యాలయం (జర్మనీ) హైదరాబాద్ హబ్ ఇన్ అడ్వాన్స్‌డ్ కెమికల్ ఎడ్యుకేషన్‌ను సోమవారం ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో ప్రకటించింది. దీనికి సంబంధించి ఆయా సం స్థల ప్రొఫెసర్లు ఐఐటి హైదరాబాదులో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ హబ్‌ను జర్మనీలోని హైడెల్బర్గ్ యూనివర్సి టీ, భారతదేశంలోని ప్రతిష్టాత్మక సంస్థలైన ఐఐటి హైదరాబాద్, టిఐఎఫ్ఆర్ హైదరాబాద్‌ల భాగ స్వామ్యంతో ప్రారంభించింది.

హైదరాబాద్‌లో మంచి వనరుల లభ్యత, ఐఐటి హైదరాబాద్, పిఐఎఫ్ఆర్ హైదరాబాద్‌తో సత్స ంబంధాల కారణంగా హైదరాబాద్‌ను హబ్‌గా యెంచుకోవడం జరిగిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. హైడెల్బర్గ్ యూనివర్సి టీ జర్మనీలోనే పురా తనమైన విశ్వవిద్యాలయంగా, అంతరశాఖీయ పరి శోధన, విద్యారంగంలో ప్రపంచ నాయకత్వాన్ని కలిగి ఉందని, హైదరాబాద్‌లోని సంస్థలతో ఇప్ప టికే ఉన్న భాగస్వామ్యాలను విస్తరించు కుంటూ, ఈ విశ్వవిద్యాలయం ఒక దీర్ఘకాల ఇండోజర్మన్ కార్యక్రమంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తోందని అన్నారు.

25-2pg10.qxd:25-2pg10.qxd 01/01/01 7:02 AM Page 1



# ఛాంపియన్‌షిప్ సాధించిన ఆండ్రీవా

**న్యూఢిల్లీ:** రష్యన్ టీనేజర్ మిర్రా ఆండ్రీవా తన కెరీర్‌లో అతిపెద్ద విజయాన్ని సాధించింది. ఈ టోర్నీలో హేమాహేమీ క్రీడాకారిణులను ఓడించిన ఆండ్రీవా తాజా ర్యాంకింగ్స్‌లో టాప్10లోకి ప్రవేశించింది. క్లారా టౌసన్‌ను76 (1), 61 తేడాతో ఓడించి దుబాయ్ ఛాంపియన్‌షిప్‌లను గెలుచుకుంది. ఈ విజయం ఆండ్రీవాను డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో టాప్ 10లోకి చేర్చింది. 2007లో నికోల్ వైడిసోవా తర్వాత ఈ ఘనత సాధించిన మొదటి 17 ఏళ్ల అమ్మాయిగా ఆమె నిలిచింది. కాగా 2023 వింబుల్డన్ ఛాంపియన్ మార్కెటా వొంద్రౌసోవా, ఐదుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ ఇగా స్వియాటెక్, 2022 వింబుల్డన్ ఛాంపియన్ ఎలెనా రైబాకినాపై విజయాలు సాధించిన ఆండ్రీవాకు ఇది అసాధారణమైన సంఘటనగా చరిత్రలో నిలిచింది. తద్వారా, 2004 డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో షరపోవా తర్వాత ఒకే ఈవెంట్‌లో ముగ్గురు ప్రధాన ఛాంపియన్‌లను ఓడించిన అతి పిన్న వయస్కురాలిగా ఆమె నిలిచింది. డబ్ల్యూటీఏ 1000 ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరుకున్న అతి పిన్న వయస్కురాలిగా కూడా ఆమె చరిత్ర సృష్టించింది. గత సంవత్సరం రొమేనియాలో జరిగిన ఇయాసి ఓపెన్‌లో ఆండ్రీవా గెలిచిన ఏకైక టైటిల్ ఇది.



# సిడ్నీ క్లాసిక్ స్క్వాష్ ఛాలెంజర్‌లో.. విజేతగా భారత్ స్క్వాష్ స్టార్ సౌరవ్

**న్యూఢిల్లీ:** భారత స్క్వాష్ స్టార్ సౌరవ్ ఘోషాల్ తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. గత ఏడాది ఏప్రిల్లో ఆట నుంచి వీడ్కోలు తీసుకున్న సౌరవ్ ఈ ఏడాది మళ్లీరాకెట్ పట్టాడు. ఆస్ట్రేలియాలో ముగిసిన ఆక్టేన్ ఓపెన్ సిడ్నీ క్లాసిక్ స్క్వాష్ చాలెంజర్ టోర్నీలో సౌరవ్ విజేతగానిలిచాడు. ఫైనల్లో ప్రపంచమాజీ పదో ర్యాంకర్ సౌరవ్11-2, 11-6, 11-2తోఈజిప్ట్‌దేశానికి చెందిన అబ్దుల్ రెహమాన్ నాసర్‌పై గెలుపొందాడు. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌లో కలిపి మొత్తం12 పతకాలు సాధించినసౌరవ్, ఈటోర్నమెంట్‌లో తన ప్రత్యర్థులకు ఒక్క సెట్ మాత్రమే కోల్పోవడం విశేషం. సెమీ ఫైనల్లో సౌరవ్ 11-9, 5-11, 11-1, 11-2తో ఆస్ట్రేలియాకు చెందిన రైస్ డౌలింగ్‌పై, క్వార్టర్ ఫైనల్లో 11-6, 11-6, 11-5తో దక్షిణ కొరియాకు చెందిన మిన్యూ లీపై, రెండో రౌండ్‌లో 11-8, 11-2, 11-8తో మాల్టాకు చెందిన కిజాన్‌పై గెలుపొందాడు. రెండో సీడ్‌గా బరిలోకి దిగిన సౌరవ్‌కు తొలి రౌండ్‌లో బై లభించింది. 2003లో ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్ఏ) టూర్‌లో అరంగేట్రం చేసిన సౌరవ్ ఇప్పటివరకు 11 పీఎస్ఏ సింగిల్స్ టైటిల్స్ సాధించాడు. 18 టోర్నీలలో రన్నరప్‌గా నిలిచాడు.



ఆట

# ఇంటర్నేషనల్ ఛాలెంజ్ టోర్నీలో రన్నరప్‌గా భారత్ షట్లర్ ఉన్నతి

## ఇండోనేసియా చేతిలో ఓటమి



**న్యూఢిల్లీ:** సింగపూర్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్ ఉన్నతి హుడా రన్నరప్‌గా నిలిచింది. సింగపూర్‌లో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో నాలుగో సీడ్ ఉన్నతి 17-21, 16-21 పాయింట్ల తేడాతో ఇండోనేసి యాకు చెందిన రుజానా చేతిలో పరాజయం పాలైంది. 42 నిమిషాల్లో ముగిసిన పోరులో ఉన్నతి వరుస గేమ్‌ల్లో ఓడింది. టోర్నీ ఆసాంతం రాణించిన ఉన్నతి రెండో రౌండ్‌లో ఆసియా క్రీడల పతక విజేత, ఆస్ట్రేలియాకు చెందిన సయిన కవాకమిను ఓడించింది. సెమీఫైనల్‌కు చేరే క్రమంలో చైనీస్ తైపీకి చెందిన ఇద్దరు షట్లర్లు సైయాంగ్ స్యూన్ లిన్, యీ టింగ్‌పై కూడా ఉన్నతి విజయాలు సాధించింది. సెమీఫైనల్లో ఉన్నతి 18-21, 21-19, 22-20తో వియత్నాంకు చెందిన థి ట్రాంగ్ వు ను చిత్తు చేసింది. తొలి గేమ్‌లో పరాజయం పాలైన తర్వాత తిరిగి పుంజుకున్న ఉన్నతి హోరాహోరీ పోరులో చక్కటి విజయంతో ఫైనల్ చేరింది. అయితే తుది పోరులో యువ షట్లర్ అదే జోరు కనబర్చలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఇక ఇదే టోర్నీలో భారత్‌కు చెందిన మరో యువ షట్లర్ దేవిక సిహాగ్ క్వార్టర్ ఫైనల్లో ఓటమి పాలైంది.

# ఛాంపియన్స్ ట్రోఫీలో.. లోపాలే పాక్ ఫెయిల్యూర్స్

## చెత్తగా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ పాకిస్థాన్ ఓటమికి ఇవే కారణాలు



**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో కీలకమైన మ్యాచ్‌లో పాకిస్తాన్ 6 వికెట్ల తేడాతో భారత్ చేతిలో పరాభవం చెందింది. ఈ విజయంతో, భారత జట్టు సెమీఫైనల్స్‌ల్లోకి అడుగుపెట్టింది. ఈ ఐసీసీ టోర్నమెంట్‌లో ఆతిథ్య పాకిస్తాన్ పరిస్థితి దయనీయమైంది. ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ ఓడిపోవడానికి జట్టులో లోపాలు కారణమయ్యాయి. మ్యాచ్ ప్రారంభంలో పాకిస్తాన్ భారత్ పై పైచేయి సాధించినట్టు కనిపించింది. కానీ, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ వంటి అన్ని విభాగాల్లోనూ ఒక్కొక్కటిగా లోపాలు బయటపడ్డాయి. బాబర్ ఆజం ఓపెనింగ్ బ్యాటింగ్‌లో విఫలం కావడం ప్రధాన కారణం. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ జట్టు ఆరంభం చాలా దారుణంగా ఉంది. బాబర్ ఆజం, ఇమామ్ ఉల్ హక్ నెమ్మదిగా ఆరంభించారు. దీని కారణంగా పవర్ ప్లేలో జట్టు స్కోరు చాలా తక్కువగా ఉంది. అలాగే, వన్డే సగటు 50 కంటే ఎక్కువ ఉన్న అనుభవజ్ఞుడైన బ్యాట్స్‌మన్ బాబర్ 23 పరుగులు చేసిన తర్వాత ఔటయ్యాడు. ఆ తర్వాత వెంటనే, ఇమామ్ కూడా రనౌట్ గా పెలియన్ కు చేరాడు. ఇక పవర్ ప్లేలోనే కాకుండా మిడిలార్డర్‌లో కూడా పాకిస్తాన్ బ్యాటింగ్ చాలా నెమ్మదిగా సాగింది. మహ్మద్ రిజ్వాన్, షకీల్ మూడోసారి 104 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు, కానీ దాని కోసం 144 బంతులు ఎదుర్కొన్నారు. దీని కారణంగా, ఒత్తిడి చాలా పెరిగింది. పరుగులు సాధించడానికి ప్రయత్నిస్తూ ఒకరి తర్వాత ఒకరు బ్యాట్స్‌మెన్ వరుసగా పెవిలియన్‌కు చేరారు. అలాగే పాక్ తన ఫాస్ట్ బౌలింగ్ పట్ల చాలా గర్వంగా ఉంటుంది. ఆ జట్టు ప్రధాన బలాల్లో పేస్ బౌలింగ్ అటాక్ ఒకటి. కానీ పాక్ పేస్ అటాక్ కూడా భారత బ్యాట్స్‌మెన్ ముందు పనిచేయలేదు. ప్రారంభం నుండే శుభ్ మన్ గిల్, రోహిత్ శర్మలు బౌండరీలు బాదడం మొదలుపెట్టారు. షాహీన్ షా, నసీమ్ షా బౌలింగ్ ను సైతం రఫ్ఫాడించారు. షాహీన్ రోహిత్‌ను అవుట్ చేసినప్పటికీ, అప్పటికి చాలా ఆలస్యమైంది. మరోపక్క భారత్‌తో పోలిస్తే స్పిన్ బౌలింగ్ సాధారణమే. మిడిలార్డర్‌లో భారత బ్యాట్స్‌మెన్‌ను పాకిస్తాన్ జట్టు అవుట్ చేయలేకపోయింది. స్పిన్ బౌలింగ్‌లో నాణ్యత కనిపించలేదు. అయితే, అబ్రార్ మంచి బంతితో శుభ్‌మన్ గిల్‌ను ఖచ్చితంగా అవుట్ చేశాడు. కానీ అతని బౌలింగ్ భారత స్పిన్నర్ల మాదిరిగా ప్రభావం చూపించలేదు. కాగా విరాట్ కోహ్లిని అవుట్ చేయడంలో విఫలమైంది. పాక్‌పై కోహ్లి బ్యాట్ ఎప్పుడూ పనిచేస్తుంది. మరోసారి అదే జరిగింది. ఈ సారి కోహ్లి 100 పరుగుల ఇన్నింగ్స్ తో భారత్ ను గెలిపించాడు. ఈ మ్యాచ్‌కు ముందు విరాట్ అంత ఫామ్‌లో లేడు. అయినప్పటికీ, కోహ్లిని అవుట్ చేయడానికి పాకిస్తాన్ వద్ద ఎటువంటి ప్రణాళిక ఉన్నట్లు అనిపించలేదు. ఏ బౌలర్ కూడా కోహ్లిని అడ్డుకోలేకపోయారు. ఇదే సమయంలో భారత్ ఫీల్డింగ్ లో కొన్ని తప్పిదాలు చేసినప్పటికీ బౌలింగ్, బ్యాటింగ్‌లో అదరగొట్టడంతో పాకిస్తాన్ ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది.



# కబడ్డీ ఛాంపియన్స్‌గా సర్వీసెస్

## ఉత్కంఠ పోరులో రైల్వేస్‌పై 6-4తో విజయం

**న్యూఢిల్లీ:** ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో సర్వీసెస్ జట్టు విజేతగా అవతరించింది. కటక్‌లో జరిగిన తుదిపోరులో సర్వీసెస్ జట్టు ట్రైబ్రేక్‌లో 6-4 పాయింట్ల తేడాతో రైల్వేస్‌పై విజయం సాధించింది.
నువ్వా నేనా అన్నట్లు సాగిన పోరు నిర్ణీత సమయంలో 30-30 పాయింట్లతో సమం అయింది. దాంతో విజేతను తేల్చేందుకు ట్రైబ్రేక్ నిర్వహించగా, సర్వీసెస్ రెండు పాయింట్లతో పైచేయి సాధించింది. ప్రో కబడ్డీ లీగ్ స్టార్ నవీన్ కుమార్ సారథ్యంలో బరిలోకి దిగిన సర్వీసెస్ జట్టు టోర్నీ ఆసాంతం కనబర్చిన నిలకడనే ఫైనల్లోనూ కొనసాగించింది. పీకేఎల్ 11వ సీజన్ విజేతలైన జైదీప్ దహియా, రాహుల్ సర్వీసెస్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.
అంతకుముందు సెమీఫైనల్లో సర్వీసెస్ 43-35 పాయింట్ల తేడాతో పంజాబ్‌పై విజయం సాధించగా, మరో సెమీస్‌లో రైల్వేస్ 42-34 పాయింట్ల తేడాతో ఉత్తరప్రదేశ్‌పై గెలుపొందింది.

# ఇపిఎఫ్ఓ భేటీపైనే ప్రైవేట్ ఉద్యోగుల ఆశలు..

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరచడానికి ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఒ) అందించే సేవలను ఆధునికీకరించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) కోసం ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్లపై వడ్డీ రేటును ఖరారు చేయడానికి ఇపిఎఫ్ఒకు సంబంధించిన అత్యున్నత నిర్ణయాధికార సంస్థ అయిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) ఫిబ్రవరి 28న సమావేశమవుతుంది. సీబీటీ సమావేశం ప్రతి త్రైమాసికంలో నిర్వహిస్తూ ఉంటారు. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రి అధ్యక్షతన ఏర్పడిన సీబీటీలో ఉద్యోగి సంఘాలు, కార్మిక సంఘాల ప్రతి నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రభుత్వ అధికా రులు కూడా ఉంటారు. ఇపిఎఫ్ఒ ప్రస్తుతం ప్రావి డెంట్ ఫండ్ డిపాజిట్లపై 8.25 శాతం వడ్డీ రేటును అందిస్తుంది. అయితే సీబీటీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కూడా అదే రేటును కొనసాగించేందుకు నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పలు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ రేటును ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదించడానికి ముందు ఫిబ్రవరి 28న సీబీటీ



ఆమోదించాల్సి ఉంటుంది. 2023-24 ఆర్థిక సంవత్స రానికి ప్రస్తుతం 8.25 శాతం అందించే ఈ రేటు గత మూడు సంవత్సరాలలో ఇపిఎఫ్ఒ అందించే అత్యధిక వడ్డీ రేటుగా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి వడ్డీ రేటు 8.15 శాతం అందించగా, ఇటీవలి కాలంలో అత్యల్ప రేటు 2021-22లో 8.10 శాతమే అందించింది. గత దశాబ్దం కాలంలో ఇపిఎఫ్ఒ తరచుగా వడ్డీ రేట్లను మారుస్తోంది 2010-11లో అత్యధికంగా 9.50 శాతం వడ్డీ రేటును అందించింది. 2019 2021 మధ్య వడ్డీ రేట్లు 8.50శాతం వద్ద స్థిరంగా ఉన్నాయి. కోట్లాది మంది ఇపిఎఫ్ఒ సభ్యులకు రాబడిలో స్థిరత్వాన్ని నిర్ధారించడానికి ఇపిఎఫ్ఒ డిపాజిట్లపై స్థిర వడ్డీ రేటును అందించాలని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది.

# 8 నెలల కనిష్టానికి సెన్సెక్స్

**ముంబై, ఫిబ్రవరి 24:** దేశీయ మార్కెట్ల లో బేర్ పట్టు కొనసాగుతోంది. ట్రంప్ టారిఫ్ భయాల నుంచి సూచీలు కోలుకోవట్లేదు. దీనికి తోడు భౌగోళిక రాజకీయ పరిస్థితులు, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు మార్కెట్లను మరింత ఒత్తిడిలోకి నెట్టేస్తున్నాయి. దీంతో సోమవారం ఏకంగా 8 నెలల కనిష్టాలకు పడిపోగా, ఈ ఒక్క రోజే దాదాపు రూ.4 లక్షల కోట్లకుపైగా ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. చివరికి సెన్సెక్స్ 856.66 పాయింట్లు నష్టపోయి 74,454.41 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 242.55 పాయింట్లు నష్టపోయి 22,553.35 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ 4 పైసలు నష్టపోయి రూ.86.72 వద్ద స్థిరపడింది. ఆటో,




ఫార్మా, ఎఫ్ఎంసిజి మినహా దాదాపు అన్ని రంగాల షేర్లు కుదేలయ్యాయి. ముఖ్యంగా ఐటి, మెటల్, టెలికం సూచీలు 2 శాతం మేర పతనమయ్యాయి. నిఫ్టీలో విప్రో, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టిసిఎస్, టాటా స్టీల్ వంటి షేర్లు కూడా నష్టాలను చవిచూశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, ఐషర్ మోటార్స్, డాక్టర్ రెడ్డీస్, హీరో మోటార్స్, కోటక్ మహీంద్రా బ్యాంకు వంటి షేర్లు లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. అమెరికాలో ట్రంప్ అధిక టారిఫ్‌ల అమలుతో అక్కడ ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదు కావొచ్చని, దాంతో బాండ్ల ప్రతిఫలాలు పెరిగి భారత్ వంటి వర్ధమాన విపణుల్లో విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపబోరని బ్రోకరేజీ సంస్థ నోమురా అంచనా వేస్తోంది. ఇది సూచీల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు నెలకొన్నాయి. ఇవి ఇప్పుడప్పుడే సద్దుమణిగేలా కనిపించట్లేదు. ఇక రూపాయి పతనం, అమెరికా డాలర్ రిజర్వ్‌లు తగ్గడం, దేశీయంగా కార్పొరేట్ సంస్థల డిసెంబరు త్రైమాసిక ఫలితాలు బలహీనంగా ఉండడం, జిడిపి వృద్ధిపై ఆందోళనలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలహీనపరుస్తున్నాయి.

# ఇంటర్నెట్ లేకుండానే యుపిఐ చెల్లింపులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండా, యూపిఐ చెల్లింపులు చేయడం సాధ్యం కాదని అందరూ అనుకుంటారు. కానీ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) ప్రారంభించిన 'స్టార్99హ్యాష్' సర్వీస్ ద్వారా ఇంటర్నెట్ కనెక్షన్ అవసరం లేకుండానే లావాదేవీలను పూర్తి చేయవచ్చు. ఇంటర్నెట్ కనెక్షన్‌లేకుండా యుపిఐ ట్రాన్సక్షన్ ఎలా చేయాలో చూద్దాం. 'స్టార్99హ్యాష్' సర్వీస్ ద్వారా ఇంటర్నెట్ కనెక్షన్ అవసరం లేకుండానే, బ్యాంక్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు. ఇంటర్‌బ్యాంక్ ఫండ్ బదిలీ చేయవచ్చు. యుపిఐ పిన్‌ను సెట్ చేసుకోవచ్చు, మార్చుకోవచ్చు. అయితే యుపిఐచెల్లింపులు చేయాలంటే కొన్ని టిప్స్ పాటించాల్సి ఉంటుంది. మీ బ్యాంకు ఖాతాకు లింక్ అయిన రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నుంచి 'స్టార్99హ్యాష్'కు డయల్ చేయాలి. డయల్ చేసిన తర్వాత భాషను ఎంచుకోవాలి. మీ బ్యాంకు పేరును ఎంటర్ చేసిన తర్వాత, మీ మొబైల్ నంబర్‌కు లింక్ అయిన బ్యాంకు ఖాతాల జాబితా కనిపిస్తుంది. కావాల్సిన ఖాతాను ఎంచుకోవాలి. ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయడానికి డెబిట్ కార్డు చివరి ఆరు అంకెలు, గడువు తేదీని ఎంటర్ చేయాలి. యుపిఐ పిన్ నంబర్ సెట్ చేయకపోతే, సెట్ చేసుకోవాలి. మీ ఫోన్‌లో 'స్టార్99హ్యాష్' డయల్ చేసిన తర్వాత డబ్బు పంపడానికి ఆప్షన్ ఎంచుకోవాలి. ఆ తర్వాత ఎవరికైతే డబ్బు పంపించాలనుకుంటున్నారో. వారి యుపిఐ ఐడి, బ్యాంకు ఖాతా నంబర్ ఎంటర్ చేయడానికి కావాల్సిన ఆప్షన్ ఎంచుకోవాలి. మీరు పంపించాలనుకున్న మొత్తాన్ని ఎంటర్ చేసిన తర్వాత, లావాదేవీలను ధృవీకరించడానికి పిన్ నంబర్ నమోదు చేయాలి.




# మెక్సికో ఆపిల్ ప్లాంట్లు యుఎస్‌కు తరలింపు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 24:** మెక్సికోలోని ఆపిల్ సంస్థ యూనిట్లను అమెరికాకు తరలించే యోచనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేసింది. టిమ్‌కుక్ మెక్సికోలో రెండు ప్లాంట్లను నిలివేశారని, దానికి బదులుగా అమెరికాలో ఉత్పత్తులను తయారు చేస్తారని అమెరికా గవర్నర్ల సదస్సులో ట్రంప్ పేర్కొన్నారు. పెరుగుతున్న ట్యారిఫ్ ఒత్తిళ్ల కొనసాగుతున్న అమెరికా-చైనా వాణిజ్య వివాదానికి ప్రతిస్పందనగా ఈ మేరకు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కొందరు చెబుతున్నారు. అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల టిమ్‌కుక్ ట్రంప్‌తో వైట్ హౌజ్‌లో సమావేశమయ్యారు. చైనాలో చూపిన తన తయారీ నుంచి భారీగా వివిధ దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. అందులో కొంతభాగం అమెరికా ఎగుమతి అవుతోంది. అయితే ఇటీవల అమెరికా- చైనాల మధ్య సుంకాల విషయంలో తీవ్ర చర్చ సాగుతున్న నేపథ్యంలో టిమ్ కుక్ ట్రంప్ బేటీ అయ్యారు. కానీ గతంలో మాదిరి కాకుండా ఈసారి ఆపిల్‌కు ఎలాంటి మినహాయింపులు ఉండవని ట్రంప్ సంకేతాలు ఇచ్చినట్లు, ఈ ఆలోచన ట్రంప్ కుక్‌తో సమావేశమైన మరుసటి రోజే యూఎస్‌కు తయారీ ప్లాంట్ తరలింపు ప్రకటన చేయడం చర్చనీయాంశం అయింది. అమెరికాలో వందల మిలియన్ డాలర్ల పెట్టుబడి పెడతానని కుక్ హామీ ఇచ్చినట్లు ట్రంప్ తెలిపారు. ఈ పెట్టుబడి ఉద్యోగాలను సృష్టిస్తుంది. యూఎస్ సరఫరా గొలుసును బలపరుస్తుంది. ఉత్పత్తిని పునరుద్ధరించడం, బాహ్య ఆర్థిక ఒత్తిళ్ల నుంచి కీలక పరిశ్రమలను రక్షించేందుకు నిర్ణయించిన నిర్ణయాలు తన పరిపాలన విస్తృత లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఆపిల్‌పై ప్రభావం ట్రంప్‌కు సంబంధించి ఆపిల్ ఇంకా అధికారిక ప్రకటన చేయనప్పటికీ, తయారీ కార్యకలాపాలను అమెరికాకు తరలించడం ద్వారా దిగుమతి సుంకాల ప్రభావం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తుంది. ఇది లాభాల మార్జిన్లు, ధరలను ప్రభావితం చేస్తుంది. ఈ వ్యూహాత్మక మార్పు ఉద్యోగాల కల్పనతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని కొందరు అంచనా వేస్తున్నారు.



# ఎయిర్‌టెల్ కస్టమర్లకు ఆపిల్ టివిప్లస్

**ముంబై, ఫిబ్రవరి 24:** కస్టమర్లకు మెరుగైన కంటెంట్ సేవలు అందించేందుకు ప్రముఖ టెలికం సంస్థ ఎయిర్‌టెల్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. తమ వినియోగదారులకు ఆపిల్ టివి ప్లస్, ఆపిల్ మ్యూజిక్ కంటెంట్ సేవలను అందు బాటులోకి తీసుకొస్తోంది. దీని కోసం టెక్ దిగ్గజం ఆపిల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ మేరకు ఎయిర్‌టెల్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ సదుపాయం ఎయిర్‌టెల్ వైఫై, పోస్ట్‌పెయిడ్ కస్టమర్లకు అందుబాటులో ఉండనుంది. రూ.999 అంతకంటే ఎక్కువ ధర ఉన్న ప్లాన్లపై వైఫై యూజర్లు ఆపిల్ టివిప్లస్ కంటెంట్‌ను వీక్షించొచ్చు. పోస్ట్ పెయిడ్ యూజర్లయితే ఇదే ప్లాన్లపై ఆపిల్ టివిప్లస్ కంటెంట్‌తో పాటు అదనంగా ఆరు నెలల పాటు ఉచితంగా ఆపిల్ మ్యూజిక్ యాక్సెస్‌ను పొందవచ్చని కంపెనీ ఆ ప్రకటనలో పేర్కొంది. కాగా గతేడాది ఆగస్టులోనూ ఎయిర్‌టెల్ కంపెనీ, ఆపిల్‌తో ఇదే తరహా ఒప్పందం కుదుర్చుకుంది. అప్పుడు ఎక్స్‌ట్రీమ్ ప్రీమియం సబ్‌స్క్రైబర్లకు ఆపిల్ టివిప్లస్, ఆపిల్ మ్యూజిక్ కంటెంట్‌ను అందు బాటులోకి తీసుకొచ్చింది. తాజా నిర్ణ యంతో సాధారణ వైఫై, పోస్ట్‌పెయిడ్ యూజర్లూ ఈ సేవలు పొందొచ్చు. దీంతో కస్టమర్లు హాలీవుడ్, అవార్డ్ విన్నింగ్ సినిమాలు వీక్షించొచ్చు.




# వాణిజ్యం

## క్వాలిటీ పవర్ ఐపిఒ లిస్టింగ్

**ముంబై, ఫిబ్రవరి 24:** సోమవారం కూడా స్టాక్ మార్కెట్‌లో భారీ క్షీణత వాతావరణం నెల కొంది. ఉదయం ట్రేడింగ్ సెషన్‌లోనే బిఎస్ఇ సెన్సెక్స్ దాదాపు 700 పాయింట్లు పడిపోయింది. దీంతో దాదాపు రూ.5 లక్షల కోట్ల పెట్టుబడిదారులు నష్టపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ఎనర్జీ ట్రాన్సిషన్ ఎక్విప్‌మెంట్ తయారీదారి క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్స్ (క్వాలిటీ పవర్) ఐపిఒ రిటర్న్ ఇచ్చింది. దీని షేర్లు రూ. 7.05 లేదా 1.66 శాతం ప్రీమియంతో బిఎస్ఇలో లిస్ట్ అయ్యింది. ఐపిఒ ద్వారా రూ.10 ఫేస్ వాల్యూ ఉన్న కంపెనీ షేరు రూ.425కి అందుబాటులోకి




వచ్చింది. బిఎస్ఇలో కంపెనీషేర్లురూ.432.05 వద్ద లిస్టయ్యాయి. ఇది దాని అత్యున్నత స్థాయి. అయితే కొద్ది కాలంలోనే, దాని షేర్లు రూ.415.85కి పడిపోయాయి. 1.18 శాతం ప్రీమియంతో రూ.430 వద్ద ఎన్ఎస్ఇలో లిస్ట్ అయ్యింది. క్వాలిటీ పవర్ ఐపిఒ రెండు వారాల క్రితం అంటే శుక్రవారం (14 ఫిబ్రవరి 2025) నాడు ప్రారంభమైంది. గత మంగళవారం (18 ఫిబ్రవరి 2025) ముగిసింది. క్వాలిటీ పవర్ ఐపిఒ ధర బ్యాండ్‌ను ఒక్కో షేరుకు రూ.401-425గా నిర్ణయించింది. హై వోల్టేజ్ ఎలక్ట్రిక్ పరికరాలు అలాగే పవర్ సొల్యూషన్స్ సంబంధిత ఉత్పత్తులను తయారు చేసే ఈ కంపెనీ ఐపిఒ ద్వారా రూ.858.70 కోట్లు సేకరించాలని ప్రణాళికవేసింది. ఇందులో రూ.225 కోట్ల విలువైన కొత్త షేర్లు జారీ చేసింది. అదనంగా, ఇప్పటికే ఉన్న 1.49 కోట్ల షేర్లను కూడా అమ్మకానికి ఉంచారు. క్వాలిటీ పవర్ ఐపిఒ దాదాపుగా ఆశించిన సబ్‌స్క్రిప్షన్ పొందలేదు. బిఎస్ఇ డేటా ప్రకారం, ఐపిఒ 1,11,12,530 షేర్లకు గాను 1,43,31,330 షేర్లకు బిడ్లను అందుకుంది. పబ్లిక్ ఇష్యూ మొత్తం 1.29 సార్లు సబ్‌స్క్రైబ్ చేయబడింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps